UNIVERSAL LIBRARY
OU_204096
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 923.21 V46P Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

**Approved for school use (please Vide Fort Saint George Gazettee Part I B. April 14th 1931 Page 269.)**

# పరీక్షిత్తు

(నారాశంసి)

గ్రంథకర్త

పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి



ద్వితీయముద్రణము.

పిఠాపురము

శ్రీ విద్వజ్జనమనోరంజనీ ముద్రాక్షరశాల

1932

[వెల రు 0-12-0.

# అంకితము.

ఏసత్పురుషుఁడు తాను నిస్స్వుఁ డయ్యు యాచించి స్వగ్రామ మగు 'మేడపాడు' నందు మహాలింగేశ్వరాలయముఁ గట్టించి శివప్రతిష్ఠఁ జేసెనో, ఏవిరాగి మఱునాఁటికిఁ దనకుండునో లేదో యని సందేహింపక యన్నదానముం జేయుచుండునాఁడో, ఏసర్వసముఁడు తా నభ్యంజనముఁ జేసికొనునప్పుడు బీదలగు పరిసరపుగవరలపిల్లలకు ముందుగ స్వయముగ తలనంటియు, పండుగులలో నంత్యజులకు పిండివంటలతో భోజనము పెట్టియుఁగాని తృప్తినొందకుండెనో, ఏసంయమి సంగీతవిద్యావంతుఁడయ్యు సంగీతము సర్వేశు నుతించుటకేకాని సానులచేఁ బాడించుటకుఁ గా దని, సానిమేళములకుఁ బోవ నని శపథ మూనియుండెనో, ఏపౌరాణికుఁడు తనవాఙ్మాధుర్యముచే శ్రోతల నానందవార్ధిమగ్నులం జేయుచుండెనో, ఏజ్యోతిష్కుఁడు తనమరణదినముఁగూడ చెప్పి యట్లే పరమపదము నందెనో, వెనుకటి ప్లవంగసం॥ర జ్యేష్ఠ శుద్ధ ౧౩ నాఁడు పుట్టి జయసం॥ర ఆశ్వయుజ శుద్ధ ౬ నాఁడు పరమపదము నొందిన యీమాతండ్రిగారగు వెంకయ్యగారికిని,

ఏసాధ్వీమణి భర్తకు తోడునీడయై యన్నదానాదిసత్కర్మల నాచరించెనో, ఏసతీమతల్లిక దాన శక్తిచే వందుకొనుగిన్న

నొకయాన్న సతీసిరోమణియును, మంగళసూత్రము నొకవిద్యావం
బుఁడు తపస్వియు నగు సద్బ్రాహ్మణునివివాహమునకును,
భర్తాజ్ఞచే దాన మొసంగెనో, ఏజనని తాను మంచముపట్టినను,
యేఁబదిమూఁడేండ్లు గల నన్నుఁగూర్చి నాయన భుజించినఁగాని
తాను భుజింప నని మనుమరాండ్రితో ననుచుండునో, ఏశిశువ
త్సల, తల్లిలేనివాయిరువురుకుమార్తెల సమ్మతిహస్తమై పెంచి
పెద్దవారిం జేసెనో, ఏపుణ్యవనిత గర్భశోకము నెఱుఁగక ము
గ్వురుకొమరులు, పదిమందిమనుమలు, ముమ్మనుమలు గలది
యై విద్వత్పుత్రిక, విద్వత్సోదరి, విద్వద్భర్తృక, విద్వత్పుత్రి
యై యదృష్టవంతురాలనిపించుకొనుచు, వెనుకటి కాళయుక్తి
సం॥ర ఆశ్వయుజ శుద్ధ ౧౫ నాఁడు జన్మించి ఈయాంగీరసనం॥
ర చైత్ర శుద్ధ ౬ నాఁడు (ది 12-4-32 నం॥) పరమేశ్వరసన్ని
ధానమునకుఁ జేరెనో యామాతల్లి రామాంబకును,

సచ్చరితమగు నీపరీక్షిచ్చరితము నంకిత మొనర్చుచున్నా
ను. ఇది నాపితృదైవతములకు పుష్పసదృశమగుఁగాక.

పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి.

ఓం

# పీఠిక

ఇరువదేండ్లనుండి, కలాశాలలోను, జాతీయకలాశాలలోను, నున్నతపాఠశాలలలోను, సంస్కృతాంధ్రభాషల కుపాధ్యాయుఁడనుగా నుండి బాలుర మనస్తత్త్వములఁ గుర్తెఱిఁగి యీగ్రంథము ననుభవపూర్వకముగ వ్రాసితిని. బాలురకు భాషతోఁగూడ, ప్రాచీనచరిత్ర, స్వసాంఘికమతాచారములు, దైవభక్తి కూడ మిగుల నేర్పుట యావశ్యకమై యున్నది. మఱియు భారతీయులకుఁ బరమప్రమాణములగు వేదములలోని యంశములుకూడ బోధించుట ముఖ్యతమము. ఇపుడు విద్యార్థి భవిష్యత్తున గృహస్థు కాఁగలఁడు. అతఁడు గృహస్థాశ్రమస్వీకారము నొందునపు డెటులు ప్రవర్తింపఁగలవాఁడో తెలిసికొనుట యత్యవసరము. మఱియు దేశభక్తియు రాజభక్తియుఁ బ్రతిజనునకు ముఖ్యతమములు. పై యంశముల నిందు బీజప్రాయములుగఁ బొందుపఱచితిని. అయినను,

శ్లో. ఆపరితోషా ద్విదుషాం
న సాధుమన్యే ప్రయోగవిజ్ఞానం.

తా. ప్రయోగవిజ్ఞానమును విద్వాంసులు సంతసించువఱకు సాధువని తలంపను.

ఇట్లు
పెం. వేం. సు. శాస్త్రి.
గ్రంథకర్త.

## విషయసూచిక.


| | | పుటం |
|---|---|---|
| 1 | పూర్వగాథ | 1 |
| 2 | పరిక్షిజ్జననము | 4 |
| 3 | ధర్మజుఁ డశ్వమేధయాగముఁ జేయ నుద్యుక్తుఁ డగుట | 11 |
| 4 | అర్జును దిగ్విజయము | 15 |
| 5 | అశ్వమేధము | 23 |
| 6 | పరిక్షిత్తుబాల్యదశ, ధృతరాష్ట్రాదులమృతి | 28 |
| 7 | యాదవాంతః కలహహేతువులు, తన్మరణములు; కిరాతవిజృంభణము | 39 |
| 8 | పరిక్షిత్పట్టాభిషేకము | 51 |
| 9 | పాండవుల స్వర్గారోహణము | 57 |
| 10 | పరిక్షిద్రాజ్యపాలనము | 63 |
| 11 | మాద్రవతీపరిక్షిత్తుల వివాహయత్నము | 72 |
| 12 | పరిక్షిత్తు మాద్రవతిం బెండ్లియాడుట | 76 |
| 13 | గోపరిపాలనము | 82 |
| 14 | మృగయావ్యసనము | 90 |
| 15 | పరిక్షిత్తు శాపతప్తుండగుట | 94 |
| 16 | పరిక్షిత్ప్రయత్నములు | 97 |
| 17 | శ్రీశుకోపదేశము | 98 |
| 18 | తక్షకునిప్రయత్నములు | 107 |

# పరీక్షిత్తు

## ప్రథమప్రపాఠకము

### ప్రసమానువాకము

పూర్వగాథ

శ్రీమహావిష్ణునాజ్ఞచేఁ బ్రవర్తించు నిప్పటిచతుర్ముఖుని ద్వితీయపరార్ధమున, శ్వేతవరాహకల్పమునందగు వైవస్వత మన్వంతరంబునందైన నీకలియుగమునఁ బదునాలువందల యిరువదాఱు సంవత్సరములు గడచినపిమ్మట *శ్రీమంతంబగు నీ భరతఖండంబున నొకమహాసమరము ప్రవర్తిల్లెను. అది కురుక్షేత్రము కేంద్రస్థానముగాఁ గలది యగుటచేఁ గురుక్షేత్ర సంగ్రామమనియుఁ గౌరవులకుఁ బాండవులకునైన యుద్ధమగుటచేఁ గురుపాండవయుద్ధమనియు భరతవంశస్థులే యందుఁ బ్రధాననాయకు లగుటచే భారతయుద్ధ మనియుఁ బేరువడసెను.

---

* విష్ణు వాయు భాగవతాది పురాణములనుండి యీకాలనిర్ణయము చేయఁబడినది.

ఆమహాజన్యమునఁ బెక్కువేలుగజములు, ననేకలక్షల హయములు, పడియుటయేకాక, డెబ్బదిరెండులక్షలకు మించిన దృఢాంగులగు మనుష్యులును మృతినొందిరి. ఆవీరులలో శతాధికవయస్కులు మొదలు పదునాఱేండ్ల ప్రాయమువఱకుఁ గలవారుండిరి. భరతఖండ మిప్పటివలె నప్పుడు ముప్పదిమూఁడుకోట్ల జనసంఖ్య గలదికాక, స్వల్పజనసంఖ్యాకలిత మగుటచే నంతటి జననష్టమును సహింపలేక నతితమముగా సంక్షోభించెను. దేశమునం దేమూలఁ జూచినను, తండ్రులు సోదరులు సుతులు భర్తలు బంధువులు గతించుటచే నవయుననాథలగు సతీమణుల కన్నీటిచే భారతభూమి పంకిలమై వారి రోదనములచే దిశలు ప్రతిరోదనముఁ జేయుచుండెను. కురుక్షేత్రము యుద్ధమున కెటులు కేంద్రస్థాన మయ్యెనో, స్త్రీలరోదనమునకును నటులనే కేంద్రస్థాన మయ్యెను. అందు హస్తిపురి మఱియు నడిమిబొట్టయ్యెను. ఆపట్టణమునం దేవంకఁ జూచినను, భర్తృబంధుసుతాదులమరణములచే శోకించువనితల రోదనములే—ఏవైపుఁ జూచినను బంధుమరణకారకులగుఁ బాండవుల శపించువాక్యములే—ఏదెసఁ జూచినను యుద్ధములోని భయంకరవార్తాప్రసంగములే—ఏప్రక్కఁ గనుఁగొనినను భర్త్రాది మరణములచేనగు వృత్తిభంగమువలననైన దరిద్రతకుఁ గాతరులగు స్త్రీలయొక్కయు, బాలబాలికలయొక్కయు, వృద్ధులయొక్కయు విలాపములే—ఏదిశం గనినను క్షతగాత్రుల హాహాకారములే ప్రవర్తిల్లె

ను. హాహాకారములతోఁ గూడిన యుద్ధములోని సైనికుల విషాదమరణములఁ జూచియుఁ, బురిలోని రోదనముల వినియు బంధుమిత్రపుత్త్రాదుల మరణములచే విచారసాగరమగ్నుం డయ్యె ధర్మరాజు కృపణతాసంతప్తహృదయుండయి విరక్తిచే రాజ్యమునొల్లననఁగా, సోదరులు ద్రౌపదిమొదలగువా రాతనిఁ బ్రవృత్తిమార్గమునకుఁ ద్రిప్ప నెంతగాఁ బ్రయత్నించినను నాతని మనస్సు తేఱుకొనదయ్యెను. పిమ్మట శ్రీకృష్ణభగవానుఁడును గర్మయోగంబునకుఁ ద్రిప్ప నెంతయో యత్నించె. యుద్ధారంభమున నర్జునవిమోహమునుం బోలె నేఁడు ధర్మజుని కార్పణ్యదోషోపహతస్వభావమును శ్రీకృష్ణుఁడుఁ బోఁగొట్టలేఁడయ్యె. పిమ్మట శ్రీవ్యాసభగవానుఁడు తనవాక్పుణ్యముచే నాతని కుపదేశించినప్రవృత్తిమార్గమే నివృత్తిమార్గమునుండి పెడమొగము పెట్టించి రాజ్యాభిషేకమునకును, పిమ్మట ద్రోణాదుల హత్యలచే నగుపాపపరిహారమునకై మూఁ డశ్వమేధయాగములఁ జేయుటకును హేతువయ్యెను. వ్యాసునానతిని "అహీన" మనునశ్వమేధముఁ జేయనెంచెను. పాండవులు సంతాననాశముచే సంతప్తులగుచు, నభిమన్యుకళత్రమగు నుత్తర గర్భవతి గాన తద్గర్భస్థశిశువుపైనే తమసకలమనోరథముల నాధారముఁ జేసికొని యూఱడిల్లుచుండిరి. అశ్వమేధయాగమునకు ద్రవ్యమును సంపాదించుటకుఁ బోకతప్పనందున, ధర్మజుఁడు, స్వసైన్యుఁడగు యుయుత్సునిఁ బురరక్షణమునకు నియోగించి, సోదరులను, సైన్యమును దో

డ్గాని వ్యాసోపదేశముచే, నుత్తరాపథమునకుఁ బూర్వమే హిమాలయోత్తరభాగమునకుఁ బోయెను. ధర్మరాజాదులు పురము వెలువడిన మఱునాఁడె యశ్వమేధయాగనిర్వహణమునకు ధర్మజునిచే నంతకుమున్నె యాహ్వానితుఁడగు శ్రీకృష్ణభగవానుఁడు తద్యాగనిర్వహణ కుతూహలాయత్తచిత్తుండయి సహోదరమిత్ర పరివారముగ హస్తిపురి కేతెంచెను.

---

## ద్వితీయానువాకము

### పరిక్షిజ్జననము

శ్రీకృష్ణుఁడు హస్తిపురిఁ బ్రవేశించిననాఁడె యుత్తరకుఁ బ్రసవవేదన మారంభ మయ్యెను. ఆమెసూతికాగృహ మరిష్టోచిత పరికర సహితమయ్యెను, అరిష్టశూన్యమై ననిష్టహైన్యముతో, గదాధర పరిరక్షితమై యగదంకారసన్నిహితమై, ధవళ కుసుమ యుక్తములు, సితసర్షప సహితములు, లాజపూర్ణములు నగు కుంభములచే శుభప్రదంబై విరాజిల్లుచుఁ, బ్రజ్వలితాగ్నిచేతను, బ్రదీప్తశస్త్రాస్త్రములచేతను, పిచుమందపల్లవాదులచేతను, బాలగ్రహాదిభూతపరిహారభూతమై, చికిత్సకలు దక్షులు చతురలు వృద్ధలు హితలు నగు పుణ్యావనితలచేఁ బరిపరివిధములఁ బరిశోధింపఁబడుచు నిర్మలమై యుండెను.

ఆమె ప్రసవవేదనాదోదూయమానయగుచుండియు, నభిమన్యు మరణజస్మృతిచేఁ జింతామగ్నయయ్యు, జనిష్యమాణ పుత్రముఖావలోకన కౌతూహల మొకవంక నాకర్షించి దుఃఖాపనోదన మొనర్చుచుండ స్వల్ప ప్రసవవేదన మొందియె పురుషశిశువుం గనెను.

వెంటనే పుణ్యాంగనలు పురుషుఁడుపుట్టెపుట్టె నని కేక లుపెట్టిరి. పౌరులందఱు సంతోషసూచకధ్వనులఁ జేసిరి. వెన్వెంటనే మృతశిశువని సూతికాగృహములోనివారు వెక్కి వెక్కి యేడ్చిరి. కుంతీసుభద్రాదులకే కాక పౌరులందఱకుఁ గలిగిన యానందశోకరసముల భావశబలత యొక్క క్షణములోనే శోక రసమునకు స్థాయీభావ హేతువయ్యెను. ఉత్తర మృతశిశువుం గనుటను వినుటచేఁ గృష్ణసాత్యకులకుఁగూడ విషాదముజనింపఁ గృష్ణుఁడు సాత్యకితోఁ గొంతియున్నెడకు సత్వరంబునఁ జనుదెంచుచుఁ దన కెదురుగ వచ్చు కుంతీసుభద్రాద్రౌపదులఁ గాంచి తానును విషాదాకులమానసుండయ్యె. అప్పు డాపృథ పురుషోత్తముకడ డగ్గుత్తిక నాలుంగు దగఁల నిట్లని యేడ్చెను.

“కృష్ణా! నాకును మత్సంతతికిని నీవేగతియైయుంటివి. కుఱ్ఱయగు నీమేనల్లునకుఁ గూరియుండఁగ నశ్వత్థామ యొక్క యిషీకాస్త్రహతిచే మృతబాలుం డుద్భవించెను. అయ్యశ్వత్థామ దారుణంబగు బ్రహ్మశిరోస్త్రమును బ్రయోగించుఃపు

మాతృగర్భస్థ శిశువు నవశ్యముఁ గాపెద నని కృపాయత్త చిత్తుండవై ప్రతిజ్ఞఁ జేసితివి. కాన యీశిశువును బ్రతికింపవా? ఆశిశువుయొక్క జీవితముతోడనే నాజీవిత మున్నది. ఆశిశువు బ్రతుకకున్నయెడల ద్రౌపదీసుభద్రలు జీవింపరు. ధర్మజుండు నాతనిసోదరులు నట్టివారె. ఈవంశమున కుదకపిండప్రదానము లాశిశువు జీవింపకున్న నిలుచును. మత్స్యనందన నీచే నొకనాఁడు నీగర్భజనితుఁడు నాచేఁ గాపాడఁబడునని యూఱడింపఁబడినది. కాన యామెయార్తిని దొలఁగింపవే ! నీవీకులమును నిలిపితివి. దాని నీబాలుని జీవింపఁజేసి స్థిరపఱుపవే" యని వెక్కివెక్కియేడ్చి యిలాతలంబున కొఱఁగెను. అపుడు ససంభ్రముఁడై గోవిందుఁ డాకృష్ణను లేవనెత్తి యను నయవాక్యంబులం దేర్చుచుండ సుభద్ర యిట్లని విలపించెను.

"కృష్ణా! గురుపుత్త్రుండు భీముపై నెత్తినమహాస్త్రము నయొక్క ఫలము నర్జునుఁడును దత్పత్నియుఁ దుదను బొందిరి. నిముఱుఁది యీయభిమన్యుపైఁ గలయధిక ప్రేమముచే నాతనిమరణమునకు వగచుచుండ నీమనుమఁడుగూడ నిట్లు వమ్మయిన నాతఁడేమగునో నీకే తెలియును. ధర్మజుఁ డేరీతి నెవ్వగ భరియించును? భీముఁడును గవలు నేరీతి దుఃఖశాంతినొందుదురు? కృష్ణా! వినుము. గురుసుతుఁ డస్త్రముఁ బ్రయోగించునపుడు నీవాతని నదలించి కుచ్చితుఁడా! నిన్ను మోఘాస్త్రం జేతువంటివి. ఉజ్జ్వలతేజుఁడవగు నీమహిమానుభావము మాకుఁ దెలి

యుటచే నూఱడిల్లియుంటిమి. అశ్వత్థామాస్త్రభీతి నొందకుంటి మి. సత్య దయాశ్రితాభిరక్షలు నీకు నైజగుణములు. నీకనేక నామములం జేతు. దేవా! వెల్లువై మేము వగపుచే వివిధపరి తాపములు నీయెదురం జేయుచుంటిమి గాని లోకములన్నియు మృతినొందినను బునరుజ్జీవింపఁజేయు శక్తిగల నీవు మాకాలం బుఁ గాపాడక నీమేనమఱందిపౌత్రుఁ జావవిడుతువా ?

అంతఁ గృపాశోకంబులు మల్లడిఁగొను నుల్లంబుతో శ్రీకృష్ణభగవానుఁడు మేఘగంభీరస్వనంబున బాలు బ్రదుకఁ జేయుదునని యెల్లవారు మోదమందఁ బలికె. కుంతీసుభద్రాదుల వెంట సూతికాగృహంబుఁ బ్రవేశింపఁ బురోగామియగు ద్రౌ పది, యటులనఁ బుడమిఁ బడియున్న యుత్తరను లేవనెత్తి 'మాన్యనందనా! మాధవుఁడేతెంచెఁ గనుమా' యన, నమ్మానిని విస్రస్తవేణీభరంబుతో వెన్నునకు మ్రొక్కుచు "భక్తార్తిఁ బా పుట నీకతిదృఢవ్రతముగాదా? యీ బాలుని బ్రతికింపవా? గోవిందా! నీవు నీమేనల్లునకుఁ గూఁతైన వానికుమారుని ద్రోణ నందనుఁడు పొలియఁజేయఁగలాఁడే? పతిహీనయగు పాపాత్ము రాలను నాకుఁ బుత్రహీనతయు నైన నెట్లు బ్రతుకుదును? ఈనిసుఁగుచావు నిక్కమయ్యెని నిక్కముగ నిప్పుడ నీమేనల్లుని తావున కేనును బోవుదును. పద్మనాభా! నీవు వచ్చినపుడు నీ సన్నిధికి బాలునెత్తుకొనివచ్చి మ్రొక్కింతునని యాసపడుచుం టిని. ఆయాసను ద్రౌణి వమ్ముచేసె" నని విలపించి యంత

నిలువక మృతబాలు నంకతలంబున నిడికొని తదాననం బాఘ్రాణించి "బిడ్డా! లోకగురుండగు తాత దామోదరుఁడు వచ్చి యుండఁగా ధర్మవేదియగు తండ్రికి జన్మించిన నీవిట్లు ధర్మవ్యతిరేకముగా మ్రొక్కకుండుట యుచితమా! కన్నువిచ్చి నన్నును గుంతీమహాదేవిని జూడవా? ద్రౌపదీసుభద్రలం గనవా?" యని బిట్టు పలవించుచు మూర్ఛిల్లెను. ఆమెయొక్క యప్పటియవస్థఁ గనుఁగొని కరుణాతిశయముచే విలీనతనొందిన మనంబులు, సబాష్పనయనంబులు, పాడఱిన మోములుగల కౌరవాంగనలఁ గాంచినఁ బగవారికైనను విచారాతిశయము గలుగకపోదు. ఇట్లుండఁ గొంతదడవునకు మత్స్యరాజనందన తెలివొంది యట్లే యుండి ఫాలతలంబునఁ గేలుమొగిచి వెక్కివెక్కి యేడ్చుచు గోపాలదేవునకు మ్రొక్కుచు శరణుశరణని పలికిన నప్పరమ కృపానిధి యోడకోడకుమని పాదప్రక్షాళనోపస్పర్శనంబులఁ గావించి బ్రహ్మాస్త్రప్రయోగవిధిచే నశ్వత్థామప్రయుక్తంబును, బ్రహ్మశిరోనామకంబును నగు నమ్మహాస్త్రంబు నుపసంహరించి యబ్బాలుని మృతకళేబరమును శయ్యాతలంబునఁ బెట్టంబనిచి, దగోల్లసితులై యెల్లవారు విన శ్రీకృష్ణుఁ డిట్లనియె. "ఓప్రజలారా! సత్యమగునామాట వినుఁడు. మీరును పాండవులు నిబ్బాలుం గని యామోదింపఁ బ్రతికింతు నని ప్రతినసేసి,

తే. పగఱయెడనైన నే బొంకు • పలుకనేని
సమరముఖమున నెన్నఁడుఁ • జలితవృత్తిఁ

బిడ్డఁడి కడు గిడనేని యి♦ప్పిన్నవాని
యంగమున జీవ మీప్రొద్ద ♦ యావహిల్లు.

క. ధరణీసురకులమునెడం
గర మెక్కుడు ప్రియము నాకుఁ ♦ గలదేని, సధ
ర్మరతుఁడనయేని, నియ్యు
త్తరాసుతుఁడు లబ్ధజీవి♦తత్త్వము నొందున్.

తే. మహితసత్యంబు పరమధ♦ర్మంబు గాఢ
నిర్మలబ్రహ్మచర్యంబు ♦ నిత్యసంప్ర
తిష్ఠితంబులై నాయందుఁ ♦ దేజరిల్లు
నేని యిబ్బాలునకు జీవ ♦ మిపుడ వచ్చు."

అని పలుకునంతలో నబ్బాలకునిలో జీవంబు ప్రవేశించి యంగకంబులు గదల నచటనున్న వారల హృదయాంబుజంబు లాబాలకుని నయనాంబుజంబులువలె వికసించె. ఆసూతికా గృహంబును నబ్బాలకుని యంగకంబులు ప్రకాశించినవడువున బ్రకాశించె. బాలకుని రోదనధ్వనితోపాటు సూతికాగృహగతు లగు జనుల హర్షధ్వనులును వెనువెంటనే పౌరుల యానంద ధ్వనులును, తోడ్తోడ దుందుభి భేరీ కాహళాది మంగళధ్వనులు భూనభోంతరాళములఁ బొదుకొనియె. అట్టియెడ నుత్తర బాలు నడ్డాన నిడుకొని వాసుదేవునికడ కేతెంచి సాగిలఁబడి మ్రొక్కి వినుతించె. నాఁటినుండియె శ్రీకృష్ణునకుఁ బరిక్షిత్ప్రాణసంధాత

యను మహాబిరుదము కలిగె. కుంత్యాదు లానందసాగరమున నోలలాడుచు శ్రీకృష్ణు నానందపరవశవాక్యంబుల వినుతించిరి. ఆహాస్తిపురమునందు శోకరసముపోయి యానందరసము వెల్లివిరిసె. అప్పుడు శ్రీకృష్ణుఁ డుత్తరాసూనుఁ జేత నిడుకొని, యిబ్బాలుం డాదిరాజగుణయోగియు వంశోద్ధారకుండును నగుఁగాక యని యాశీర్వదించి,

తే. ఆత్మకులము పరిక్షీణ♦మైన జనన
మందెఁ గాన నియ్యభిమన్యు ♦ నందనునకు
నర్హమగుఁ బరిక్షిన్నామ ♦ మనియెఁ గృష్ణుఁ
డఖిలజనములు వినఁ గార♦వాధినాథ.

మఱియుఁ గొందఱీబాలుఁడు గర్భస్థుఁ డై యున్నకాలముననె శ్రీకృష్ణుఁ, డశ్వత్థామప్రయుక్తాస్త్రవహ్నిచేఁ గాల్పఁ బడు నని యిబ్బాలు నంగుష్ఠమాత్రపురుషుండై గదచే నస్త్రము నణఁచి రక్షించె ననియు, బాలుఁడు పుట్టినతోడనే గర్భమునఁ గాచిన యాశ్రీకృష్ణునికై నలుదిక్కులఁ బరీక్షించెను గానఁ బరీక్షిత్తుఁ డయ్యె ననియుఁ జెప్పుదురు. అందువలన నితనిఁ బరిక్షిత్తనియు, బరీక్షిత్తనియు రెండువిధములఁ బిలుతురు.

ప్రాణములు కుదురుకొనిన వెంటనే ప్రపౌత్రుఁ డని కుంతియుఁ బౌత్రుఁ డని ద్రౌపదీసుభద్రలును, మేనల్లునితనయుఁ డని కృష్ణబలదేవాదులు దౌహిత్రుం డని మాత్స్యులు రత్నాభరణాదుల నలంకరించిరి. ఒక్కయుత్తరయేకాక కుంతీ ద్రౌపదీ

సుభద్రి లిబాలు నల్లారు ముద్దుగఁ బెంచుచు ముగ్గురుతల్లుల ముద్దుబిడ్డఁగాఁ జేసికొనిరి.

---

## తృతీయానువాకము.

ధర్మజుఁ డశ్వమేధయాగముఁ జేయ నుద్యుక్తుఁడగుట.

మున్ను మరుత్తరాడ్యజ్ఞదత్త దక్షిణాధన మపారమగుట ను, విప్రులు దాని ననుభవింప శక్తిలేముని హిమాలయోత్తర భాగమున నేకమనస్కులై దీని నెవ్వరు తెలిసికొనిన వారిద యగుఁగాక యని నిక్షేపముఁజేసిన యపారధనమును పాండవులు వ్యాసోపదిష్ట విధిచేఁ ద్రవ్వించి, యసంఖ్యాకంబులగు వేసడం బులపై, వృషభంబులపై, గుఱ్ఱంబులపై, బండ్లపై మోయిం చుకొని పరిక్షిజ్జన్మవార్తను, శ్రీకృష్ణాగమనవార్తను, శ్రీకృ ష్ణుఁడు పరిక్షిత్తును బ్రిదికించినవార్తను, మధ్యేమార్గంబున నా లించి, యపారానంద సాగరమున నోలలాడుచు హాస్తిపురిపరి సరంబునఁ గృష్ణాదులచే నెదుర్కొనఁబడి పరిక్షిత్తు జనియించిన నెలదినములకు శుభసమయంబునఁ బురిం బ్రవేశించి, ధృతరా ష్ట్రాది కురువృద్ధుల కానంద మొసఁగ నందనపురస్సరంబుగ ధన పాత్రిలాభంబుల విన్నవించిరి. అంతఁ గృష్ణద్వైపాయనుఁ జేతెంచి ధర్మజునిచే నుచితసత్కారంబుల నొంది, ,, ధర్మనంద

నా! నీకు గురువును, బ్రాహ్మణుఁడును నగు ద్రోణు నసత్యమాడి కామకృత బ్రహ్మహత్యకుఁ గారణభూతుఁడ వైతివనియుఁ బితామహుఁడగు భీష్ముని, సోదరుఁడగు కర్ణుని వధించుటకుఁ గారణభూతుఁడవై జ్ఞానాజ్ఞానకృతదోషములఁ జేసితివనియు, పితృసఖుఁడగు భగదత్తుని, జ్ఞాతులగు భూరిశ్రవ, సోమదత్త బాహ్లికాదులను దుర్యోధనాదులను జంపించుటకు హేతుభూతుఁడ వైతివనియు నీకు మనోవ్యథ మిక్కుటముగా నున్నది. నీసోదరులు నట్టివిచారమునె పొందుచున్నారు. ద్రోణవధకుఁ బ్రత్యేక మొక యశ్వమేధమును, జ్ఞాతి బాంధవ మిత్రముల వధకు వేఱొక యశ్వమేధమును, నింతటియుద్ధమైనను, నీసామ్రాజ్య మంగీకరింపని పరరాష్ట్రాధిపుల నదిమి కప్పములఁగొని సమ్రాట్టువను ఖ్యాతినొందుటకు మఱియొక యశ్వమేధమును, మొత్తము మూఁడశ్వమేధములఁ జేయవలసియున్నది. దీనికి వేదమివ్విధమునఁ దెల్పుచున్నది. వినుము.

(1) "ఎవ్వఁ డశ్వమేధమును జేయునో యాతఁడు బ్రహ్మహత్యా దోషమునుండి తరించును. తరించును."

(2) "ఎవఁ డశ్వమేధయాగముఁ జేయునో యాతఁ

---

(1) "తరతి తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతే" కృష్ణయజుర్వేదః.

(2). "యోఽశ్వమేధేన యజతే సర్వ ఏవ భవతి సర్వస్య వా ఏషా ప్రాయశ్చిత్తిః సర్వస్య భేషజగ్ం సర్వంవా ఏతేన పాప్మానం దేవా అతరన్నపి వా ఏతేన బ్రహ్మహత్యామతరం త్సర్వం పాప్మానం." కృష్ణయజుర్వేదః.

డన్ని సత్కర్మలను జేసినవాఁడే యగును. అన్ని పాపములకు నిది యే ప్రాయశ్చిత్తము. సమస్తమనోరోగములకు నిదియె దివ్యౌషధము. ఈయజ్ఞముచేతనే దేవతలు సర్వపాపములను బోఁగొట్టుకొనిరి. ఇంతమాత్రమె కాదు. దీనిచేతనె దేవతలు బ్రహ్మహత్యనుగూడఁ బోఁగొట్టుకొనిరి."

అందువలన సకలజ్ఞాతివధమహాదోషమే కాక ద్రోణవధకుఁ జేయఁదగు ప్రాయశ్చిత్తముకూడ నీవు చేసికొనిన వాఁడ వగుదువు.

(1) "ఎవఁడు రాష్ట్రాక్రమణముఁ జేయునో వాఁ డశ్వమేధముఁ జేయు" నని కలదు—"నీవింతటి సమరమున జయము నొందినను, ప్రాఁబగల మనమునఁ బెట్టుకొని ప్రాగ్దిశ యందుఁ బ్రాగ్జ్యోతిషాధిపుఁడును భగదత్తునిసుతుఁడునగువజ్రుఁ డును, మీపక్షముననె పోరి యుద్ధమున వీరమరణమునొందిన మగధేశుండగు సహదేవునిసుతుఁడు మార్జారి, తనతాతయగు జరాసంధపక్షాభిమాని యగుట నాతండును, దక్షిణదిశను త్రిగర్తులును, దశార్ణదేశాధీశుఁ డగు చిత్రరథుండును, పశ్చిమమున సైంధవునిజ్ఞాతులును, నిషాదదేశంబున "నేకలవ్య" సుతుండును, పశ్చిమోత్తరభాగంబున గాంధారరాజగు శకుని సుతుండును, నీసామ్రాజ్య మంగీకరింపక ధిక్కరించుచున్నారు. వారలనోడించి సామ్రాజ్యము నిల్పుకొనుటకై మూఁడవ

(1) యో రాష్ట్రం క్రామతి సోఽశ్వమేధేన యజతే, కృష్ణయజుర్వేదః.

యశ్వమేధ మవసర"మనిన యుధిష్ఠిరుఁ "ఓ మహానుభావా! నే
నశ్వమేధము చేయుటచే నాపాతకములు నశించునుగాని తక్కిన
నాసోదరులయొక్కయు, సాత్యక్యాదులయొక్కయుఁ బాతకము
లెట్లు తొలఁగునో యానతీయవే"యన నప్పారాశర్యుం డిట్లనియె.
"యుధిష్ఠిరా! అందఱు నశ్వమేధము చేయనక్కఱలేదు.
*అశ్వమేధయాగమున నవభృథస్నానముఁ జేసిన వందఱకును
బ్రహ్మహత్యాదోషము తొలఁగు" నని ధర్మశాస్త్రమునఁ గల
దు. కావున నీవు భూరిదక్షిణలతో ముఖ్యముగా మూఁడశ్వ
మేధములను జేయు" మన, ముకుందుండును దగిన తెఱంగున
ముచ్చటింప, ధర్మజుఁడు వల్లెయనె. ద్వైపాయనుఁడు రాఁబోవు
చైత్రశుద్ధపూర్ణిమనాఁడు సంకల్పముఁ జేసి యశ్వమును భూప్ర
దక్షిణమునకై విడువుమన నయ్యుధిష్ఠిరుండును దగినవారలఁ
దనయశ్వములలో నశ్వమేధోచితముగుదాని నేఱుఁడస వారట్టి
యశ్వము నేఱి ముందల నిలుప నంతసిల్లి యది పారాశర్యున
కెఱుకపఱచి యాధ్వర్య్వాదుల నేర్పఱింపఁగోరెను. అందుల కా
కృష్ణద్వైపాయనుండు కర్మమీమాంసాకర్తయగు జైమినికిఁ
బ్రియశిష్యుఁడయిన యాజ్ఞవల్క్యునధ్వర్యునిగాను, దనశిష్యు
లగు పైలాదులఁ దక్కినఋత్విజులఁగాను నేర్పఱుప నయ్యాజ్ఞ
వల్క్యుండు శ్రౌతవిధులఁ దెలిసిన తనశిష్యునొక్కరు మేధీ

* సూ॥ అశ్వమేధినంవాఽవభృథ మేవావేత్య ముచ్యతే॥ ఆపస్తంబ సూత్రము.

యాశ్వము లో భూవలయముఁ జుట్టివచ్చునప్పు డయ్యెడలఁ జేయఁదగు కర్మకలాపంబుల నిర్వర్తింప నియోగించెను. అశ్వ రక్షణమున నర్జునుఁడె యర్హుఁడని కృష్ణాదులు తలఁచుటచే ధర్మజుఁ డాపార్థుచే ననిపించికొని నియోగించి భీమ నకులుల రాష్ట్రరక్షణమునకును, యజ్ఞార్థవస్తుసంపాదనకై సహదేవుని నియమించి, తాను ద్రౌపదీసమేతుండై గాంధారీ ధృతరాష్ట్రుల చేతను గుంతిచేతను విదురుచేతను ననుజ్ఞాతుండై శుభముహూర్తంబున స్వస్తివాచనపూర్వకంబుగా దీక్షితుఁడయ్యె.

---

## చతుర్థానువాకము.

### అర్జును దిగ్విజయము.

పౌత్రలాభ ముదితుఁ డగుటను పార్థుండు కౌంతపుత్త్ర శోకాపనోదము సేసికొని పౌత్త్రుని బాల్యచేష్టలఁ గాంచి యానందించుటకు విఘ్నకారియై యశ్వమేధాశ్వరక్షణ మొందు సంప్రాప్తంబగుడు విధ్యర్థంబుఁ గైకొని జయజయధ్వానంబులు మిన్నుముట్టఁ బ్రజలునుతింప నయ్యశ్వంబు వెంటఁ బ్రయాణ మయ్యెను.

అప్పు డయ్యజాతశత్రుఁ డర్జునుంగాంచి "సోదరా! మహాయుద్ధమున జనసంక్షయమయ్యె. వీరాధివీరులు మడిసిరి.

భూమినిర్వీర్యమయ్యె. కొలఁదివీరు లుండినను వారు బాలుఁడు, క్షీరకంఠులు. పడుచుఁదనమున నెవ్వరేని నిన్నెదిరించినను దో లుత, దండోపాయమూనక సామాదికముచేతనే కార్యముఁ జక్కఁబఱుపుము. కార్యము గానియపుడు యుద్ధముఁ జేయు మని బోధించి యాశీర్వదించి పంపె.

అవ్విజయుండును, యాజ్ఞవల్క్యశిష్యుం డశ్వమేధాశ్వము ఖాదముసేయునపుడు, నిలుచునపుడు, నీరుఁద్రావునపుడు, విష్టించునపుడు, మూత్రించునపుడుఁ జేయువిధులను విధ్యుక్తముగ నెఱవేర్చుచుండఁగా దిగ్విజయమునకు వెడలెను. (1) ఆసందిని, హరితత్రసక్కును, రుక్మపట్టమును ధరించి ధాన్యాశియగు నయ్యశ్వము చూపఱకు నింపుగ నుండెను. అశ్వసంరక్షణమునకై పురోగాములై కవచములఁదొడిగి కవదొనలఁబూన నూర్వురు రాజపుత్త్రులును, నూర్వురు రాజన్యులును, నిరుపార్శ్వంబులను నిషంగములు గలిగిన నూర్వురుసూతపుత్త్రులు, నందఱే గ్రామాధికారులపుత్త్రులును, శతసంఖ్యాకులగుకరగ్రాహుల పుత్త్రులును, వందమందిదండధారులును, దృఢాంగులగు నశ్వసైనికులును, నశ్వమేధాశ్వముం బలిసి రక్షించుచుండిరి.

ఆయశ్వము భూప్రదక్షిణముగఁ బోయి (2) ప్రాగ్జ్యో

(1) శతపథబ్రాహ్మణ, ఐతరేయబ్రాహ్మణములనుండి యీయంశములు గ్రహింపఁబడెను.

(2) ఇప్పటి యస్సాము పూర్వము ప్రాగ్జ్యోతిషము.

తిషముఁ జొచ్చెను. తత్పురాధీశుఁడగు వజ్రదత్తుఁడు భగదత్తు
నిపుత్త్రుఁడు—భగదత్తు నర్జునుఁడు సుప్రతీకముతోఁగూడ మహా
యుద్ధమునఁ జంపెను. ఆపగ మనంబున నంటియుంటయు, యౌ
వనగర్వంబు దన్నుఁ బురికొల్పుటయుఁ గారణంబులుగా వాఁ
డాసైన్యము నెదిరించి మేధాశ్వముం బంధించెను. అర్జునుఁ
డన్నయానతిచే సామవాక్యము లెన్ని చెప్పిన నాతఁ డాలకింప
నందున మహాజన్య ముభయులకును మూఁడునాళ్లయ్యెను.
నాలవనాఁ డర్జునుండు వజ్రదత్తు మహాగజమును నేలఁగూల్చి
యాతని నలయించి జితోస్మి యనిపించి సాదరముగ నాతని
నశ్వమేధమున కాహ్వానించెను. పిమ్మట నయ్యశ్వము రాజ
గృహపట్టణపరిసరమునం బరిభ్రమింప జరాసంధపౌత్త్రుండును
మాగధేశుండునగు మార్జారి, తనతండ్రి సహదేవుఁడు పాండవ
పక్షపాతి యైనను బితామహునియందలి యభిమానముచేఁ,
బడుచుఁదనమునకుఁ బరిపాటియగు గర్వముచే నర్జును నెదిరించి
ఘోరరణ మొనర్చి యోడి విజయునకు విజయమునిచ్చెను.
పిమ్మట నాతనిచే నాహూతుఁడై ధర్మజు నశ్వమేధమునకు
వచ్చెద ననెను. తరువాత నాయశ్వ మర్జునుండు వెన్నాడ ను
త్కల, కళింగ, గాంధ్ర, చోళాది దేశముల నిరాతంకముగ నిర్గ
మించి ద్రావిడదేశమునకుఁ దరలెను. అట మణిపూరుపురాధీ
శుండును, చిత్రాంగదార్జునులకు జన్మించి మాతామహుండగు
మలయధ్వజునకు దత్తుఁడైన బభ్రువాహనుం డర్జునురాక వా

దవ్వాలన విని పితృభక్తిపురస్సరంబుగ నెదుర్కొని గౌరవించెను. అయ్యర్జునుండును భీష్ము నన్యాయంబుగ శిఖండినెపంబునఁ దాఁ జంపినందులకుఁ దనపైఁ గినిసి వసువులు గంగాదేవియనుమతిఁ గొని తన్నుఁ జెడశపింపఁ దలంపఁ దచ్ఛాపమహిమ ప్రేరేచుట చే బభ్రువాహనునిఁ జూచి యిట్లనియె. “నీవు క్షత్త్రియునకుఁ బుట్టినవాఁడవై తేని యాగాశ్వము బంధింపక విడిచెదవే” యని నిందింప నాతం డేమియు మాఱువలుకనేరక పురికి మఱలివచ్చు చుండఁ బుట్టంబుట్టువానికూఁతురు నర్జునుభార్యయు నగునులూపి బభ్రువాహనునకుఁ గాన్పించి తన్ను సాపత్నిగా నెఱింగించుకొని యర్జునుతో సమరమునకుఁ బురికొల్పెను. బభ్రువాహనుండును నేను క్షత్త్రియుఁడన యని యర్జును నెదిరించి ఘోరరణము గా వించి యర్జునాస్త్రములచేఁ దాను మూర్ఛమునుంగులోన తన యస్త్రములచేఁ బార్థుండు సగముచచ్చునట్లు సేసెను. పిమ్మట నులూచి నంజీవమణిం దెచ్చి సేదదేఱిన బభ్రువాహనునిచే నర్జునినెద్దపై నుంపించునంతలో నర్జునుండు నిద్దురనుండి లేచిన వానివలె లేచి యులూపిచే యావద్వృత్తాంతమును విని యానం దించి యులూపీచిత్రాంగదాబభ్రువాహనుల నగ్గించి వారల నశ్వమేధయాగమున కాహ్వానముచేసి పశ్చిమాభిముఖుండై యజ్ఞాశ్వమును వెన్నంటి పోయెను.

అట్లు పోయిపోయి యాతఁడు త్రిగర్తదేశముఁ జొచ్చెను.

త్రిగర్తులకు నర్జునునకు నెడతెగని వైరము గలదు. *త్రిగర్తా ధీశుఁ డగుసుశర్మ కురుక్షేత్రిసంగ్రామమునఁ బదునెనిమిదిదిన ములు ససైన్యసోదరుఁడై ఘోరముగఁ బోరి యర్జునిచేత నె మృతినొందెను. శ్రీకృష్ణునంతటి మహానుభావునిసయితము సం శప్తకులచే నర్జునుఁ డేమయ్యెనో యని కంట నీరువెట్టునట్లు చేయఁగలిగినత్రిగర్తదేశీయు లశ్వముతో నర్జునుఁ డేతెంచె నని విని యూరకుందురా ? తమపితృ భ్రాతృ లర్జునుచేఁ జచ్చి నపగను మఱతురా ? అశ్వమును బంధించి ఘోరసమరమునకుఁ గడంగిరి. అర్జునుం డన్నయజాతశత్రునిసందేశము సెలింగించి నను బితృపితామహాదుల మరణామర్షణ మెదల మెఱుగుచుం డుటచేఁ దిగర్తనివాసులు సూర్యవర్మయను రాజుఁ బురస్క రించుకొని యర్జునుపైఁ గవిసిరి. ఆసూర్యవర్మయు నాతని సోద రులు కేతువర్మ ధృతవర్మలును వెనుదీయక పోర నతఁడు కరు ణపెంపున వారికి నొవ్వడరకుండ యుద్ధముచేయుటచే బలహీన తగా నెంచి ధృతవర్మ యర్జును గాండీవము చేతనుండి పడున ట్లుగా నేసి యాతనికి గోపముఁ దెప్పించెను. పిమ్మట నాతనిచే నేటులుపడి సోదరసైన్యసహితముగాఁ బరువిడఁ గొందఱు త్రిగ ర్తలు శరణుసొచ్చిరి. అందుల కాతండు వారలఁ గాంచి

* త్రిగర్తదేశము రాజపుత్రస్థానములోని కొంతభాగము. త్రి + గర్త=త్రిగర్త. గర్తమన గొయ్యి. సాంబరు, సదు, డిడ్వానా, యనుసర స్సులుగల ప్రదేశమే యీత్రిగర్తదేశము కావచ్చును.

కాచితి నని వారల నధ్వరమున కాహ్వానముసేసి సింధుదేశము నశ్వానుయాయియై ప్రవేశించెను.

సైంధవ తత్పితృవధలచే నెదలు విషాదకలితంబులగుడు సైంధవులు సైంధవపుత్త్రుం బురస్కరించుకొని సైంధవసమేతుఁ డగు సైంధవారి నరికట్టిరి. అర్జునుండును నయవాక్యంబుల వారిం దేర్పఁజూచినను వారు కలఁకఁదేఱక యలుకమెయి నలుఁగుల నాతని ముంచిరి. ఫల్గునుండు నఫల్గుబాణంబుల సైంధవులను ముంప నాయంపవెల్లిచేఁ బటాపంచలగు సైంధవపుఁ బటాలంబులఁజూచి సైంధవసూనుఁడు హృదయ మవిసి యంతఃపురంబుచేరి యంతకపురి కరిగెను.

పతిపుత్త్రమరణంబులచే దుస్సహశోకాంబుధినిమగ్నయగు దుస్సల బాలపౌత్త్రుఁ జేతులనుంచుకొని వైధవ్యాపాదకుఁ డగు నర్జునుపాదంబులపైఁబడి నిర్వంశము కాకుండఁగ నీనిసుఁగు నీపౌత్త్రుంబోలె రక్షింపు మనఁ, దోడంబుట్టువునైన దయతలంపక వైధవ్యయుక్తంగాఁ జేయు క్షత్త్రధర్మము నెద నసహ్యించుకొనుచు ,, సోదరీ! నీపౌత్త్రుఁడు నాపౌత్త్రునట్టివాఁడ. నామేనల్లుఁ డేఁడన, దుస్సల దుఃఖాతిరేకంబుతో నాతనిదుర్మరణంబు విన్నవింప నాతం డెదురుశోకించి యామె నోదార్చి యభయ మొసఁగి మంత్త్రిపురోహిత దండనాథాదులఁ బిలిపించి సైంధవపౌత్త్రుని సింధుదేశసింహాసనమునం దునిచి యాతండ యాదేశాధీశుండని యతని కభిషేచనము సేసి తనకరుణాళతఁ జూపెను.

పిదప సైంధవవిషయంబు నతిక్రమించి శ్వేతవాహనుండు పంచనద విషయంబుఁ జొచ్చువాఁడు కర్ణేదుర (1) "నిషాదస్థపతియు," నిషాదసైన్యంబుతోఁ గూడినవాఁడు నగు నేకలవ్యపుత్రుంతో మహాహవంబు సేయవలసివచ్చె. ఏకలవ్యునకు నర్జునునకు విద్యాభ్యసన సమయమునుండియు వైరము గలదు. గురుదక్షిణ యనెడు నెపమున ద్రోణుఁ డేకలవ్యునంగుష్ఠము గొట్టించుటకుఁ గారకుఁ డర్జునుఁడ. శ్రీకృష్ణుఁడు జరాసంధునితోఁ బోరునపుడు జరాసంధపక్షమున వచ్చిన యేకలవ్యునంతకపురి కంపెను. కురుక్షేత్రయుద్ధమున నేకలవ్యపుత్రుని కేలనో ప్రవేశము గలుగలేదు. * సైంధవవధ నాఁటి మహారణము నిషాదదేశమున నయ్యె. పై కారణంబులచే నేకలవ్యపుత్రుఁ డర్జును హితోపదేశము వినక యెదుర్కొని యాతనితో ఘోరసంగ్రామముఁ జేసి యోడి శరణన నాతఁడు నిషాదస్థపతిం గాఁచి విడిచి యశ్వముతో గాంధారవిషయముఁ జొచ్చెను. గాంధారరాజగు శకుని యాలోచనావిశేషమె కురుపాండవభేదహేతువు, లోకోపద్రవకరహేతువు నయ్యెను. పాండవుల కపకృతిఁ జేసినవారిలో నగ్రగణ్యుఁడు శకునియె. కౌర

(1) నిషాదులకు రాజు (లేక) నిషాదుఁడైన రాజు. మఱియు నిషాదుఁడు రాజుగాఁ గలవాఁడు—అనునర్థములు చెప్పవచ్చును. బహువ్రీహి యిటఁ బొసఁగదు.

* ఈవృత్తాంతము సంస్కృతభారతమునఁ గలదు.

వాసికములోఁ గడవఱకుఁ బోరినముఖ్యులు గాంధారాశ్వికులె. సహదేవాదులు సంపూర్తిగ యుద్ధరంగగతులగు గాంధారుల నున్మూలించిరి. అట్టిరణహత సైనికులబంధువు లర్జుననామమాత్రశ్రవణముననే గినిసి కడవఱకుఁ బోరాడ శపథములు పూని విశ్వచ్ఛసాంత్వనోక్తులను వినక, ఆతనిని వివిధాయుధంబుల వేధింప, విజయుండును వివిధాస్త్రంబులఁ బ్రయోగించి విజితులఁజేసి విజయంబు సేకొనియె. గాంధారరాజపౌత్త్రిని గాంధారీదేవి జ్ఞప్తిగాఁ గరుణించి యామండలమున కభిషిక్తుఁజేసెను. తదనంతరము కాశ్మీరమున కేఁగి బాలుండగు ప్రథమగోనందు నాదరించె. ద్వారకనుండియే శుభాగమనవార్త నన్న కెఱుకపఱచుటచేఁ దనరాక కెదురుచూచు బంధుమిత్త్రాదులానందపరవశులు, ప్రేమాంతరంగులు నగునటులు చేయుచు విజయుండు విజయంబులు సేకొని క్షతావయవంబులతో బడలిన యొడలితో మాఘమాసాంతమునకె యశ్వముతో యాగశాలకేతెంచెను. ధర్మజుండును ఋత్విక్పురోహితామాత్యుల తోడను, విదురాదులతోడను నాతని నెదుర్కొని యాతని నమస్కృతు లందుకొని యాశీర్వదించెను. అర్జునుండును సీతకాఁ డొడ్డుసేరినరీతి సంతసిల్లెను.

---

## పంచమానువాకము

### అశ్వమేధము

అంతం జైత్రిపూర్ణిమ యాసన్నం బగుడు ఋత్విగగ్రే సరుండగు ద్వైపాయనుండు సర్వఋత్విగనుమతిని గారాంతిక నిర్మితాసన్నముహూర్తము ధర్మజున కెఱిఁగించి శాలాప్రవేశమున కాతనిఁ దర్వరపెట్టెను. ధర్మజుఁడును వనజానానవంబాలోకించి ‹‹ శిల్పులను రావించి యాగానీతరాజవర్యులకు ఋషివర్యులకు దక్కుచాతర్వర్ణ్యులకుఁ దగిన వసతుల నేర్పఱుపు '' మని తాను శాలాప్రివేశ మొనర్చెను. భీముఁడు పటశాలలను, పర్ణశాలలను నిర్మింపఁజేసి రాజన్యులను దదితరులను విడియించి భోజ్యంబులను చతుర్విధాన్నంబులను ఖాద్యంబులను బేయంబులను బుష్కలంబుగఁ దృప్తిని గలిగించెను. లక్షజనులు భుజింప నొక్కపరిమోగఁగు నొకఘంట నేర్పఱుప నది యాగాది నుండి యాగాంతమువఱ కన్ని దినములు నేకగతిఁ దెఱపిలేకుండ మోగుచునేయుండెను. ఎన్నిలక్షల జనులు భుజించి తృప్తినొందిరో లెక్కింప నశక్యమయ్యెను. యాగము దర్శింప నేతెరచిన గోనంద, బభ్రువాహన, వజ్రదత్త, మూర్జార్యాది మూర్ధాభిషిక్తులను, శ్రీకృష్ణబలరామ సాత్యక్యాదులను గవలఁగూడి కరువలితనయుం డగ్రజుననుమతిం బెక్కువిధంబుల గౌరవించెను. ఆయాగమునకు వచ్చినవారిలో నభోజ్యుఁడు ననలంకృ

తుఁడు నసంతృప్తుఁడు నసన్మానియు నొక్కఁడైన లేకుండెను. మీ కేమికావలయునో మోమోటము లేకుండ నడిగి యర్థముం బొందుఁడని భీముఁ డర్థులకుఁ బ్రోత్సాహ మొనరించుచుండెను. అట్టియెడ ధర్మజుండు ,, ద్విసహస్రకనకేష్టికలచే నేర్పఱుపఁబడి శ్యేనాకృతియు, చతుశ్చిత్యము గలిగి పదునెనిమిది చేతుల పరిమితిగలవేదికతో ’’ యజనంబొనర్చె. ఆచతుర్వేదియు, నషడంగవేత్తయు, నదేవగురుతుల్యుండు నగు ఋత్విక్కొక్కండును లేకుండుటచే నప్రాయశ్చిత్తముగాఁ బ్రవర్గ్యలు, సవనములు, యథావిధి నిర్వర్తించిరి. అందు ఖాదిర, బైదిల, పాలాశ, దేవదారు, శ్లేష్మాతక శాఖా కల్పితంబులగు యూపంబులు విధ్యుక్తంబుగ నిరువదియొక్కటి నిర్మింపఁబడి, యందం దందంబుగఁ గనకయూపంబులు కొన్ని నిలుపఁబడెను. వాసవిరక్షితంబును, వాస్తోష్పతితురగ సదృశంబును నగు వాజి, వాజిమేధవాటికాప్రవేశంబు నొంద వచ్చినప్రజలందఱు నాయశ్వమును దద్రక్షకుఁడగు నర్జును శౌర్య విక్రమాదులను వేనోళ్ళం బొగడిరి. అయ్యెడి యూపంబునకుఁ గట్టంబడి త్రిశతపరిమితిగల చతుష్పాత్తులు, ఖచరములు, జలచరములు యథావిధని జట్టును నిలువ విరాజిల్లెను. యాజకులు యథావిధిని గార్యకలాపంబులు పారాశర్యునానతిచే నిర్వర్తించిరి. అధ్వర్యుఁ డశ్వవిశసనకాలమునకు యాజ్ఞసేనిని రావించి యామెచే నశ్వంబునకుఁ బరిచర్యచేయించి శస్త్రప్రహతంబులును, యుక్తంబులు నగు నశ్వాంగంబుల నామెచే

హోమంబుఁ జేయించె. తక్కినయవయవంబులను ఋత్విక్కులు వేల్చిరి. వపాహోమముచే బయలువెడలు పరిమళము నాఘ్రాణించి ధర్మరాజుడు నాతనిసోదరులు దక్కంగల జనులు తమసర్వ పాపంబులు పరిహరింపఁబడిన వని సంతసించిరి. సమస్తజనులకు సమ్మోదహర్షధ్వనులు సెలంగ ధర్మరాజుఁడు సదస్యులకుఁ గోటి వేల విష్కములనిచ్చి ఋత్విగ్గణేశ్వరుండగు వేదవ్యాసునకుఁ దనసామ్రాజ్యము నంతయు దక్షిణగా నీయ నుంకింపఁ బారాశర్యుఁ డిట్లనియె. ,, రాజా ! నీయీయాగమున కధ్వర్యుండగు యాజ్ఞవల్క్యనిగురువు జైమినిమహర్షి. ఆతఁడు వేదోదితంబులగు కర్మలకు నిదానంబగు తనపూర్వమీమాంసాశాస్త్రమున నిట్లు చెప్పియున్నాఁడు. i ,, రాజు రాజ్యమును దానమిచ్చుట కర్హుఁడు కాఁడు. అది సర్వజనులకు సమానముగ ననుభవింపఁ దగినది.'' తత్సూత్రభాష్యకర్తయగు శబరమహర్షియు ii,,సార్వభౌమున కన్నిటినిదానముచేయుట కధికారముగలదా ? భూమి

---

i నభూమిస్స్యాత్సర్వాన్ప్రత్యవిశిష్టత్వాత్. పూర్వమీమాంస. 6-7-3.

ii అత్రైవ సర్వదానే సంశయః కింభూమిర్దేయా ? నఇతి. కాపునర్భూమి రత్రాభిప్రేతా. యదేత న్మృదారబ్ధం ద్రవ్యాంతరం పృథివీగోలకం. న క్షేత్రమాత్రం. మృత్తికావా. తత్ర కింప్రాప్తం. అవిశేషాద్దేయా ప్రభుత్వసంబంధేనహి. తత్ర స్వశబ్దో వర్తతే. శక్యతేచ మానసవ్యాపారేణ స్వస్య స్వతా నివర్తయితుమితి. ఏవంప్రాప్తే బ్రూమః. నభూమిర్దేయా ఇతి. కుతః క్షేత్రాణా మీశితారో మనుష్యా దృశ్యంతే. నకృత్స్నస్య పృథివీగోలకస్యఇతి అహ. య ఇదానీం సార్వభౌమః. సతర్హి దాస్యతి. సోపి న

సీయవచ్చునా? యనుప్రశ్నలుకలుగఁ గా దని చెప్పుచున్నాము. ఎట్టిభూమి? మట్టిమొదలు భూగోళమంతయు భూమియే. అందువలన నొక్కపొలముమాత్రమె కాదు. మట్టిమాత్రమె కాదు. (ఇంతకుముందు సార్వభౌముఁడు తనసర్వస్వము నీయవచ్చునని చెప్పితిమి.) దీనివలన నేమిప్రాప్తించెను? ప్రభువునకు భూమియందు స్వత్వమున్నదిగాన తప్పక భూమి దానమీయవచ్చునని ప్రాప్తించినది. స్వత్వత్యాగము మానసికముగా యుక్తమైనదియేగాని, భూమివిషయమై రాజునకు స్వత్వములేదని చెప్పుచున్నాము. ఎందువలన ననఁ బ్రతిక్షేత్రమునకు యజమానులు వేఱుగ నుందురు. అందువలన రాజు ప్రత్యేకముగాఁ బొలమునీయుట కర్హుఁడు కాఁడు. తనపృథివీభాగము నంతయు నన్యాధీనముఁ జేయుట కర్హుఁడై యుండఁడు. సార్వభౌముఁడెంతకాలము సార్వభౌమత్వ మనుభవించునో యంతకాలమె కాని, యాపై వతనికి భూమిపై నధికారములేదు. సార్వభౌమునకు భూమిపై విశేషించి మఱియొక యధికార మున్నది. వ్యవసాయకులు పండించినది శత్రువులు కొనిపోకుండఁ గాపాడుటకై

---

ఇతి బ్రూమః. కుతః యావతాభోగేన సార్వభౌమో భూమేరీష్టే తావతా అస్యాపి నకశ్చిద్విశేషః. సార్వభౌమత్వే సత్యే తదధికం యత అసౌ పృథివ్యాం సంభూతానాం వ్రీహ్యాదీనాం రక్షణేన నిర్దిష్టస్య కస్యచిద్భాగస్య ఈష్టే. నభూమేః. తన్నిర్దిష్టాశ్చ యేమనుష్యాః తదన్యత్సర్వప్రాణినాం ధారణ విక్రమణాది యద్భూమికృతం తత్రేశత్వం ప్రతి. నకశ్చి ద్విశేషః. తస్మాన్న భూమి ర్దేయా॥ శాబరభాష్య॥

పండినపంటలో నిర్దిష్టభాగమున కధికారి. భూమియం దుండిన ప్రాణిసమూహమునందు మనుష్యులకే భూమిపై నధికారము గలదు. అందువలన రాజు భూమిని దానమిచ్చుట కర్హుఁడు కాఁడు."

అని చెప్ప ధర్మజుఁడు భూదానమే యన్నిదానములకంటె శ్రేష్ఠ మనియు, యాగదక్షిణకై భూదాన ముత్తమ మనియు వింటి నన సాత్యవతేయుఁడు రాజు భూమిని దాన మిచ్చునెడల నప్పార్జితమును, శత్రురాజులనుండి యపరాధముగాఁగొన్నగృహక్షేత్రాదులనే దానమీయవలయు నని చెప్పెను. అంత నజాతశత్రుఁడు "సామ్రాజ్యమునంతయు మీకిచ్చి నేను వనమున మునివృత్తి నుండ మనస్సున సంకల్పించుకొంటిని. అట్టిమనః ప్రతిజ్ఞ నెటులుమానుదును. రాజునకుఁ బ్రతిజ్ఞానిర్వహణ ముత్తమము కాదా ?" యని పల్క ద్వైపాయనుఁడు సామ్రాజ్యము నాకిచ్చితివే యనుకొనుము, బ్రాహ్మణుఁ డేయుగమునను రాజ్యంబు సేయ నర్హుండు కాఁడు. కాన భవద్దత్తరాజ్యమునకుఁ దగినవెల నిర్ణయించి యాధనము దక్షిణగా నిమ్ము. కాదేని క్షణమాత్రసమాప్తనగు నాయానతిలో నుండు జనుఁడ వగుటచే నాయాజ్ఞ ననుసరించి నీవే ప్రభుత్వముచేయు మన వల్లె యని సామ్రాజ్యమును దారవోసి దానికిఁ దగినవెలగా ననేకకోటుల కాస్యసువర్ణము నకుప్యసువర్ణము నిచ్చె. వ్యాసుండును ప్రధాన ద్వితీయ తృతీయ చతుర్థాంతరములు గలఋత్విక్కుల కంతర్వ

భాగములచే నాధనమును బంచి తనభాగమునకు వచ్చిన కుష్యా కుష్యద్రవ్యమును స్నుషగాన కుంతి కిచ్చి సముసబ్బుందుఁడై వనంబున కరిగెను.

అధ్వరాహూతులగు దేశాధీశులు ధర్మజుచే సత్కృతులై తమదేశంబులకు సంతసంబున నరిగిరి. తక్కినజనములుఁ దమ తమనెలవులకు యాగమహోత్సవన్యాసంబు లొనర్చుచుఁ బోయిరి. బభ్రువాహనుండు హస్తిపురియందు కొంతకాల ముండి సోదర పుత్త్రుండు గానఁ బరిక్షిత్తు నెత్తి ముద్దాడి రత్నాభరణములచే నలంకరించి తల్లియగు చిత్రాంగదను, సాపత్న్ని యగు నులూపిని నర్జునుకడ నునిచి కుంతీసుభద్రాదులచే నాదరింపఁబడుచుఁ బిమ్మటఁ బాండ్యదేశమునకుఁ బాండవులచే ననుజ్ఞాతుండై వెడలెను.

---

## షష్ఠానువాకము

పరిక్షిత్తు బాల్యదశ, ధృతరాష్ట్రాదులమృతి.

అశ్వమేధాగతావనిపు లభిమన్యుపుత్త్రుం గనుఁగొని పితృపితామహచిహ్నంబు లాతనియం దుండుటఁ జూచి యీతం డహితభీకరుండును, హితహితంకరుండు, వంశోద్ధారకుండు నగు నని యానందించిరి. ఆపార్థపౌత్త్రుఁడు శుక్లపక్షశశాంకుని

మూఁడ్కి దినదినప్రవర్ధమానుండై యేనవయేఁట నక్షరస్వీకృతి నొంది యచిరకాలమునకే తగినయుపాధ్యాయులవలన విద్యాం గఱచి యుచితకాలంబున నుపనీతుండై, సాంగవేదవేదియై రాజ కుమారోచితవిద్యల నభ్యసించి, యుద్ధశాస్త్రమును పితామహ గురునగు కృపాచార్యునుండి తత్త్వజ్ఞానముతో నభ్యసించి, శస్త్రశాస్త్రముల నొందుటచే శస్త్రియు, శాస్త్రియు నై, ధర్మమును ధరించుటచే ధర్మియై నశ్వసాదియు గజసాదియు నగుచుఁ బ్రజలకుఁ బ్రహ్లాదనమున శీతభానుండును బ్రతాప మునఁ దపనుఁడునై వేత్తలచే సదసత్తులుపదేశింపఁబడినను సత్తు నందే దృష్టిగలవాఁడై యలరారుచుండెను. ప్రతివిద్యయు నుప దేశించుకాలంబున నొజ్జలు తామే ప్రత్యుపదేశంబులఁ బరీక్షితు చే నొందితి మని తలఁచుచుండిరి. షోడశవర్షప్రాయమునఁ గాకపక్షశోభితమైన యాతనిమోము తమోభేదియగు రాకా శశివలెఁ దనరారెను. అతనిపితృమాతులాదుల యుద్ధవార్తలు, వారల దారుణమరణములు వినవిన నాతనిహృదయమునఁ గరుణారస ముప్పొంగి పొరలుచు రణధర్మంబు గర్హింపఁబడు చుండెను.

యుద్ధాదినుండి పదునూఁడేడులు నన వినుచుండు తీర్థ యాత్రికై వెడలి మైత్రేయునకడ నేఁడాదికాలము తత్త్వజ్ఞానము నభ్యసించి యుద్ధాదిగఁ బదునేడేండ్లు పూర్తియగునాఁటికి గజ పురిం జేరి ధృతరాష్ట్రునొద్ద నెప్పటివలె నుండెను.

రణనిహతసుత హితాదులకై వైచిత్రవీర్యుండు దుఃఖింపకుండఁగ యుధిష్ఠిరుఁ డెన్నేని యుపచారముల నాతనికిఁ జేయుచుండెను. యుద్ధమృతుల పారలౌకికక్రియలఁ జేయునపుడు ధృతరాష్ట్రుఁడు తలంచినవానికంటె వేయిమడుంగులు దానధర్మంబులు సేయించియు, నగ్రహారములు, గ్రామములు, నారామములు మొదలగువానిని నిర్మించునటులఁ జేయించియు నిశ్చింతమనస్కుం జేయుచు నతనిక్షేమము ననారతము నిర్నిద్రుఁడై విచారించుచుండెను. ధనంజయుండును ధర్మజు ననుకరించుచుండెను. కుంతీద్రౌపదీసుభద్రలు సగౌరవమనస్కలై గాంధారీధృతరాష్ట్రులకు భోజన మజ్జనాదుల కేలోపము లేకుండఁ జేయింతురు. కవలు నట్లు సంచరింతురు. వారియెడ ధృతరాష్ట్రునకుఁ బ్రేముడి యుండెఁగాని, భీముం గన్నపుడుమాత్రము పుత్రహంతకుం డని మనంబున సక్రోధుం డగుచుండును. భీముండును నసూయసహితుండగు ధృతరాష్ట్రునెడ గౌరవయుక్తుఁ డగుచుండును గాని యేరును లేని సమయమునఁ బూర్వము ధృతరాష్ట్రుచేతను, ధార్తరాష్ట్రులచేతను దాము పడిన బన్నంబుల నుగ్గడించి యట్టిచీకుల కిప్పుడు తాము దిక్కగుచుంటి మనియు, నేరిచేఁ దాము భంగపడితిమో యట్టిధార్తరాష్ట్రుల ననిఁ జంపఁగలిగితి మనియుఁ, బగ నీఁదఁగలిగిన స్వభుజాదండములకుఁ జందనమాల్యాదుల నర్చించుచుంటి ననియు దెప్పుచుఁ జీకులగు దంపతులమనంబులఁ జీకాకుపఱచుచు క్షోభింపఁ జేయుచుండెను.

కవ లీసంగతిఁ గర్ణాకర్ణిగా వినియు విసన ట్లూరకుండురు. సేవకు లేమియు ననవేరకుందురు. ధర్మజ ధనంజయులకును, గుంతీ ద్రౌపదులకును నీవృత్తాంత మించుకేనియుఁ దెలియదు. భీముని యుల్లసంబులు విదురుఁడు తీర్థయాత్రనుండి వచ్చునాఁటి కేకో త్తరాభివృద్ధి నొందెను. ధృతరాష్ట్రుఁడు పుట్టంధుఁడు; పైపెచ్చు జరాభారక్లేశి, మఱియు సర్వసుత సుహృద్బాంధవ మరణ క్షోభితమనస్కుఁడు, పైఁగా నెవరికి మున్నవకృతిఁ దా నొనర్చి యుండెనో వారినుండి తాఁ బట్టెడన్నముఁ దినుచుండుట, మఱి యెవ్వానిఁ దా ససహ్యించుకొననో యట్టి శత్రుని యుద్ఘాటిత వాక్యాకర్ణనము, ఇందొక్కటొక్కటియే దుఃఖసముద్రమున ముంపఁ గల్గు నన నవి యన్నియు నొక్కనియందే సమావేశమై నచో నట్టివానియవస్థ యవాఙ్మానసగోచర మని వేఱుగఁ జెప్ప వలయునా? అట్టి యన్నవిషమస్థితిఁ గనుఁగొని విదురుఁడు రహస్యంబుగా నాంబికేయున కిట్టు లనియె.

శా. పుట్టంధుండవు, పెద్దవాఁడవు మహా
భోగంబులా లేవు, నీ
పట్టెల్లం జెడిపోయె, దుస్సహజరా
భారంబు పైఁగప్పె నీ
చుట్టాలెల్లను బోయి రాలు మగఁడుః
శోకంబున న్మగ్నులై

కట్టా దాయలపంచ నుండఁ దగునే
కౌరవ్యవంశాగ్రణీ.

క. పెట్టితిరి చిచ్చు గృహమునఁ
బట్టితిరి తదీయభార్యఁ; బాండవులకుఁ గా
గొట్టితిరి వారు మనుపఁగ
నెట్టయిన భరింపవలెనె యీపాపములన్.

క. బిడ్డలకు బుద్ధిసెప్పని
గుడ్డికిఁ బిండంబు వండి కొనిపం డిదె పైఁ
బడ్డాఁ డని భీముం డొట
గొడ్డెము లాడంగఁ గూడుఁ గుడిచెద వధిపా.

క. దేహము నిత్యము గా దని
మోహముఁ దెగఁగోసి సిద్ధమునివర్తనుఁడై
గేహము వెలువడు నరుఁ డు
త్సాహముతోఁ జెందు ముక్తిసంపద ననఘా.

ఇట్లు విదురుండు ధృతరాష్ట్రునకు ముక్తిమార్గం బుపదేశించిన నతండును బ్రజ్ఞాచక్షుండై సంసారంబు దిగనాడి, మోహపాశంబువలన నూడి, విజ్ఞానంబునం గూడి ధర్మజు రావించి యాతనికి డగ్గుత్తికతో నిట్లనియె. "ధర్మజా! మిమ్ముఁ బెక్కుడుములఁ బెట్టిన మహాపకారి నగునాకుఁ బుత్రులులేని లోపంబు లేకుండగఁ బదునైదేండ్లనుండి నీవు కాపాడితివి. "జాతస్య మరణం ధ్రువ" మ్మను నానుడి నీకుఁ దెలియనిది కాదు.

మునివృత్తి గలిగి యోగముచే నంతమునఁ దనువుఁ ద్యజించుట రాజశ్రేష్ఠుల కుచితంబు గాన నే నారీతిని బత్నితోఁ దనుత్యాగముఁ జేయుటకు రాజ వగు నీయనుజ్ఞఁ గోరుచున్నా" నన, నాతఁడు కడుదుఃఖితుఁడై యెన్నియోరీతుల నాటంకములఁ జెప్పుచుండఁ గృష్ణద్వైపాయనుం డచటి కేతెంచి ధర్మజుని సమాధానపఱప నాతం డంగీకరింపక యెల్లి విచారింత మనెను. పిమ్మట ధృతరాష్ట్రుఁడు పౌరముఖ్యుల రావించి తనమనోరథముఁ జెప్పి వారలతో నిట్లనెను.

క. మహిఁ దెన్నుగ రక్షించిన
మహితగుణుని యన్న కొడుకు ♦ మనుమం డని నా
కు హితంబుఁగోరి కరుణా
సహితులరై యిం డనుజ్ఞ ♦ సద్వ్రతమునకున్.

అన వారెట్టకేలకు సమ్మతించిరి. ధర్మజుండును "నిది మిథ్య" మని నిర్ణయింపకపోవుటచే నది యనుమతిగాఁ గొని యాయర్ధరాత్రంబున విదురుం గలిసి పురంబు వెలువడి హిమాలయప్రాంతంబున కరిగెను. గాంధారియు,

చ. వెనుకకురాక చొచ్చు రణ
వీరుని కై వడి రాజనందనం
బునకు భయంబు లేక పతిఁ
బోనడు ధీరుని భంగి నప్పు డ

స్వసిత దురంతమైన హిమ
వంతముపొంత వనాంత భూమికిం
జెనిమిటికోఁడ వించుకయు
భీతివహింపక యేఁగెఁ బ్రీతితోన్.

మఱునాఁడు ధర్మజుండు కాల్యంబులఁ దీర్చి యెప్పటి యట్లఁ దండ్రికి మ్రొక్క వచ్చి శూన్యంబగు దద్గృహంబుఁ గాంచి సంజయుచే వారిపోకడఁ దెలిసి విషాదంబున సభాస్థలి కేతెంచి సభ్యులకుఁ దద్వృత్తాంతం బెఱిగించి తమ్ములతో ధృతరాష్ట్రుం జూడఁ బ్రయాణమగుడు యుద్ధమృతులగు ధార్తరాష్ట్ర వనితలు, సపుత్రియగునుత్తరయు, గుంతీద్రౌపదులు మున్నగు నంతఃపురకాంతలు, సంజయుండును వారితోడన బయనమైరి. కొందఱుపౌరులు వారితోడన రాఁదలంప ధర్మజుం డనుమతినేసి పురరక్షణమునకు యుయుత్సుని నియోగించి యుచితపరికరంబులతో నడనెడ విడియుచు హిమవంతంబుపొంత గంగాతీరంబున శతయూపమహర్షి యాశ్రమోపాంతంబునఁ గదళికావనంబునఁ బత్నీసహితుండై, ధృతరాష్ట్రుం డుండుటఁ దెలిసికొని యా యాశ్రమము సమీపించి యట విడిసెను. ధర్మజాదు లాశ్రమముఁ బ్రవేశించుసమయమునకు ధృతరాష్ట్రుఁడు గంగలోఁ గ్రుంకులిడి సకుశహస్తుండై గాంధారి నానుకొనివచ్చుట దా దవ్వులఁ గాంచి ధర్మజుండు రోదనముసేయుచు నాతనిహస్తము లనుండి యుదకకలశముఁగొని ,, యోమహారాజా! నీకిట్టిదశ

ప్రాపించిన, విధి నేమనవచ్చును ఇట్టియవస్థ నొందుట నీ కు చితమా? అని పలుభంగులఁ బలవించుచు నాశ్రమంబున కేతెంచెను. అచట సమావేశమయిన నరనారీకమునకు ధృతరాష్ట్రునవస్థం జూచునపుడు కలిగిన రోదనంబులు యుద్ధాంతంబునఁ బొలికలనిరోదనంబులం దలఁపించుచుండెను. అంతటి రోదనధ్వని నంతకుముం దెఱుఁగని పరిక్షిత్తు తల్లియొడిలోఁ జేరి యడలున వెక్కి వెక్కి యేడ్చుచుండెను. కొంతదడవునకు వారంద ఱుపశమిల్ల ధర్మజుఁ డెన్నియేని యుక్తులచే ధృతరాష్ట్రుని దిరిగి పురంబునకుం గొనిపోవఁ బ్రయత్నించెం గాని చిత్రకూటస్థుఁడగు రాముని భరతుఁ డయోధ్యకుఁ గొనిపోవఁ జేసిన ప్రయత్నమువలె నిదియు వ్యర్థమయ్యెను. అంతలోఁ గృష్ణద్వైపాయనుఁ డేతెంచి వానప్రస్థుండగువానిఁ దిరిగి పురప్రవేశంబు సేయించుట యనుచితం బన, ధర్మజుం డట్లేని యుయుత్సునకుఁ బట్టాభిషేకంబు సేసి నే నీయంధనృపతి కుపచారంబులు సేయుచు నిట నుందు నన ద్వైపాయనుండు వేదంబున * వైశ్యాపుత్రునకుఁ బట్టాభిషేకము జేయరాదని కలదు. కాన యుయుత్సుఁ డెట్లు పట్టాభిషేకార్హుఁడగు? క్షత్రియోచితంబగు ప్రజాపాలనంబె నీకుఁ గర్తవ్యంబు. పరిక్షిత్తు యుక్తవయస్కుండగుతఱి నాతనికిఁ బట్టాభిషేకంబొనరించి నీవు నిట్ల సహోదర్యుండవై వసంబున కరుదెంతువుగాక యనుడు నెట్టకేల కంగీకరించెను.

* “ వైశ్యాపుత్రం నాభిషించేరన్ ” కృ. య.

పిమ్మటఁ బారాశర్యుండు ధృతరాష్ట్రునిఁగని ‘‘పుత్రా’’! నీవు సర్వకామములను వర్జించునవసర మయ్యెఁ గాన కడపటి దగు నీకోరిక యేదియో చెప్పుము. అది యెట్టిదుర్లభంబైనను దానిని దీర్ప నే నిచటికి వచ్చితి నన నాతండు డగ్గుత్తికతో మహానుభావా! యుద్ధమృతులగు పుత్రపౌత్రాదుల నొక్కపరి చూచునభిలాషము గలదు. గాంధారికి నట్టియభిలాషమే కలదన నేఁటిసాయంకాలమున నట్టి వినోదముగలిగింతు నన నచ్చటివార లెల్లరకు నారీక మెప్పుడు సాయంకాల మగునా యని క్షణ మొకయుగ ముగాఁ దలంచునంతలో నుషాపతియు నస్తాద్రిం జేరె. వ్యాసు తేయుఁడు సాయంసంధ్యాక్రియలను నిర్వర్తించి, ధృతరాష్ట్ర ధర్మరాజాది పురుషులును, కుంతీగాంధార్యాదులును, యుద్ధ మృతులగుకౌరవవీరులభార్యలును, నాశ్రమస్థమునివర్యులు నెంట రా గంగాతీరమున కేఁగి వారిఁ దత్తటంబున యథోచితంబుగఁ గూర్చుండనియమించి గంగాజలంబులదిగి యుద్ధమృతుల నాహ్వా నించెను.

వ్యాసుఁ డాహ్వానముచేయ నాగంగనుండి భీష్మ ద్రోణు లఁ బురస్కరించుకొని దుర్యోధన దుశ్శాసనాది గాంధారేయ శతకంబును, దత్పుత్రాదులును ద్రుపద ధృష్టద్యుమ్నాది పాం చాలురును, విరాటాది మాత్స్యులును, శకున్యాది గాంధారు లును, బాహ్లీక సోమదత్తాది కౌరవులును, నభిమన్యు ఘటో త్కచాది పాండవ కుమారవీరులును, తక్కుంగల శూరులును

యుద్ధప్రస్థాన దివసమున నేయే యుడుపులను ధరించిరో యెట్టి శస్త్రాస్త్ర నిషంగాదులను వహించిరో యేయే వాహనాదుల నధిరోహించిరో యాయుపకరణములతో నారీతినె వెలువడి ప్రేక్షకులయెదుటను, పటంగతులవలె భాసిల్లిరి.

ధృతరాష్ట్రునకు ద్వైపాయనుఁ డనుగ్రహించుటచే నాతండు తాత్కాలిక చక్షుష్మంతుండయ్యె. గాంధారియుం గంతలు విప్పికొని స్వభర్తృసహిత రణవీరులను సభర్తృకయు సస్నుష యు నై శోకానందాశ్చర్యభావశబలిత హృదయయై వీక్షించెను. తక్కుంగల కుంత్యాదివనితలు పాండవులుఁగూడఁ దాదృశావస్థనె పొందిరి. పరలోకాసీతు లానాఁటిరాత్రి ప్రేక్షక నరనారీక మధ్యగతు లగుటచే తన్నరనారీకమున కానాఁటిరాత్రి యామ జీవితమునం దమేయానందదాయిసిగా నుండెను. అట్టి యానందము కౌరవ పాండవుల జీవితకాలమున మహావైభవ యుక్తమగు నింద్రప్రస్థపురిలోని రాజసూయాధ్వరమునను సంభవించెను. ఇపు డది పిర్జనారణ్యమధ్యమున వ్యాసమహిమమునను గలిగెను. ప్రేక్షకులు, వీరులు జీవించినకాలమున నెట్టిప్రేమావస్థ ననుభవించిరో నేఁటిరాత్రియు నట్టి యవస్థనే యనుభవించిరి. యుద్ధకాలమున నెట్టివైమనస్యము లుండినను పరలోకాగతులయందు మూదున కైన నట్టి వైమనస్యము లేకుండెను.

వేగుఁజుక్క పొడముడును, పారాశరి ధర్మరాజాదుల కాకాలము నెఱింగించి పరలోకాగతులు పరదినమున నీలోక

మునుమును డూరాయిఁ దెలిపి వారియానందమున కంతరాయ మొనర్చె. పిమ్మట నెప్పటివలె గంగావగాహనమునఁ బరలోకాగతుల నామంత్రితులఁ జేసి యథాస్థానోద్వాసనముఁ గావించెను.

పరలోకాగతపితృ లంతర్హితు లగుడు నొక్కపెట్టుగఁ గౌరవాంగనలలో రోదనధ్వను లుప్పతిల్లఁ జూచి పారాశరి యా ధృతరాష్ట్రస్నుషలం గాంచి మీయందెవరైనఁ బతులతోఁ బరలోకమున సుఖింపఁగోరుదు రేని, వారి నీగంగాముఖమునఁ బంపుదు నన సంతోషితస్వాంతలై దుర్యోధనాదులవనిత లిహామునకు రోసి, ముని చెప్పినచొప్పున గంగఁ బ్రవేశించి పరలోకగతలైరి. తక్కినవారు శతయూపాశ్రమముఁ జేరిరి. ఇది యంతయుఁ గాంచి పరీక్షిత్తు విషాదాశ్చర్య మగ్నమానసుం డయ్యె.

పిమ్మట వాసిష్ఠి వచనంబుఁ జొప్పున ధర్మజాదులు ధృతరాష్ట్రు నామంత్రితుఁ జేసి స్వనగరంబున కేఁగునవసరం బగుటఁ బృథాదేవి పుత్రులం గాంచి “ పుత్రులారా! నైహికము పై నాస వదలినది. తక్కుంగల వారిమరణంబులకంటె కర్ణాభిమన్యుల మరణంబులు నాకు హృదయశల్యములై బాధించుచున్నవి. ఈ బాధ నపనయించుటకు శాంతాశ్రమనివాసమున భగవద్ధ్యానమే భేషజ మని తలంచితిని ” అని పలికెను. పిమ్మట భీమధర్మజు లడ్డంకులెన్నియేనిఁ జెప్పిరి. కాని, కుంతి వారియుక్తులకుఁ బ్రత్యుక్తులఁ జెప్పి వారలను నిరుత్తరులం జేసి తానప్పుడు వారలఁ దోడునీడగ నుండెను. సంజయుఁడును ధృత

రాష్ట్రాదులకు మార్గదర్శిగా నుండ నంగీకరించి యచటనే నివ
సించెను. పరలోకాగతపరిదర్శనమునకుఁ బూర్వదినముననె విదు
రుఁడు ధర్మజాదుల యాశ్రమప్రవేశము నాకర్ణించుచు చతు
ర్థాశ్రమ స్వీకారము నొంది యవధూతయై మహావ్రతమునను
పాండవులఁగాంచి ధర్మజు నెదుటనే యసువుల విడిచి పారా
శరికిఁ దగినముక్తి నొందెను.

పిమ్మటఁ బాండవులు సపరివారులై గజపురిఁ బ్రవేశిం
చినయనతికాలంబుననె నారదువలనఁ గుంతీ, గాంధారీ, ధృతరా
ష్ట్రులు దావాగ్ని చుట్టుముట్ట దానినుండి తప్పించుకొన వలను
గానక యోగసమాధి నొంది ముక్తశరీరులై, ముక్తి నొందిన
టులును గావల్గణి దావాగ్ని నొక్కవలనఁ దప్పించుకొని హి
మాలయోత్తరభూమి కరిగి నటులును విని వారికై మిగుల విచా
రించి పారలౌకికక్రియలను పాలాశవిధిని నిర్వర్తించి నిష్కృత్యా
ణులైరి. ధృతరాష్ట్రప్రభృతిచే నిశ్శత్రుశేషులైరి.

## సప్తమానువాకము

యాదవాంతః కలహహేతువులు, తన్మరణములు, కిరాతవిజృంభణము.

ధృతరాష్ట్రాదులు స్వర్గతులైనయచిరకాలముననే ద్వార
కలో బహూత్పాతము లుద్భవించి వృష్ణ్యంధక భోజులకు భీతిం

గలిగించెను. యాదవులలోఁ గృష్ణ బలరామ సాత్యకిసాంబ ప్రద్యుమ్నాదులు వృష్ణికులజులు. కంస కృతవర్మాక్రూర శతధన్వాదులు భోజకులులు. యయాతి శాపంబున వృష్ణికులజులగు యాదవులకు రాజ్యార్హత లేదు. భోజులే రాజులు; ఆమర్యాద ననుసరించియే కంసుఁడు మధురలో రాజ్యము చేసెను. అతఁడు వృష్ణికులజులగు వసుదేవాదులను మిగుల బాధించెను. శ్రీకృష్ణుఁ డుద్భవించి క్రూరుఁడగు కంసుని ఖండించి, ప్రాచీనమర్యాదను నిలుపుతలఁపున యుయుధానుఁడను నామాంతరముగల యుగ్రసేనుని బట్టాభిషిక్తుం జేసి తాను మంత్రి యయ్యె. కంసుని మామయగు జరాసంధుని బారికి జడిసి కృష్ణుఁడు మధురను విడిచి ద్వారకను రాజధానిగాఁ జేసెను.

సత్రాజిత్తనునాతఁడు భోజకులజుఁ డగుటను స్వజాతి ప్రముఖులగు శతధన్వాక్రూర కృతవర్మలలో నొకనికిఁ దన కూఁతు రగు సత్య నిచ్చి పెండ్లిసేతు నని మాట నిచ్చియు శమంతకమణి వ్యవహారముచేఁ * గృష్ణున కామె నిచ్చి పెండ్లిచేయ వలసివచ్చె. వాగ్వ్యభిచారి యగుటను సత్రాజిత్తుపై రోసమూని శతధన్వుఁ డాతనిని రహస్యమున సమయించి పిమ్మట శ్రీకృష్ణునిచే హతుఁ డయ్యె. ఆపగయె కృతవర్మమనంబున నిడికొనికాఁబోలు కురుక్షేత్రసంగ్రామంబునఁ గృష్ణున కెదుటిపక్ష మగుఁ గౌరవపక్షమునఁ జేరె. మహాయుద్ధమునం జావక మిగిలిన

* వినాయకచతుర్థినాఁడు శమంతకమణికథను జెప్పుదురు.

కృతవర్మ ద్వారకం జేరెను. కృష్ణానుజుండగు సాత్యకికిఁ గృత వర్మపై నీసు మెండుగ నుండుటచేతనే కురుక్షేత్రసంగ్రామ మునఁ బెక్కుసారులు కృతవర్మతోడనె పోరుచుండువాఁడు. వృష్ణి భోజకులజుల యంతఃకలహములు పెచ్చుపెరుఁగుచుండు సమయముననే యొకప్పుడు కణ్వ విశ్వామిత్ర నారద మహా మునులు కృష్ణుఁ జూడ ద్వారక కేతేర కాలకర్మవశంబున మ దోన్మత్తులగు యాదవ కుమారులు పూర్వము శిశుపాలాపహృ తయగు బభ్రుని భార్యయొక్క వేసమును కృష్ణపుత్త్రుఁడగు సాంబునకు వేసి యామునులకు మ్రొక్కించి ,, ఆర్యులారా! ఈమె బభ్రునిభార్య. నిండుచూలాలు. ఈమెకు మగబిడ్డ కలుగునా యాఁడుశిశు వుదయించునా? జ్యోతిర్విదులగు మీరు సెలవియ్యవలయు" నన వారిప్రల్లదంబులకు వారలిగి " ఈమె కడుపున ముసలాపత్యము జనించును. దానివలన యదు వృష్ణి భోజాంధకులు నశింతురు " అని ఘోరముగా శపించి వెడలి పోయిరి.

మునులు వెడలిన మఱునాఁడే సాంబుని గర్భమునుండి యశనిసదృశము నయోమయము నగు ముసలక ముద్భవించెను. తద్వృత్తాంతము సెఱిఁగి వసుదేవుఁ డాయినుపరోకలిఁ దెప్పించి రజంబగునట్లు పొడిపించి శరధిలోఁ విడఁజల్లించెను. అది కడలి లో మూఁడంచుల కనుపపులియై పెరుఁగుచుండెను. ఇటులుండ ద్వారకలో నేకోత్తరాభివృద్ధి యగు బహూత్పాతంబులకుఁదోడు

మధుపానంబును మితిమీఱుటఁ గాంచి రాజగు యుయుధానుం డు రామకృష్ణాదులగృహములందొట్టి యేరియిండ్లయందును మధుపానంబు సేయరాదనియు నటులు చేసినవారు శూలారోప ణశిక్షకుఁ బాత్రులగుదు రనియుం జాటింపించెను.

ఇటులుండ సముద్రతీరంబున నొక యుత్సవము సేయఁ దటస్థింప యాదవులందఱు బంధుమిత్రాదులఁగూడి వాహనాదు లపై నచటికి నేగిరి. ద్వారకలో వసుదేవోగ్రసేనులు బాలికా బాలురు నబలలుమాత్ర ముండిరి. ఉత్సవప్రస్థానమున ద్వారక లో నిషేధింపఁబడిన మధుపానమును సముద్రతీరమునఁ జేయు కుతూహలముతోఁ బ్రతిశకటమునను మధుకుంభములు యాద వులచే నిక్షిప్తములై తేఁబడెను. సముద్రతీరమున విడియుట తడవుగాఁ గృష్ణుఁడుదక్క ( దక్కినవారందఱు నానావిధ మధు వుల నాప్యాయనంబున నాస్వాదించిరి. దుర్వ్యసనము శాసన మాత్రమున నొకపర్యాయమే విడువఁబడదుగదా!

మధుపానముచేఁ దృప్తు లగువారు దృప్తు లగుట వింత యా? మహావీరుండును గృష్ణభక్తుండుగు నగు సాత్యకి ప్రప్ర థమముననె మధుపానోన్మత్తతచే నవ్యక్తప్రలాపంబు లాడుచు సహజశత్రుండగు కృతవర్మను దూషింప నారంభించెను. సర్వ విధముల నతని కీడగు కృతవర్మయు నతనినేకాక భూరిశ్రవువధ యుం దగు కృష్ణచర్యనుగూడ నుద్ఘాటించి తూలనాడ, సాత్యకి కృష్ణువదనంబుపలక్షించె. కృష్ణున కామాటలు రోషహేతువుగా

నుంటయు, కృష్ణుని క్రోధవీక్షణములు భోజులపైఁగూడఁ బ్రసరించియుంటయు ముఖలక్షణంబుచేతనే సాత్యకి తెలిసికొని కేలనున్న వాలుచేఁ దటాలునఁ గృతవర్మతలను నఱికివైచి యక్రూరాది భోజులపైఁ గవియ వారును గాలకర్మవశంబున నొడళ్ళు తెలియక సాత్యకిఁ దుత్తునియలగునటుల నసులచే నఱికి యసువులఁ బాపిరి. పిమ్మటఁ బ్రద్యుమ్న సాంబాదులును నాయుధంబులు లేకుండినను సమీపంబున మునిశాపజనిత ముసలక చూర్ణోద్భూతమును నిశితధారా విరాజితము నగు మూఁడంచుల తుంగం బెఱికి దానిన యాయుధములుగఁ గైకొని భోజులను మోఁది వారిచే మాఱుమోఁదులం బడి మడియించి తామును మడిసిరి. శ్రీకృష్ణునెదుటనె యీదృశ్యము ఝరీశరవేగంబులను మించి నిమిషార్ధముననె జరిగెను.

అమితసంఖ్యగల భోజకులజులు శేషించియుండుటయు స్వపుత్రపౌత్రాదులు వారిచే హతు లగుటయుఁ గాంచి త్రివిక్రముండు త్రికాలవేది యయ్యుఁ దత్కాలోద్భూతక్రోధంబున మూఁడంచులతుంగచేతనే శేషించినమ్రుక్కడి భోజకులజుల సంహరించి శవమయ మగు బట్టబయలఁ దిలకింప బభ్రువను తనసాపత్న్యసోదరుండును సారథియగు దారుకుండును మాత్రమే హతశేషులై కానుపించిరి.

ప్రలంబఘ్నుండు కలహారంభమునకుఁ గించిత్పూర్వమె పానసభను వదలి దాని కనతిదూరమున నున్న యొకవనస్పతి

మూలముం జేరి యోగనిష్ఠాగరిష్ఠుం డయ్యె. శ్రీకృష్ణున కప్పుడు దుర్యోధనవధానంతరమున నుండిన కౌరవయుద్ధరంగమును, జ్ఞాతులన్యోన్యము నీకతంబున కలహించి చచ్చినటుల నీజ్ఞాతులు నన్యోన్య కలహమునఁ జత్తురని తన్ను శపించిన గాంధారీశాపోక్తులును జ్ఞప్తికి రా భగవంతుం డైనను మానుషరూపమును ధరించుటచే నాతనిమనంబునకు వేదన గలిగెను. అట్టితఱిఁ గేవలమనుష్యుండె యైన వేఱుగ నెట్లుండునో! వాసుదేవున కప్పుడు ద్వారకలోని యనాథవనితలు నరక్షితబాలబాలికలు నపారధనరాసులు నశక్తులగు తలిదండ్రులు ద్వారకానగరమున దస్యుత్వమే వృత్తిగాఁ గలిగిన బలవత్కిరాతబృందము తలంపునకు వచ్చి డోలాందోళిత మనస్కుం జేసె. పిమ్మటఁ గృష్ణుఁడు బభ్రుం జూచి వేగమె నీవు కరినగరంబున కరిగి కిరీటి నిటకుఁ దోడితెమ్మన నాతండు వల్లె యని పోవుచుండఁ గృష్ణున కెదుటనె కూఁతవేటు దూరమున నొకకిరాతుఁడు దబ్బాటున బభ్రువుపైఁ బడి మూఁడంచులతుంగచే మోఁది యాతని విగతాసువుం జేసెను. కృష్ణుఁడాకిరాతుని వెనుదగుల నుంకించియు వాఁడు కనుమొఱఁగినందునను భవిష్యత్కార్యతంద్రితచేతను కిరాతుని వెదకుటను మాని దారుకుం జేరం బిలిచి నీవు వేగమె యింద్రనందను ద్వారకకుం దోడితెమ్మని పంపె.

కృష్ణుఁడు నిర్వీరవతియగు ద్వారకం బ్రవేశించి యయుక్త యాదవమరణవృత్తాంతమును నన్న తపశ్చరణనియుక్తుండగుట

యు వసుదేవునకుఁ జెప్పె. మఱియు నిష్పురుషద్వారకలోఁ దా నుండననియుఁ దాను నన్ను వలె తపశ్చర్యకుం గడంగుదు ననియుఁ బార్థుం డీతకు నేఁగుదెంచి స్త్రీ బాలవృద్ధసంఘము నరసి రక్షించు ననియు నేఁటి కేడవనాఁడు ద్వారకసముద్రమగ్న యగుఁగాన నాఁటి కీపురిఁ గలుగు స్త్రీ బాలవృద్ధసంఘమును ధన ధాన్యాదులను తరలింపు మని నామాటగఁ బార్థుతోఁ జెప్పునది యనియు మిథస్సంభాషణంబునన తండ్రితో వాక్రుచ్చి యాదవనాశము గుప్తంబుగ నుంచునది యని వసుదేవునావతి నొందియె త్వరితగతి నన్న యున్న తావున కేఁగ నాతఁడు యోగంబునన కృష్ణునెదుటనె పంచభూతమయుండగుదు నాతనిదేహంబునుండి యనంతరూపమగు భుజంగం బుద్భవించి యదృశ్యం బయ్యె.

దానిం గాంచి యచటనె వనస్పత్యంతరముం జేరి యుత్తానీకృతదేహుండై శయనించి యొకజానువుపై రెండవజానువుం జేర్చి కృతమును స్మరించుచుండునంతలో దూరస్థుండగు నొక కిరాతుఁడు కృష్ణపాదాగ్రమును గలాపభృత్కలాపముగాఁ దలంచి తీక్ష్ణార్ధచంద్రవిశిఖంబు వింటం దొడిగి గాఢంబుగ నాటనేయ నది కలాపభృత్కలాపస్రవంతీ జనకం బగు నాపాదముం గాడి రక్తస్రవంతిం బుట్టించి యన్నమయంబగు నాతని భౌతిక దేహంబు నమృతమయం బగుటకుఁ గారణంబయ్యె. అంతలోఁ గిరాతుం డేతెంచి తాఁ గొట్టినది కేకినిగాక కేకిపింఛధారి యని

నిర్విణ్ణుండై యల్లంతన యడలున మ్రొక్కుచు క్షమింపుఁ డనఁ గృష్ణుఁడు వారిని క్షమించి *దుర్వాసోమునిశాపంబునఁ దనకట్లగుటఁ దెలిపి వాని నంపి భౌతికదేహంబు నీలోకంబున విడిచి యమృతానందమయం బగు వైకుంఠం బనుస్వధామంబునకుఁ జేరెను.

అట దారుకుఁ డర్జునుకొఱ కేగుచు మధ్యేమార్గంబున శ్రీకృష్ణసందర్శనమునకై ద్వారక కేతెంచు నర్జునుఁ దారసించి, కృష్ణాదేశంబును, యాదవనాశంబును జెప్ప నాతఁ డొడల నమ్ములు సూఁడిన ట్లుద్వేగమనస్కుండై ద్వారకకుఁ ద్వరితగతి నేగుదెంచి వసుదేవునకుఁ గానుపింప, నాతఁడు కృష్ణునియాదేశం బును సూత్రప్రాయంబుగఁ జెప్పి తా నప్పుడ యర్జునునిసన్నిధిన యోగమార్గంబునఁ బరమాత్మం బొందెను. తన్మరణంబునకు శోకించి యర్జునుండు వసుదేవునకుఁ బ్రపౌత్రుఁడును ననిరుద్ధపుత్రుండు నగు వజ్రుని గర్తగఁ జేసి, యానకదుందుభికి నౌర్ధ్వదైహిక క్రియలం జేయించి వేవేగమె కృష్ణాన్వేషణంబు

* ఒకప్పుడు దుర్వాసుఁడు శ్రీకృష్ణుఁ బరీక్షింపనెంచి ద్వారక కేతెంచి కృష్ణునాతిథ్యము నొంది రుక్మిణిని కృష్ణమనఃపరీక్షకై కొన్నిబాధల కందించి, తనకు క్షీరాన్నాసక్తి గలుగుటం దెలిపినఁ గృష్ణుఁ డట్లు సేయింప, భుక్తశేషక్షీరాన్నముఁ దనయొడలికిఁ బూయు మనఁ గృష్ణుఁ డట్లు సేసె. కాని యధఃపాదంబునఁ బూయకపోఁగా కృష్ణుతో “నీ కెందును గండము లేదు కాని యధఃపాదంబున లేపనంబు సేయమి నీకధఃపాదంబున శరఘాతంబున గండంబు గల్గు” నని శపించెనఁట !

నకై వనధితీరవనిఁ దఱిసి, కాక కంకావృతంబగు యాదవుల పాలికలనింగని యమేయదుఃఖాన్వితుండయి పోవంబోవ నొక్క యెడ నచ్యుతాగ్రజు నస్థిపంజరంబును, దానికవతిదూరంబున నచ్యుతుని భౌతికశరీరంబును గాంచి పెల్లిగిరిసినచ్చు దుఃఖాంబుధిలో మున్కఁడై హా! కృష్ణా! యని నేలపై వ్రాలి మూర్ఛిల్లి, కొంతవడికిఁ దెలిసి, యాతనిచేఁతలు నైకవిధముల నుగ్గడించుచు పునఃపునర్మూర్ఛలఁ దేలితేలి తనది యరణ్యరోదన మనుకొని కరిష్యమాణకార్యం బూహించి సన్నిహితవనస్థులనుండి సమిత్తులను సంగ్రహించి మథనాగ్నిచే నాపద్ధర్మవిధిని సచ్చిదానందవిగ్రహులగు రామకృష్ణుల భౌతికదేహంబులఁ జితాగ్నికర్పించి, యనృణుండ ననుకొనియె.

పిమ్మట భవితవ్యంబునకై త్వరమాణమానసుండై ద్వారకం జేరి నేఁటికి మూఁడవనాఁడె ద్వారక సముద్రంబుచే మునుపఁబడుననియు, మీరందఱు ధనధాన్యంబులఁ బదిలంబుగఁ జేర్చుకొని యెల్లిసాయంకాలమునకె ద్వారకాపురిని నిర్గమించి యోజనంపు దూరంబున శిబిరంబుల విడియవలయు ననియు, ఇదికృష్ణాదేశం బనియుఁ జాటింపించి కృష్ణభార్య లాదిగాఁగల యంతఃపురకాంతలను శిబికల నాందోళికల రథంబుల నధిరోహింపఁజేసి, అమితధనరాసుల నుష్ట్రంబుల, వేసడంబుల, వృషభంబుల, శకటంబుల గోనెల వేయించి మోపించుకొనుచుఁ దాను వెనుకయై ద్వారకాబహిర్భాగంబునుండి యోజనదూ

రంబు నతిక్రమించి, యంతకుమున్న పరిజననిర్మితంబులగు పటకుటీరంబులఁ జేర్చెను. తక్కుంగల పౌరులును స్వవస్తువాహననివహంబులఁ గొని యర్జునానుమతంబున నట్లశిబిరంబులఁ జేరిరి.

మఱునాఁడు వేగుడు నుదధి తాళవృక్షోన్నత తరంగమాలికలతో నుప్పొంగుచు బోరుకొలుపుచు ద్వారకాపుటభేదనంబు నొక్కపెట్టుగ నర్జునాదులు సూచుచుండ వారియెట్టయెదుటనె ముంచి తత్పురోన్నతసౌధాదులతోడన లోనికిఁ గొనెను. స్వగృహాదులు జలమగ్నంబు లగుట దౌదవ్వులం గాంచి శిబిరస్థజను లొక్కపెట్టునం గొల్లుమనియేడ్చిరి. పిమ్మట నర్జునానుమతంబున వారు పయనంబై మరుస్థలమార్గంబున నింద్రప్రస్థపురివైపున కరుదెంచు చుండిరి.

యాదవు లన్యోన్యకలహంబునఁ జచ్చుటయుఁ గృష్ణనిర్యాణంబును జంఘాలురగు బోయలవలనఁ బంచనదప్రాంతపు బోయలు తెలిసికొని వారు ద్వారకం గొల్లఁగొన నేతెంచుచు మార్గమధ్యంబున పలపలనిమూఁకతో రక్షింపఁబడుచు నర్జునునియాధిపత్యంబున వచ్చుచున్న కృష్ణ కృష్ణానుయాయుల వనితాసహస్రంబును, నగణ్యధనరాసులను గాంచి విమోహితులు లుబ్ధులు నగుటచే నాలుబ్ధకులు పార్థుం డొంటరి యనియు రక్షకభటు లల్పసంఖ్యాకు లనియుఁ దాము వేనకువేలుగ నుంటి మనియు దీమసమున నానారీమండలంబుపైఁ బడి మండనంబుల మండనవతులనుగూడ దోఁచికొన నారంభించిరి. అది తెలిసి

రక్షకభటులను బురికొల్పి తాను కవదొనలును, గాండివంబును బూని వారిపై శరవర్షంబు గురియింప వేఱొకప్రక్క మఱికొందఱు కిరాతులు నారీమండలమును ధనరాసులఁ దోఁచికొనిరి.

వార్ధశ్రవసుండు వృద్ధుం డగుటచేతను, తన బాహుబల విజృంభణమునకుఁ గారకుఁడగు కృష్ణుండును, తత్సహచరులగు సాత్యక్యాదులు పరాసువు లయిరను విచారమునను నిస్సారుఁడై సవ్యసాచిత్వ, విజయత్వ, బీభత్సత్వ, ధనంజయత్వములను క్షాత్రముతోఁగూడఁ గోలుపోయెను. కర్ణ ద్రోణాదులపైఁ బ్రయోగించిన దివ్యాస్త్రంబులు ప్రతిభాషింపకుండెను. శరధులంబోని శరధులు శూన్యంబు లయ్యెను. దృష్టి ముష్టి బలంబులు సడలెను. పురుషవిగ్రహుండై యయ్యెను.

బోయలు విజృంభించి యావద్ధనరాసులను చూఱఁగొనిరి. కొందఱువనితలఁగూడ నపహరించిరి. మఱికొందఱు మానిను లాఘోరసమయంబున మానంబులు దక్క వని యాత్మహత్యలఁ గావించుకొనిరి. కొందఱు దుష్టాంగనలుమాత్రము బోయలను స్వీయముగానె కాముకత్వమున వరించి వెన్నంటిపోయిరి. అర్జునుం డీమహోత్పాతదృశ్యముఁ గాంచి యిది యంతయు భగవల్లీల యనియు, దైవికము దాఁట నేరికి నశక్యమనియుఁ దలఁచి గాండీవంబుతోడనె పెక్కండ్రను మోఁది యంతకపురి కనుచుచు శ్రీకృష్ణ బలరాముల యంతఃపురాంగనలను కృతవర్మాక్రూర సాత్యకుల కుటుంబములను, వజ్రునిఁ గాచు

కొని యెట్టకేలకు బోయల బారినుండి వెడలెను. అక్కరాతు లును, అపారధనంబులు దక్కకుండఁజేసి తృప్తినొంది తమదారిం బోయిరి. ఖిన్నమనస్కుఁడగు నర్జునుండు తనకంటె దైన్యము తోనున్న వజ్రాదులంగూడి యింద్రప్రస్థపురిం జేరెను.

పిమ్మట నాతండు, మధురాపురీరాజ్యాంతర్భూతమై యొకప్పుడింద్రప్రస్థభూమి యుండుటచే యాదవుల కది "య భిజన" మగు నని తలంచి వజ్రిసకింద్రప్రస్థమును, సాత్యకి సూనునకు సరస్వతీపురమును నేలుకొన నిచ్చి వార్ష్ణేయులు రా జ్యాన్హ్రు లనెడి యాంక్షను బోఁగొట్టెను. భోజులకు రాజుగఁ గృతవర్మపుత్త్రు నేర్పఱిచి, యాతనిని దక్షిణాపథములోని మృ త్తికావతీపురమున కభిషిక్తుం జేసెను. పై రాజ్యదానములు స మాప్తిగు ధర్మజుని యాజ్ఞపైఁ జెల్లు వనెను. భోజకులజు లగు నకూ్రరసంతతివారిని వజ్రుఁడు పోషించునటుల నాతని కిల్లడ సేసెను. కాని వారు వజ్రపాలితులుగ నుండ నిష్టపడక స్వచ్ఛం దచారులై యెటకో పోయిరి.

పిమ్మట నర్జునుం డవనతవదనుండై రుక్మిణ్యాది కృష్ణ మహిషీమణులకడ కేగి కృష్ణుం డని నిరుద్ధస్వరుం డగుడు వారు దానిచేతనే కృష్ణనిర్యాణముం దెలిసికొని భర్తృస్మరణంబు సేయుచు సహగమనంబు సేసిరి. సత్యభామాదులు తపశ్చరణం బునకై హిమవదుత్తరభాగమున కేగి తపశ్చరణంబునఁ గాలాం తరమునఁ గిరిశేషులైరి.

పిమ్మట నర్జునుం డన్న కిది యంతయు విన్నవింప కరి నగరంబున కరుగుచు మార్గమధ్యంబునఁ బారాశర్యుఁగాంచి కృష్ణనిర్యాణాది సమస్తయాదవనాశమును, దద్వనితాపహరణ మును విన్నవింప నాతం డిది దైవకృత్యం బనియు, దీనికై చింతింప నవసరము లే దనియు నోదార్చి తనదారిని దాను బోయె.

---

## అ ష్ట మా ను వా క ము

### పరిక్షిత్పట్టాభిషేకము

యాతాయాత జనంబువలన యాదవులనాశంబు విని యుఁ గృష్ణనిర్యాణంబు నెఱుఁగక, దుర్నిమిత్తంబులు పొడ సూప వికలహృదయుండై పార్థునిరాక కెదురుచూచుచు ధర్మ జుఁడు భీమున కిట్లనియె.

మ. హరిఁ జూడ న్నరుఁ డేఁగినాఁడు నెలలే
డయ్యెంగదా రాఁడు గా
లరు లెవ్వారును యాదవుల్ సమదలో
లస్వాంతు లీవేళ సు
స్థిరులై యుండుదురా? మురారి సుఖియై
సేమంబుతో నుండునా?

యెర నై యున్నది చిత్త మీశ్వరకృతం
బెట్లోకదే మారుతీ.

మ. యవ పద్మాంకుశ చాప చక్ర ఝష రే
ఖాలంకృతంబైన మా
ధవు పాదద్వయ మింక మెట్టెడు పవి
త్రిత్వంబు నేఁడాదిగా
నవనీకాంతకు లేదుపో మఱి మదీ
యాంగంబువామాక్షి బా
హువు లాకంపము నొందుచుండు నిలకే
యుగ్రస్థితుల్ వచ్చునో.

ఇట్లనుసంతలో ఖేదచేతస్కుండై, విన్ననగు మొగంబు గలిగి యర్జునుండువచ్చి యన్న కెఱఁగి కన్నీరు మున్నీరుగ నేడ్వ ధర్మజుం డాతని లేవనెత్తి యిట్లనియె.

శా. ము న్నుగ్రాటవిలో వరాహమునకై
ముక్కంటితోఁ బోరుచోఁ
సన్నాహంబునఁ గాలకేయుల ననిం
జక్కాడుచోఁ బ్రాభవ
స్కన్నుండై చను కౌరవేంద్రపనికై
గంధర్వులం దోలుచోఁ
గన్నీరెన్నఁడుఁ దేవు తండ్రి చెపుమా
కళ్యాణమే చక్రికిఁ.

అని పలికినం గన్నీరు కరతలంబునం దుడిచికొనుచు
నర్జునుం డిట్లనియె.

క. మనసారథి మనసచివుఁడు
మనవియ్యము మనసఖుండు, మనబాంధవుఁడున్
మనవిభుఁడు గురుఁడు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా.

చ. అటమట మయ్యె నాభజన
మఱియు భూవర నేఁడు చూడుమా
యిటువలె గారవించు జగ
దీశుఁడు కృష్ణుఁడు లేనిపిమ్మటం
బటుతర దేహలోభమునఁ
బ్రాణము లున్నవి వెంటఁబోక నేఁ
గటకట పూర్వజన్మమునఁ
గర్మము లెట్టివి చేసినాఁడనో.

శా. కాంతారంబున నొంటి దోడుకొని రాఁ
గాఁ జూచి గోవిందు శు
ద్ధాంతస్త్రీలఁ బదాఱువేల మదరా
గాయత్తులై తాఁకి దా
పొంతం బోయలు మూఁగి పట్టికొన నా
సీమంతినీసంఘముల్

భ్రాంతిన్ భామినిభంగి నుంటి విడిపిం
పన్ లేక ధాత్రీశ్వరా.

శా. ఆతే రారథికుండ నాహయము లా
యస్త్రాసనం బాశర
వ్రాతం బన్యులఁ దోల్లి చంపుదుఁ దుదిన్
వ్యర్థంబులై పోయె మ
చ్చేతోధీనుఁడు చక్రి లేమి భసిత
క్షిప్తాజ్య మాయావిమా
యాలంతో్రషరభూమిబీజముల మ
ర్యాదన్ నిమేషంబునన్.

అని చెప్పుచుండునపుడె ధర్మజుఁడు మూర్ఛిల్లి కొంత వడికిఁ దెలిసి పరిపరివిధముల విచారించి శ్రీకృష్ణునిచేఁతలు, నాతఁడు తమ కొనరించిన యుపకృతులు పేర్కొని యాతఁడు లేని యీలోకంబున నుండుటకు రోసి వైరాగ్యమార్గమునఁ దనువుఁ ద్యజించుట యుక్తమని భీమాది సోదరుల కావృత్తాంతము నెఱింగింప వారును నన్నతో ననుయాయు లగుట కుద్యమింప ద్రౌపది యనుగమనంబున కొడఁబడ, ద్రౌపదీసహితు లగుపాండవులు మహాప్రస్థానముసేయ నుద్యమించిరి.

పిమ్మట ధర్మజుఁడు విధివత్తుగా గురువులవలన విద్య నేర్చినట్టియు, యువయు యుగవ్యాయతబాహువుఁ, బరిణద్ధకంధరుఁడు, అంసలుఁడు నగుటను రాజ్యభారధూర్వహణసమర్థుఁ

డును, రాజ్యలక్ష్మీపరిగ్రహణయోగ్యుఁడగు నగు పరిక్షిత్తును మంత్రి సామంత దండనాథ పురోహితానుమతంబుగాఁ బౌరజన సమ్మతిని బొంది రాజ్యాధీశుం జేయ నిశ్చయించెను.

ధర్మరాజానుమతి నొందినపరిక్షిత్తు శాంతిక పౌష్టిక క్రియలు నిర్వర్తింపఁజేసి, మొదట ఔదుంబర దారునిర్మితమగు నాసందిపై నన్యజంతువులలోను బశువులలోను క్షాత్రము కల దగుటచే వ్యాఘ్రచర్మము నుత్తరలోమముగాను బ్రాచీనగ్రీవముగాను బఱచి యవ దూర్వ వ్రీహ్యాద్యోషధీ లోకములను దధి మధు ఘృతాదికమును, యథావిధిగ సమర్చి పురోహితులాయా వస్తువినియోగపూర్వక కర్మములను జేసినపిమ్మట పరిక్షిత్తు ,, నేను రాజ్యముకొఱకు, సామ్రాజ్యముకొఱకు, భౌజ్యముకొఱకు, స్వారాజ్యముకొఱకు, వైరాజ్యముకొఱకు, పారమేష్ఠ్యరాజ్యముకొఱకు, మహారాజ్యాధిపత్యముకొఱకు నన్ను నేను వశముఁజేసికొనుటకొఱకు దీని నధిష్ఠించుచున్నా" *నని యాసందిపై నున్న వ్యాఘ్రచర్మపరభాగంబున నెడమమోకాలిపైఁ గుడికాలిపిక్క నాని కూర్చుండెను. క్షత్రియుఁ డభిషేకముఁ జేయవలయుఁ గాన, ధర్మజుఁడు మంత్రపూతోదకము గల కలశమును దెచ్చి యౌదుంబరపర్ణమునడ్డుగ నుంచి యీయర్థము గలమంత్రములఁ జదివెను. " ఈయుదకములు శివతమములు,

* పతకేస్మ్యబ్రాహ్మణమున నీయంశము కలదు.

అన్నిటికి భేషజములు. ఇవి రాష్ట్రమును వృద్ధినొందించునవి. ఇవి రాష్ట్రభృత్తున కమృతములు."

ప్రజాపతి యేయుదకములచే నింద్రుని, సోముని, వరుణుని, యముని, మనువును నభిషేకించెనో యట్టి యీయుదకములచేతనె యీతని నభిషేకించుచున్నాను. నేను నిన్ను రాజుల కధిరాజ వగు మనియు, ఋషుల కింద్రుఁడ వగు మనియు, భూములకు సమ్రాట్టు వగు మనియు, కోరుచు, బలముకొఱకు, శ్రీకొఱకు, యశస్సుకొఱకు, అన్నాదులకొఱకు, ఆయువు కొఱకు సవిత్రాది దేవతలఁ గోరుచు నభిషేకించుచున్నాను.

అని పరిక్షిత్తు నభిషేకింప నాతఁడు చేయఁగల విధుల నిర్వర్తించి * సభాసమితులు నాకు సుముఖములై యుండుఁ గాక యని ప్రజల కభిముఖుఁడై పలుకుచుఁ గనకసింహాసనము నెక్కెను.

అపుడు ధర్మజుం "డో పరిక్షిత్తా! అర్థులు పూర్ణకాములై గృహమునుండి ప్రతినివర్తు లగుటయే నీకులధర్మము. అదియే హుతము ఇష్టము తపము నగును." అని యుపదేశింపఁ బరిక్షిత్తు నమ్రభావంబున గుర్వాజ్ఞను శిరసావహించితి

* అధర్వవేదమున రాజా సభాసమితులంగూర్చి చెప్పు వాక్యములు కాన్పించును. సభలోనివారు సభ్యు లనియుఁ సమితిలోనివారు సామిత్యు లనియుఁ బేరుకలిగి యుందురట! (అవి హౌసాఫ్ కామన్సు, హౌసాఫ్ లార్డ్సువంటివి కావచ్చును.)

వనెను. పిమ్మట ధర్మజుఁడు పౌర జానపదులకుఁ దమ మహాప్రస్థానమునుగూర్చి తెలిపి తదనుమతి నొంది ద్రౌపదితోఁ దమ్ములతోఁ బయనంబయి, పరిక్షిత్తునకు సదసదుపదేష్టగాఁ గులాచార్యుఁడగు కృపుని నియమించెను. తమతో తా నుద్యుక్తురాలగు సుభద్ర నర్జునుఁడు యదువంశశరీరమగు వజ్రుని, పాండవవంశకందళమగు పరిక్షిత్తుని గాపాడ నియోగించి, ఉలూపీచిత్రాంగదలను బభ్రువాహనుకడ నుండ నియమించి పాండ్యదేశమున కనిచెను.

---

## న వ మా ను వా క ము

### పాండవుల స్వర్గారోహణము

ధర్మజాదులు జ్యేష్ఠానుక్రమముగా పూర్వాభిముఖులై మహోదధిని జేరునపు డగ్నిదేవుఁడు బ్రాహ్మణరూపంబున వారిం దారసించి యభిమానధనుండగు ధనంజయుండు గాండీవంబు విడువకుండుటఁ జూచి „ అర్జునా! మహాప్రస్థానివగు నీకు గాండీవధారణం బుచితంబుగాదు. శ్రీకృష్ణుఁడు చక్రంబుఁ గొనియే పరలోకగతుఁ డయ్యెనా?" అన నాతండు దానికి నంతసించి మహానుభావా! నీవెవ్వండ వన, తాను వీతిహోత్రుం

డగుట నెఱిఁగించి వరుణుం జేరుటకుఁగాను గాండీవమును సము ద్రమున వైపించి యంతర్హితుఁడయ్యె.

జ్యేష్ఠానుక్రమంబుగ నడచు ధర్మజ భీమార్జునాదులకు హస్తిపురినుండియే యొకసారమేయము పృష్ఠగామియై వచ్చు చుండెను. ఇట్లు వారు ప్రాగ్దక్షిణ పశ్చిమ సముద్రతీరములఁ జూచుచుఁ బశ్చిమసముద్రతీరమున జలధిమగ్నయగు ద్వారకా పురిం జూచి, కృష్ణునిఁ దలఁచుకొనుచుఁ గ్రమంబుగ హిమవం తంబుఁ గడచి, జన్మస్థానమగు శతశృంగముఁ జూచిరి. అంత వెనుకను నడచు ద్రౌపది తటాలున భూమిపైఁబడి యసువుల ను విడిచెను. ఆవిధమును భీముఁ డన్న కెఱిఁగించి "ఈమెయం దేమి దోష మున్నది? సర్వసుగుణసంపద గల్గు నీమె యిట్లు పడుటకుఁ గతం బేమి?" అన నజాతశత్రుం డాతనితో నిట్ల నియె. "భీమసేనా! ద్రౌపది మనయందఱయందు సమాన ముగ వర్తింపవలసియుండియు నర్జునునియందు మనంబునఁ బక్ష పాతంబు వహించియుండు. అక్కతంబున నీమె ముందుగ నసు వుల విడిచినది" అని నిలువక పోవుచుండఁ గొంతదడవునకు సహదేవుఁడు భూమిపై వ్రాలెను. అది యెఱిఁగి భీముఁ డన్న తో "సహదేవుఁడు భూమిపైఁ బడుటకు హేతు వెయ్యది? జ్ఞాని యగు నీతఁడు నిర్దోషుఁడే కదా" అన సమవర్తిసుతుండు "వృకోదరా! సహదేవుఁడు జ్ఞానంబునఁ దనకుఁ దుల్యు లెవ్వ రును లే రని ప్రతిజనుని ధిక్కరించును. అదియే యీతని ప్రా

జ్మరణమునకుఁ గారణము " అని చెప్పి నిలువక పోవుచుండఁ గొంతదడవునకు నకులుఁ డసువుల విడిచి భూమిపైఁ బడెను. భీముఁ డెప్పటివలె " అన్నా ! కోమలహృదయుఁ డగు నీతఁ డేల పొలిసెను ?" అన, యుధిష్ఠిరుఁడు " పావనీ ! నకులుఁడు సౌందర్యవంతుఁడ నని తక్కుంగలవారిని మానసంబున ధిక్క-రించుచుండును. అదియే యీతని పతనకారణము" అని నిలువక నడచుచుండఁ గొంతదడవునకు విజయుఁడు విశ్వంభరపైఁ బడి విగతజీవుం డగుడు వృకోదరుం డెప్పటి యట్ల యన్నతో " సకలగుణాభిరాముండును గృష్ణశ్రితుఁడు నగు నీవిజయుఁ డేల విగతజీవుఁ డయ్యెను ? " అనఁ, బరేతరాట్సూనుఁడు " మారుతీ ! పార్థుండు కురుసైన్యంబుల నొక్కనాఁడ గెల్తు నని చెప్పి యట్లు చేయలేకపోవుటచే నీతఁడు ముందుగ మృతి నొందుటకుఁ గారణ మయ్యె. మఱియు నీతండు తనకు సాటిధనుర్ధరు లెవ్వరు లే రని ప్రతివీరుని ధిక్కరించుచుండును. అందుచేత బీభత్సుండు విగతజీవుం డయ్యెను. " అని వెనుకఁ జూడక పోవుచుండెను. కొంతదడవునకు భీముండును గూలంబడి " అన్నా ! నే నెందుల కిట్లు పడిపోవుచున్నాను ?" అనఁ బితృపతిసూతి " పావనీ ! నీచరితంబు పావనంబె యయ్యు నభిమానధనుండ వగు నీ వమితభోజివి. మఱియుఁ బరులబలంబును దృణీకరించి నిందించు దోషంబు నీయందుండుటం జేసి నీ కిట్టిపాటు కలిగెను. " అని యాతనివలనినైనఁ జూడక ధీరస్వాంతుండై

సారమేయద్వితీయుండై చనఁజన, నింద్రుండు మాతలిచోదితర
థం బెక్కి ప్రత్యక్షుం బగుడు ధర్మజుండు వినతి నొనర్ప నిం
ద్రుండు "ధర్మరాజా ! ఏతద్రథం బధిరోహింపుము. నీసచ్చ
రితంబునకు సశరీరస్వర్గంబ యుచితంబ"నుడు శమనసూనుండు
"స్వర్పతీ ! సోదరభోగ్యంబు, పత్నీభోగ్యంబు గానినాకభోగం
బు నాకభోగ్యంబు. నాపత్నీసోదరు లీభూలోకంబునఁ బడి
యుండ నే నెట్లు స్వర్గంబునకు రాఁగల" నన నింద్రుఁడు "ధ
ర్మరాజా ! నీపలుకులు ధర్మయుక్తంబులు. నీపత్నీసోదరు లిట
ఘాతికశరీలములను విడిచి యింతకుమున్న పరలోకంబున నున్న
వారు. నీవట వారిం జూతు" వనెను. అప్పలుకులకు సమవర్తి
సూతి సంతసించి సారమేయమునకుఁగూడ రథారోహణమున
కనుజ్ఞఁగోర నాకపతి నవ్వి "మంత్రపూత పురోడాశము
కుక్క కర్హమగునే ? స్వర్గ మెక్కడ ? సారమేయ మెక్కడ ?
సకలధర్మవిదుఁడ వగు నీ విట్లాడ నుచితంబే ?" అన సమవర్తి
సూతి తనసమవర్తిత్వముఁ గనఁబఱుచుచు విశ్వాసి యగు కుక్కు
రమును విడువరామిం దెల్పి దీర్ఘముగ వాదింప నింద్రుం డాతని
ధర్మబుద్ధికి మెచ్చె. సారమేయము సమవర్తియై శమననందనా!
నీయోగ్యతం బరీక్షింప నిట్లు వచ్చితి నని స్వస్వరూపముఁ జూపి
యంతర్హితుం డయ్యెను. అంత నింద్రసహితుండై ధర్మజుఁడు
త్రివిష్టపంబుఁ జేరెను.

"రాజ్యాంతే నరకంధ్రువమ్మ"నునానుడి సార్థకముసేయు

ధర్మజుఁ డింద్రునానతి నరకముఁ జూడఁబోవుచు స్వర్గంబున
నొక్కయెడ భోగియగు దుర్యోధనుఁ గాంచి యీసునకుఁ బుట్టి
నిల్లును, బహువీరహానన హేతుభూతుండు నగునీతండిట్లు స్వర్గ
సుఖమునొందఁ గారణం బేమని విచారించుచు, రౌరవ, తామి
స్ర, కుంభీపాకాది నరకంబులఁ జూచుచు యాతనాదేహంబుల
నొంది యాతనల ననుభవించు జీవులయార్తనాదంబులనాలకించి
యుద్విగ్నమానసుండై పోవంబోవ నొక్కయెడ నపూర్వదృష్ట
స్వరూపంబుల నొంది యైదుగురుపురుషులు, నొకవనితయు,
"మహానుభావా! యుధిష్ఠిరమహారాజా! అట నించుక నిలు
నిలు, నీదర్శనమాత్రంబున, నీగాత్రపుగాలి సోఁకినంతమాత్ర
మున మాయాతన లుపశమిల్లుచున్న"వని శ్రుతపూర్వస్వరంబు
లం బలుకుడు శ్రామని నిర్విణ్ణుండై "మీరెవ్వ?" రన "నేను
కర్ణుండ, భీముండ, నర్జునుండ, నకులుండ, సహదేవుండ, ద్రౌ
పదిని" అని వా రనిరి. ధర్మజుఁ డామాటల నాలించి దుఃఖా
ర్తుండై కూలఁబడునంతలో దేవదూత యేతెంచి "మహారాజా!
దేవేంద్రుఁడు దేవలోకంబునకు రమ్మని యానతిచ్చుచున్నాఁ"
డన, ధర్మజుఁ డాతనితో నిట్లనియె. "ఓయీ! నాసతీసోదరు
లిట నరకయాతన లనుభవింపుచుండ నే నెట్లు స్వర్గంబునకు రాఁ
గలను? నాకిదియే స్వర్గము. నేను రానని బిడౌజునిఁ బలుకుము"
అన నాతండు పోయిన యనతికాలంబున కింద్రుఁడేతెంచి "రా
జా! నీసతీసోదరులు స్వర్గమును జేరిరి. కర్ణ, భీమా, ర్జున, నకుల,

సహదేవులు, ద్రౌపదియు, జ్ఞాతి సోదరాపకృతిచేతను, పరధిక్కారపారుష్యంబునను, అన్యథానుష్ఠాధిక్కారంబునను, స్వసౌందర్యపు గర్వంబునను, జ్ఞానంభావాహంభావమునను పార్థుపైఁ బక్షపాతంబునను దాత్కాలికపునరకము నొందిరి. అది యిటమీఁద లేదు. రా రమ్మన సంతసించి సునాసిరా! దుర్యోధనుం డేల స్వర్గము నొందె నన, పురందరుం డోయుధిష్ఠిరా! దుర్యోధనునం దెన్నిదోషంబు లున్నను నాతండు సుయోధనుండై రణహతుం డగుటచే వీరస్వర్గముఁ జూఱఁగొనె. నీ వింకను మానుషదేహంబు నొంది యుండుటచే నీర్ష్యాసూయలు నిన్ను వదలలేదు. పురోదృశ్యమాన వియద్గంగలోఁ గ్రుంకు మన నతండట్లు చేసి దేవత్వ మొంది సూర్య పవ నేంద్రాశ్వినులఁ గూడిన కర్ణ భీమ పార్థ యమళులను మహాశక్తిం గలిసిన ద్రౌపదిం జూచి సంతసిల్లి యనిర్వచనీయమోక్షము నొందెను. ఇటఁ బరిక్షిత్తు నారదాదులవలనఁ బితామహులు సన్యస్తులై స్వర్గము నొందుట విని నారాయణబలి విధానమున నిష్కృత్యాణుఁ డయ్యె.

ప్రథమప్రపాఠకము సమాప్తము.

# ద్వితీయప్రపాఠకము

## ప్రథమానువాకము

### పరిక్షిద్రాజ్యపాలనము

పరిక్షిత్తు పితామహదత్తమగు రాజ్యమునొంది "*దినాంతమున సూర్యునిచే నిహితమగు తేజమునొందిన యగ్నివలెఁ" బ్రకాశించెను. ఆతనికి, బాల్యముననె కురువీరుల శిరోంబరములం బొమ్మపొత్తికలగాఁ జేసికొన నభిలషించి తదభిలాషను నెఱవేర్చుకొనిన యుత్తర, కన్నతల్లి. పదునాఱవయేఁటనె యతిరథ మహారథులను వేలకు గోలకుఁ దెచ్చి భీష్మద్రోణాదులచే నసదుగాఁ డీతఁ డని నుతింపఁబడిన యభిమన్యుఁడు తండ్రి. ముక్కంటితో నొక్కటికయ్యమునఁ బోరి మెప్పొందిన విజయుండు పితామహుండు. వీరసోదరి వీరపత్ని వీరప్రసవ యగు సుభద్ర పితామహి. భీమ సుయోధనార్జునాది మహావీరులకుం గురువగు కృపాచార్యుం డాచార్యకుండు. తాను విద్యచే మనశ్శక్తిని, సాముగరిడీలచే శరీరశక్తిని, నస్త్రాస్త్ర విన్యాసాదులచే శస్త్రాస్త్రశక్తిని, పరిశ్రమచే దృఢముష్టిలక్ష్యలాఘవములను నలవఱచుకొనినట్టి దిట్ట—అయినను బరిక్షిత్తు పరరాష్ట్రముల

* సూర్యుని తేజస్సు రాత్రి యగ్నియందుఁ బ్రవేశించునని వేదమునఁగలదు.

నాక్రమించుట యుక్తము గా దనుకొనెను. కారణ మేమన, కురుపాండవయుద్ధ ఫలితముగా దేశము నిర్మనుష్యకల్పమై, జీవించిన పాండవేతరపక్షమువారు పుత్రకళత్రాదులతోఁ బరిదేవించుచుఁ బాండవభీతిని బలాయితులై పరదేశముల కేగుటచేతను, కృషి పాశుపాల్యాది వృత్తులు గలవారు సేనాశిబిరాది పరిహారముగా సుయోధనునిచే నియమింపఁబడి యాధివ్యాధులచే నశించుటచేతను, పరిసరములఁ జెలరేఁగిన కిరాతులు దాటి దోఁపుడుగాండ్రయి జనపదముల దోఁచికొన, నజ్జనపదవాసులు పలాయితు లగుటచేతను, కురుదేశమున వ్యవసాయము సన్నగిలినది. వృత్తులు నశించినవి. దీనికిఁ దోడు వడగండ్ల వానచేఁ బంటలు నశించినవి. * చాక్రాయణుఁడను ‘‘ఉషస్తి’’ ఋషి ‘ఆటకి’ యను భార్యతోఁ గురుదేశములో నొకగ్రామమున నేనుఁగులకాపరి యొంగిలి ‘‘అలచందల’’ ను దినవలసివచ్చినది. అట్టిపరిస్థితులం గాంచియుఁ జిన్నతనమునుండియు మహాయుద్ధమువలన నగు దుష్ఫలితములం దలంచియు మనస్సు కరఁగి పరిక్షిత్తు పరరాష్ట్రాక్రమణేచ్ఛను మాని ప్రజారంజనతత్పరుండై స్వరాష్ట్రాభివృద్ధికర కార్యములను నిర్వహింపఁ గడంగె.

తొలుదొల్తను దేశమును విడిచి పోయిన కౌరవులను సన్మానించి రప్పించి వారు గృహములు కట్టుకొని పాడిపంట

* ఈకథ ఛాందోగ్యోపనిషత్తున వర్ణింపఁబడెను.

లనుభవించురీతిని సదుపాయములఁ జేసెను. అందుల కాకుటుంబములవా రానందించుచుండిరి. ఆవృత్తాంతము నొకఋషి యిటులు గానముఁ జేసియున్నాఁడు.

(1) “ పరిక్షిత్తు సింహాసన మెక్కి మాకు క్షేమముఁ జేయుచున్నాఁడని యింటిని గట్టుకొనుచు, నొకకౌరవ్యుఁడు భార్యతో ననుచున్నాఁడు ”

“ నీ కేమికావలయును పెరుఁగా ? పాయసమా ? మద్యమా ? దేనిని దెత్తు నని పరిక్షిద్రాజ్యమునందు భార్య భర్త నడుగుచున్నది. ”

కౌరవకుటుంబముల నిటుల సంతోషపెట్టి నదులనుండి నీటిని గాలువలమార్గమున భూమిపైఁ బ్రవహింపఁజేసి సస్యములు వృద్ధియై పంట లభివృద్ధి నొందునటులఁ జేసెను. ప్రజలు సుఖముననుండిరి. ఆవృత్తాంతమును వేఱొక ముని యిటుల గానముఁ జేసెను.

(2) ఏభూమియందు సముద్రములు నదులు నీటి నిచ్చుచున్నవో, ఏభూమియందు దున్నుటచే నన్నము లుత్పన్నము

(1) “ పరిక్షిన్నః క్షేమమకరుత్తమ ఆసన మాచరన్ కులాయం కృణ్వన్ కౌరవ్యః పతి ర్వదతి జాయయా ”

“ కతరత్త ఆహరాణి దధిమన్థం పరిస్రుతం జాయాపతిం విపృచ్ఛతి రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః॥ అథర్వసంహితా 20-128.

(2) యస్యాం సముద్ర ఉత సింధు రాపో యస్యా మన్నం కృష్టయస్సంబభూవుః॥

లగునో, అట్టిదిభూమి—దీటలోనుండి పండిన యవధాన్య మా కాశమునందలి వెలుఁగుకొఱకు పైకిఁ బోడుచుకొని వచ్చుచు చున్నది. పరిక్షిత్తు పాలించుచున్న రాజ్యమునఁ బ్రజలు సుఖముగా వృద్ధినొందుచున్నారు !

యవలు మాత్రమె కాదు, వడ్లును బండుచున్న వనియు వర్షోదకముచే విరివిగా వ్యవసాయము చేయఁబడుచున్న దనియు నొకముని గానముఁ జేసియున్నాఁడు.

(1) ఏభూమియందు వడ్లు యవలు నాహారములగునో, ఏభూమియందు విరివిగా వ్యవసాయము చేయఁబడుచున్నదో మంచివానలుగల పర్జన్యపత్నియగు నాభూమికి నమస్కారము.

పరిక్షిన్మహారాజు కలియుగారంభపు రాజు, ద్వాపరాంతమున యవలు గోధుమలు పల్లెలయందుఁ బండు ననియు జనులాగ్రామముల నాశ్రయింతు రనియుఁ గలియుగవృత్తాంత మను పేర మహాభారతమున నిట్లు సూచింపఁబడెను.

"(2) యవలు గోధుమలు నాహారముగాఁగల జనపదములను జనులు చేరుదురు."

---

అభీవస్వః ప్రజిహీతే యవః పక్వః పథోబిలం। జనః సభద్ర మేధతే రాష్ట్రే రాజ్ఞః పరిక్షితః॥ అథర్వ సం॥ 20–128.

(1) యస్యామన్నం వ్రీహియవాః యస్యా ఇమాః పంచ కృష్టయః భూమ్యై పర్జన్యపత్న్యై నమోఽస్తు వర్షమేదసే॥ అథ, 12–14.

(2) శ్లో. యేయవాన్నా జనపదా గోధూమాన్నా స్తథైవచ। దేశాన్ సమాశ్రయిష్యంతి యుగాంతే పర్యుపస్థితే॥ మహాభారతవనపర్వము.

హిమవత్పర్వత పరిసరము నుండిన రాజ్యము కురురాజ్యము. ఆరాజ్యభూమి పాడి పంటలు, బంగారము, ఇనుము రత్నములు గలిగి రథమార్గములు బండిదారులు కాలిదారులు కలిగి జనపదముల కష్టసుఖములఁ దెలిసికొను స్థానిక పాలన సంస్థలు కలిగి నానా దేశముల వారు వచ్చిపోవుచు వర్తకము విరివిగా జరుగుచుండుటచే వివిధభాషలు మాటలాడువారు కలిగి చోరభీతి యెడనెడ మార్గములలోఁ గలుగుచుండఁ దన్ని వారణోపాయములు కలిగి యందఱు సమానముగా సుఖము ననుభవించు రీతి విరాజిల్లుచుండెను అని యొకఋషి పృథ్వీసూక్త మనుపేర సుందర గానము చేసెను.

“ (1) భూమి బాధలు లేకుండునట్లు మానవుల నొక్కెడఁ గూర్చుచు నందఱు సమానముగా జీవించుటకుఁ దగియుండు నానావిధ బలముల నిచ్చు నోషధులను ధరించుచున్నది. ఆభూదేవి మమ్ములను రక్షించుఁగాక. ”

“ (2) చిన్నరాళ్లు పెద్దరాళ్లు ధూళి కలభూమి మమ్ములను భరించుచున్నది. అట్టి యీభూమి బంగారము హృదయ

---

(1) అసంబాధం బధ్యతో మానవానాం యస్యా ఉద్వతః ప్రవతః సమంబహు నానావీర్యా ఓషధీర్యా బిభర్తి పృథివీ నః ప్రథతాం రాధ్యతాం నః॥ అథర్వవేద. కాండ 12. సూక్త 1 ఋక్కు 26.

(2) శిలాభూమి రశ్మా పాంసుః సాభూమి స్సంధృతా ధృతా తస్యై హిరణ్యవక్షసే పృథివ్యా అకరం నమః॥

స్థానమునందుగలది. ఆబంగరుగనులు గల యీభూమికి నమస్కారము."

(1) "ఏభూమియందు వృక్షములును, పుష్పింపక కాచెడి (మఱ్ఱిమొదలగు) వృక్షములును వ్యాపించియున్నవో యనేకవిధములుగా నిమమును ధరించియున్నదో యట్టిభూమి రక్షించుగాక."

(2) "తేజస్సును బలమును గలిగించు నన్నభాగమగు నేతినొసఁగు నోభూమీ! నిన్ను స్తుతించుచున్నాము."

(3) "ధనము రత్నములు బంగరు దొరకెడి నిధులను గుహలను ధరించెడిభూమి మంచిమనస్సుతో నాకు ధనము నొసంగుఁగాక."

(4) "అనేకభాషలను మాటలాడుచు నానావిధధర్మములు గల జనులకు వారివారి స్థితుల కనుకూలముగానుండిన యీభూమి గోవు పాల నిచ్చునటుల సహస్రవిధములుగా ధనము నొసఁగుచున్నది."

(5) "ఓదేవా! ఏమార్గములు విశేషముగా జనులచే నడవఁబడుచుండెనో యారథమార్గములు బండిదారులు కాలి

(1) యస్యాం విపృక్షా వనస్పత్యా ధ్రువాస్తిష్ఠంతి విశ్వహా పృథివీం విశ్వధాయసం భృతా మచ్ఛావధామః॥ (2) ఊర్జం పుష్టం బిభ్రతీ మన్నభాగం ఘృతం త్వాభినిక్షిదే సుభూమే॥ (3) నిధిం బిభర్తి బహుధా గుహావసు మణిం హిరణ్యం పృథివీ దధాతు మే వసూని నో వసుదారాసమానా దేవీ దధాతు సుమనస్యమానా॥ (4) జనం బిభ్రతీ బహుధా వివాచ

దారులు మంచివారికిఁ జెడువారికి నుపయోగపడుచున్నవి. ఆదారులయందు శత్రువులును దొంగలును లేకుండఁగఁ గాపాడుము. ఈభూమియం దేది మంచిది కలదో దానిని మాకిమ్ము."

(6) "భూమిమీఁదఁ గల గ్రామములలో నరణ్యములలో సభలలో జనసమూహములలో సమితులలో మేము నీకుఁ బ్రియమైనటులు మాటలాడుదుముగాక!"

(7) "ఓభూమీ! నీయందుఁ గల హిమవత్పర్వతములు, అరణ్యము ఆనందము నిచ్చుఁగాక. పచ్చని నల్లని యెఱ్ఱని రంగులు గలుగు ననేకవిధ క్షేత్రములు గలిగి యింద్రునిచే రక్షింపఁబడుచున్న యీభూమి జన్మాంతమువఱకు నానందమిడుఁగాక.

పరిక్షిత్తును స్తోత్రముచేసినయెడల పశు భాగ్యాభివృద్ధి యగు ననియు దేవతలస్తవముతో నది సమ మనియు నేఁటి

---

సం వానాధర్మాణం పృథివీయథౌకసం। సహస్రం ధారా ద్రవిణస్యమే దుహాం ధ్రువేవ ధేనురనపస్ఫురంతీ॥ (5) యేతే పంథానో బహవో జనాయనా రథస్య వర్త్మాఽనసశ్చ యాతవే యైస్సంచరం త్యుభయే భద్రపాపాస్తంపంథానం జయేమా నమిత్ర మతస్కరం యచ్ఛివం తేన నోమృడ॥ (6) యేగ్రామా యదరణ్యం యా స్సభా అధిభూమ్యాం యేసంగ్రామా స్సమితయ స్తేషు చారు వదేమతే॥ (7) గిరయస్తే పర్వతా హిమవంతోఽరణ్యం తేపృథివీ స్యోనామస్తు బభ్రుం కృష్ణాం రోహిణీం విశ్వరూపాం ధ్రువాం భూమిం పృథివి మింద్రగుప్తాం అజీహతో అక్షతోఽభ్యష్ఠాం పృథివి మవత్॥

ఋషులే తలఁచుచుండిరి. దానికేయు నాతఁడు సర్వసముఁడని యు నందఱకుఁ బ్రేమపాత్రుఁ డగుటచే జనియు, వేయునేల? భగవత్సముఁడే యని యజ్ఞకర్మయందు బ్రాహ్మణాచ్ఛంసి "న్యూంఖ"గా గానము చేయుచుండెను. పరిక్షిత్సామము గల భాగము "నారాశంసి" యందురు. పరిక్షిత్సామము గల ఋక్కులకు "కుంతాపసూక్త" మనిపేరు. పరిక్షిత్సంబంధము గూర్చి వాతిశయముచే "మహీదాస" మహర్షి తన "ఐతరేయబ్రాహ్మణము"లో (1) పరిక్షిత్తనఁగా నగ్ని యనియు, అగ్ని ప్రజలఁ జుట్టుకొని యుండునటులఁ బరిక్షిత్తు ప్రజలఁ జుట్టుకొని యుండు ననియు లేక ప్రజ లగ్నిని మూఁగినటులఁ బ్రజ లాతని చుట్టు మూఁగుదు రనియు లేక పరిక్షిత్తన సంవత్సర మనియు సంవత్సరము ప్రజలఁ జుట్టుకొనినటులఁ బరిక్షిత్తు ప్రజల నావరించు ననియు లేక ప్రజలు సంవత్సరమును జుట్టునటులఁ బరిక్షిత్తుం బ్రజలు చుట్టుదు రనియు బ్రాహ్మణించియున్నాఁడు.

"అంగిరస్సు" అనుముని తనయథర్వవేదమున నిట్లు పరిక్షిత్తును గుఱించి చెప్పెను.

---

(1) "న్యూంఖః పారిక్షితీః శంసతి అగ్నిర్వై పరిక్షిద్ అగ్నిర్హీమాః ప్రజాః పరిక్షేతి అగ్నిర్హీమాః ప్రజాః పరిక్షియన్తి అగ్నేరేవ సాయుజ్యం సరూపతాం సలోకతా మశ్నుతే య ఏవం వేద. యద్వేవ పారిక్షితీః 3 సంవత్సరోవై పరిక్షిత్సంవత్సరో హీమాః ప్రజాః పరిక్షేతి సంవత్సరం హీమాః ప్రజాః పరిక్షియంతి సంవత్సరస్యైవ సాయుజ్యం సరూపతాం సలోకతా మశ్నుతే య ఏవం వేద|| ఐతరేయబ్రాహ్మణ 6-6.

(1) ఓ గాయకుడా! పశువులను భాగ్యమును సమకూర్పఁగల ఋక్కును బఠింపుము. విలుకాఁడు విశిఖమును గురిపెట్టునటులు దేవతలకుఁ బ్రార్థనను సిద్ధముచేయుము."

"పరిక్షిత్స్తవమును వినుఁడు; ఆతఁ డందఱుప్రజలకుఁ బ్రేమాస్పదుఁ డగు రాజు. మానవులకు భగవంతుఁ డగు నగ్ని వలె నధికుఁడు."

పరిక్షిత్తుచేఁ బాలింపఁబడెడి కౌరవ్యులుకూడ గౌరవము గానే చూడఁబడినటులు "మహీదాస" మహర్షి కౌరవశబ్దమునుగూడ న్యూంఖగా నుచ్చరింపవలయు ననుటచే నూహింపఁబడుచున్నది. కౌరవ్యులు కల్యాణమగు కర్మను జేయువా రని, 'ఐతరేయబ్రాహ్మణము'న నిట్లు చెప్పఁబడెను.

(2) కౌరవ్యశబ్దమును న్యూంఖగా నుచ్చరింపవలెను. దేవత లేకల్యాణకర్మను జేసిరో యది కౌరవ్యులచేఁ బొందుచున్నారు. అట్లు, యజమాను లేకల్యాణకర్మను జేయుచుండిరో యది కౌరవ్యులచే యజమానులు పొందుచున్నారు."

---

(1) ప్రరేభధీం భరస్వ గోవిదం వసువిదం। దేవత్రేమాం వాచం శ్రీణీహీషుర్నవీర అస్తా॥ రాజ్ఞో విశ్వజనీనస్య యో దేవో మర్త్యా అతి। వైశ్వానరస్య సుష్టుతిమా సునోతా పరిక్షితః॥ అథర్వ. 20_127.

(2) బ్రా॥ న్యూంఖః కౌరవ్యాః శంసతి దేవా వై యత్కించ కల్యాణం కర్మాకుర్వం స్తత్కౌరవ్యాభి రవాప్నువం స్తథైవైతద్యజమానా యత్కించ కల్యాణం కర్మ కుర్వంతి తత్కౌరవ్యాభిరాప్నువంతి॥
ఐ బ్రా. 6. 54.

పై యంశముఁబట్టి పరిక్షిత్తునకు లోఁబడిన కౌరవులు గౌరవకార్యములఁ జేయుచుండి రని తోఁచును. మఱియు "అంకురారోపణము" (గింజలను మొలపించుట) కల్యాణకర్మగా యజ్ఞములయందును వివాహాది శుభకర్మలయందును నెంచఁబడును. కాన కౌరవ్యులు వ్యవసాయకులైనఁ గావచ్చును. యజమానునకుఁ గల్యాణకర్మను జేయువా రనుటచేఁ బరిక్షిత్తునకు భృత్యులైన నగుదురు. 'న్యాంఖ' యను గౌరవబిరుదము కౌరవ్యుల కుండుటచే, పరిక్షిత్తుకడ కౌరవ్యులు రాజపురుషులైనఁ గావచ్చును. ఇట్లు సర్వసమ్మతముగ సుఖకరముగ రాజ్యపాలనా వ్యవహారములను స్థిరపఱచి దేశము ధన ధాన్య ప్రజా సంపద్యుక్తముగాఁ జేసి పరిక్షిత్తు వినుతినొంది సంతుష్టుఁ డయ్యెను.

---

## ద్వితీయానువాకము

### మాద్రవతీపరిక్షిత్తుల వివాహయత్నము

ఆశ్రమచతుష్టయములో గార్హస్థ్యము తక్కిన యాశ్రమత్రియమునకు నాధారభూతము. అందువలననే "బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి జటి పరివ్రాజకాదు"ల కాధారభూతము గృహస్థాశ్రమ మని యొకకవి చెప్పెను.

గృహస్థాశ్రమమును స్వీకరించుటకుఁ బూర్వము ముప్పదియాఱు లేక పదునెనిమిది కాకున్నఁ దొమ్మిది సంవత్సరములు గురువుకడ వేదాధ్యయనముఁ జేయవలయు నని మన్వాదులు విధించియున్నారు. అట్లే పరిక్షిన్మహారాజు ముప్పదియాఱేండ్లుత్తమవిధినే బ్రహ్మచర్యము నవలంబించి యధీతవేదవేదాంగుఁడై "ఫలవదర్థావబోధ పర్యంతము" రాజనీతి నభ్యసించి గార్హస్థ్యముచే "పురుషార్థత్రయమును" సాధింపఁ దలఁచెను.

(1) "ఏస్త్రీయందు మనస్సు కన్నులు నిబద్ధమైయుండునో యాస్త్రీయందే సంతానాద్యభివృద్ధి యగును." అనియు రూప శీలాదులు గలుగునామె నుద్వాహము కావలె ననియు మహర్షులు వక్కాణించుటచే నట్టి యామె "ఉత్తరమద్రదేశము" నేలినట్టి "శల్యునకుఁ" బౌత్రుఁడగు నుపశల్యుని కుమార్తె మాద్రవతి యనునామె కల దని విని యామె వృత్తాంతము నరసిరమ్మని విదుషీమణులగు నంతఃపురపరిచారికల నంప వారు మాద్రవతిని జూచి కతిపయదినంబుల కేతెంచి పరిక్షిత్తు మోలఁ దమయభిప్రాయముల నిటుల విన్నవించిరి. "మహాప్రభూ! శిరీషకుసుమకోమలయు సర్వాంగసుందరియు నగు మాద్రవతి తన్వి, శ్యామ, సుభ్రు, కేకికచ, మంజుభుజ, శిఖరిదశన, పక్వబింబాధరోష్ఠి, చకితహరిణీప్రేక్షణ, ఉడురాజముఖి, మృగరాజకటి, గజరాజవిరాజితమందగమన; పలుపలుకు

(1) "యస్యాం మనశ్చక్షుషో ర్నిబంధ స్తస్యా మృద్ధిః"॥ ఆ, గృ॥

లేల ? అచ్చిలుకలకొలికి పలుకులఁ బలుకులవెలందిని, రూపునఁ గలుములచెలిని దలఁపింపఁజేయుచు యువతీసృష్టిఁ బక్కడాల్వేలుపుపొక్కిలిపసిబిడ్డం డాదినె యీయామెను సృష్టించెనో యనునట్లుండును. ఆమె యాకారమునకుఁ దగినవిద్యయు విద్యకుఁ దగిన ప్రజ్ఞయుఁ బ్రజ్ఞకుఁదగిన సౌశీల్యమును సౌశీల్యమునకుఁ దగినచేఁతలు కలిగి సర్వవిధముల నీకుఁ దగియున్నది. ఆమెయు నీవును గూడిన సరస్వతింగూడిన బ్రహ్మవలె, లక్ష్మిం గూడిన విష్ణువువలె, గౌరిం గూడిన గిరీశునివలె నుందువు ''

అని చెప్పి మాద్రివతీచిత్రపటం బొండు సమర్పింపఁ బరిక్షిత్తు చిత్రదర్శనంబునన దృగవస్థను బిమ్మట మనస్సంగ సంకల్ప జాగరావస్థల నంది మఱుచటి మధ్యాహ్నమునకె కార్శ్యము నొంది యరతిచే నాహారాభావము గలుగ సాయంకాలము వఱ కెట్టెటులో విరాళిని సహించి, హ్రీత్యాగముఁ జేసి, యయ్యారాతిభీకరుండు రాతిరి (1) " రాతితో మంతనంబుండి " మాద్రివతి నుద్వాహ మగుట కుద్యోగించి మఱునాఁడు మంత్రివంతులు ప్రయాణయోగ్యోచిత వస్తుసమన్వితులు నగు కృపాది వృద్ధులఁ గొందఱ సుహృత్తులను దనకొఱకు మాద్రివతి యను కన్యను వరింపుఁ డని పంప వారు కతిపయదినంబులకు మద్రిపురికేగి తద్దేశాధీశ్వరుం గాన్పించుకొని

" ఓ మహారాజా ! ఆంగీరస గౌరవీత (2) సాంకృత్య

(1) "రాతినా సంభావ్య యథార్థం గచ్ఛతి" ఆ, గృ. సూ:

(2) భీష్మ ధర్మజులు వైయాఘ్ర గోత్రజు లని భారతమునఁ గలదు.

ప్రవరాన్వితుఁడును వైయాఘ్రగోత్రజుండును, పాండుర యశో విరాజితుఁడగు పాండువర్మకు నప్తయు, దుర్జనసంతర్జనుండగు నర్జునవర్మకుఁ బౌత్రుండును, వీరాధివీరుం డగు నభిమన్యువర్మ కుఁ బుత్రుండును కృష్ణకృత శత్రుయశస్కుండును కృష్ణపరీ క్షితుండు నగు పరిక్షిద్వర్మకు మీపుత్రికాలలామయగు మా త్రివతిని వరింపవచ్చితి మనిరి.

ఆయుపశల్యుండు పాండు, నకులులకుఁ దమయాఁడు బిడ్డల నిచ్చుటచేఁ బూర్వసంబంధ మని సంతసించి వృద్ధమంత్రి పురోహితులకును దనరాణికి నెఱింగించి మాద్రివతి కావృత్తాం తముఁ జెప్ప నంతకుముందె పరిక్షి న్మహాప్రభుగుణసంపదలను విని పరిక్షిత్తునకు సమానమగు ననంగదశల ననుభవించు నామాద్రి వతి యత్యంతానందము నొంది చూపులచేతనే సమ్మతిఁ దెలుప నుపశల్యుండు గౌర్యాది పూజలఁ గావింపఁజేసి కృపాదులకు సమ్మతిఁ దెలిపి కులవృద్ధ పురోహితులతో వారికడ కేతెంచి, ,, కాశ్యపా వత్సారా సిత " ప్రవరాన్వితుండును గాశ్యప గో త్రజుండునై శత్రుహృదయ శల్యుండగు శల్యవర్మకు నప్త్రియు నిర్ణిద్ర పరాక్రముండగు మద్రవర్మకుఁ బౌత్రియు నతామిత్ర

భీష్మకృతద్రవ్యణవిధిని జెప్పు స్మార్తానుక్రమణికాదులలో భీష్ముఁడు సాంకృతి ప్రవరాన్వితుఁ డని చెప్పఁబడెను. ఆపస్తంబ ఆశ్వలాయన ప్రవరఖండ లలో వైయాఘ్రగోత్రము మృగ్యము. సాంకృతిప్రవర కలదు. ఆప్రవర యిచట గ్రహింపఁబడెను.

విశల్యకరణియగు నుపశల్యవర్మకుఁ బుత్రియు సర్వమంగళ గుణములచే సర్వమంగళా సమానయగు మాద్రవతిని పరిక్షిద్వర్మకిచ్చుచుంటి మని చందన తాంబూలాదుల నిచ్చి బహూకరించి కార్తాంతికులను రావించి ముహూర్తముఁ దెలుపుఁ డన వారు "జామిత్రశుద్ధియుఁ" బంచకరహితము శుభగ్రహదృగ్బలము గల లగ్నము" నిర్ణయించి యాసన్నముహూర్తమునె తెలుపఁ గృపాదు లాశుభవార్తను వెవ్వేగమె పరీక్షిత్తునకుఁ దెలుప జంఘాలుర ముందంపి వెంటఁ దాము గతిపయప్రయాణంబులు చేసి హాస్తిపురిం జేరి యంతకుఁ బూర్వమె శుభవార్తఁ దెలిసిన పరిక్షిత్తునకు సవిస్తరముగఁ దాము పోయివచ్చినయంశముల నెఱిఁగించి సంతసింపఁ జేసిరి. ఉత్తరా సుభద్రలు కృపునిచే యావద్వృత్తాంతముఁ దెలిసి కలిసిన సంబంధమే యని సంతసించిరి.

---

## తృతీయానువాకము

### పరిక్షిత్తు మాద్రవతిం బెండ్లియాడుట

పరీక్షిత్తుచేఁ గృప యుయుత్సులు వివాహ మంగళోచిత కర్మకలాపంబులు నిర్వర్తింప నియుక్తులై మిత్ర బంధుసామంత దండనాథాదులకు శుభలేఖలను వ్రాయించియుఁ గులవృద్ధుల నంపియుఁ దరలిపోవుదివసంబునకుఁ బూర్వదివసంబుననె వారు

వచ్చునట్లు సేసిరి. యయ్యుత్సుచే స్వాయముగ నాహూతుం డగు బభ్రువాహనుండు సపరివారుండై రాఁ బరిక్షిత్తు, తండ్రి యభిమన్యుండె వచ్చినట్లు సంతసిల్లెను.

పెండ్లికి, పెద్దలు వృద్ధులగు నైదువలు ముద్దియలు విద్దెల నారితేఱిన సద్గురువులు వివాహకర్మకలాపంబులు నిర్వర్తించు పురోహితులు మంత్రి దండనాథులు సహాధ్యాయులు సతీర్థులు మిత్రులు భృత్యులు పరిచారికా పరిచారకులు పేరభటులు పాచకులు వీణా వేణు భేరీ కాహళాది మంగళవాద్యనాదకులు పయనం బయిరి. వారిలో వివాహములకు సాధారణముగ వచ్చు పాత్రేసమ్మితులు గాని దేవానాంప్రియులు గాని లేకుండిరి. వారు రథములపై వాహనములపై శకటములపై నడకలపైఁ బ్రయాణంబులు సాగింపఁ దివురుచుఁ దో నేతేరఁ బరిక్షిత్తు నీలనీరదసన్నిభంబులగు నాజానేయములఁ బూన్చిన తేరిపై మృగరాజలాంఛనం బగు కేతనంబు నెత్తించి శుభాలంకృతుండై, యుచితపరికరంబుల నవలంబించిన సూతునితోఁగూడిన యారథము మంగళవాద్యంబులు భూనభోంతరాళంబు మారుమ్రోయ నధిరోహించి యింద్రవిభవలెం బ్రకాశించుచు మద్రపురీ పరిసరంబుం జేరెను.

ఉపశల్యుండును మహోత్సాహంబున బంధుమిత్రామాత్య పురోహితాదులతో నెదురుసన్నాహంబుఁ జేసి యాచ్ఛాదనాలంకరణంబులం బరిక్షిత్తును బభ్రువాహనుఁ దక్కుం

గలవారిని గౌరవించి, పిమ్మట „ ముక్తాఫల సరిజ్మణి చిత్రిర ధ్యయు, తప్త కార్తస్వర వేశ్మజాలయు మహేంద్రి నీలోపల హార్మ్యమాలయు, చంద్రాశ్మ సౌధాంతర లోలడోలయు లస త్పతాకామలకాభిరామయు నగుట నశేష మనోభిరామ యగుచు స్వలంకృతమగు తనపురిలో నొక్కయెడ విశాలచామీకర చంద్రశాలయు నిందుకాన్తోపల బద్ధనుస్యయు, చంద్రాశ్మ నీలోపల స్తంభంబులపై నున్న కృత్రిమపుత్రికల హస్తంబుల నొప్పారు దీపికలచేఁ బ్రకాశమాన మగు నొక ప్రాసాదమునఁ బరివారసహితంబుగఁ బరిక్షిత్తును విడియించి పెండ్లివారికిఁ దగినయాహారోపహారాదుల నేర్పఱచెను.

పిమ్మటఁ గార్తాంతికు లాసన్న ముహూర్తముం దెలుప మంగళస్నాతులు నలంకృతులు నగు మాద్రవతీ పరిక్షిత్తులను ముత్తెంపుముగ్గుల తతసంపుతోరణంబుల శాతకుంభ స్తంభంబులఁ జిత్రవిచిత్ర కృత్రిమపుత్రికలచేతులం గల కరదీపికలచే విరాజిల్లు కల్యాణమండపము నుభయపక్షములవారును జేర్ప బ్రాహ్మణులు స్వస్తివాచకంబు లనువదింపఁ బరిక్షిత్పురోహితుండగు „ నుపధ్యాయుఁడును ” నుపశల్యపురోహితుం డగు సుమంతుండును బ్రహ్మపీఠంబుల నధివసించి „ ప్రథమాన కైతకశిఖాలీలాయితసుస్మితు ” లగు దంపతులఁ బెండ్లిపీటలకుఁ దెచ్చిరి. సుమంతుండు ప్రాచీనగ్రీవము నుత్తరలోమము గలుగు „ అనడుహ ” చర్మముపైఁ బరిక్షిత్తు నుపవిష్టుంజేయించె.

ఉపకల్యాందు తనజాయ సువర్ణకలశంబున నుదకంబు పీడఁబట్టి
త్పాదఁబులఁ గడిగి తడియొత్తి యాతనిచే వార్పించి మధుపర్క
ప్రాశనముం జేయించి విష్ణుస్వరూపుండ వగు నీకు నాపూర్వు లే
డుతరములవారును నాపరమున వచ్చు నేడుతరములవారును నే
నును శాశ్వతబ్రహ్మలోకము నొందుటకై కనకసంపన్నురాలును
గనకరత్నాభరణయుక్తయు నగు నీమెను దానమిచ్చుచున్నా
నని పరిక్షిత్తు నిలిచియుండ శ్రీఖండ ఫల యుక్తమగు మాద్రి
వతీ హస్తపుటము నాతని హస్తములలో మంగళవాద్యములు
మ్రోగుచుండ నొసఁగెను. ధర్మము చేయుటకొఱకుఁ బ్రజాసంపత్తి
కొఱకీమెం బరిగ్రహించుచుంటి నని పరిక్షిత్తు పరిగ్రహించెను.

మున్ను ప్రధానహోమమొనర్చిన పరిక్షిత్తు మాద్రవ
తితోఁ గూడి ప్రవేశహోమముఁ జేసి విధ్యుక్తముగా దేవతల
నీరీతిం బ్రార్థించెను. (1) "ఓవరుణదేవుఁడా! ఈమెను అభ్రా
తృకనుగాఁ జేయకుము. ఓబృహస్పతీ! ఈమెను బతిహీనఁగాఁ
జేయకుము. ఇంద్రుఁడా! ఈమె నసుతఁగాఁ జేయకుము."
అని పిమ్మట మాద్రవతితో ,, ఓకన్యకా! నిన్నీపితృగృహ
మునుండి తప్పించి నాగృహమునకుఁ దీసికొనిపోవుచున్నాను.
అచటినుండి నీవు విడివడ వీలులేదు. నిన్నచ్చటనే స్థిరముగా

(1) అభ్రాతృఘ్నీం వరుణాపతిఘ్నీం బృహస్పతే ఇంద్రా పుత్రఘ్నీం
......కురు॥ ఏకాగ్ని కాండ॥

నుండునటులు చేయుచున్నాను. " అని ,, ఓయిందాౢ! ఈమె సుపుత్రులనుగాను మంచి భాగ్యము గలదానినిగాను జేయుము. " అని ప్రార్థించెను. పిమ్మటఁ బెండ్లికి వచ్చిన పెద్దలను ద్దేశించి " ఆర్యులారా! ఈమె మంచి మంగళములతోఁ గూడినది. ఈమెను మీరాశీర్వదించి చేరి యైశ్వర్యముతో నీమె కూడునటులఁజేసి మీగృహముల కేగుఁడు. " అనెను. పిమ్మట యథావిధిగ (1) ,, నాజీవమునకు హేతు వగు నీమంగళసూత్రమును నీకంఠమునఁ గట్టుచున్నాను. ఓకన్యా! దీనితో నూ ఱేండ్లు జీవింపుము " అని మంగళసూత్రధారణ మొనర్చె. పిమ్మట నుపశల్యుండు దాస దాసీజనమును రథ గజ తురగాదులను, రత్నాభరణములను, అల్లునకు చూపఱు లమితానందము నొందురీతి నమితముగ నిచ్చి శోమదితకు నరణముగా నమూల్యవస్త్రాభరణాదుల నొసఁగి కన్యాదాన ఫలావాప్తికై షోడశవిధ మహాదానములను బ్రాహ్మణుల కొసఁగెను. ఎడనెడ వధూవరులు, లాజహోమము, సప్తపదులు మొదలగు క్రియలఁ జేయునపుడు వధూవరులు ప్రేమను దృఢపఱచు నట్టివియు నెన్నఁడు విడనాడ రానట్టివియు నగు వివిధప్రమాణములఁ జేసిరి. అందీ క్రింది భర్తృవాక్యముచే భార్యకు సర్వాధికారమిచ్చిన ట్లెంచఁబడెను.

---

(1) శ్లో. మాంగల్య తంతు నానేన మమజీవన హేతునా| కంఠే బధ్నామి సుభగే త్వంజీవ శరదాంశతం||

(1) "ఓకన్యకా! నీకీ పతికులమునందుండు ప్రేమ సంతానముతోఁ గూడ వృద్ధియగుఁగాక! ఈగృహమందు గృహయాజమాన్యము కొఱకు జాగరూకురాలవై యుండుము." (2) "ఓనారీ! నీవు మామగారియందు రాణివి కమ్ము. అత్తగారియందు రాణివి కమ్ము. ఆడుబిడ్డలయందు రాణివి కమ్ము. బావమఱఁదులయందు రాణివి కమ్ము."

ఇట్లు పెండిలితంతు జరుగుచుండ నెడనెడ బ్రాహ్మణుల యొక్క వేదోక్తాశీర్వచనములు కవులయొక్క కృత్యాశీర్వచనములు పెద్దల యాశీర్వచనములు వందిమాగధుల స్తుతిపాఠములు నొందుచు దంపతులు లక్ష్మీనారాయణాంశముచే విరాజిల్లిరి. ఉపశల్యుం డావరసంబంధుల నమేయా మూల్య వస్త్రాభరణాదులచే సత్కరించెను.

పిమ్మటఁ బరిక్షిత్తు సపరివారుండై నవోఢతో హస్తిపురి కేతెంచి యుత్తరా సుభద్రలకు నవవధువుఁ గూడి మ్రొక్కి వారల నానందాంబుధినిమగ్నులం గావించెను. హస్తిపురియందుఁ గురుదేశమునందును మహారాజపరిణయ చిహ్నముగాఁ బెక్కు లుత్సవములు విందులు నాట్యములు విరాజిల్లెను. పరిక్షిత్తు తన పరివారమునకె కాక దేశస్థుల కందఱకు వివిధ బహూకారముల

(1) ఇహప్రియం ప్రజయా తే సమృధ్యతా మస్మిన్ గృహే గార్హపత్యాయ జాగృహి. (2) సమ్రాజ్ఞీ శ్వశురే భవ సమ్రాజ్ఞీ శ్వశ్ర్వాం భవ ననాందరి సమ్రాజ్ఞీ భవ సమ్రాజ్ఞీ అధి దేవృషు. ఋ 10-85-46.

నొసఁగి సత్కరించెను. మాద్రివతియుఁ గ్రమంబున మహారాజు వకుం దగినమహిషి యనిపించుకొనుచుఁ బ్రజలకుఁ గన్నతల్లివలె ననేకోపకార కార్యములఁ జేయుచు మహారాజుచేఁ జేయించుచు ధర్మార్థ కామములఁ బరిక్షిత్తుం బరితృప్తుం జేయుచుఁ దాఁ బరితృప్తి నొందుచుఁ బరిక్షిత్తునకు ఛాయవలెఁ బ్రవర్తిల్లుచు ననంతశ్రీమతియని ప్రఖ్యాతి నొందుచు గదళీవంధ్యయుఁ గాక వంధ్యయుఁ గాక, జనమేజయ శ్రుతసేన భీమసేనో గ్రసేనులను పుత్రరత్నంబుల నల్వురఁ గ్రమంబునం గని యానంద వాహిని నోలలాడి పతిని బ్రజల నోలలాడించెను. అన్నలువురుపుత్రులు క్రమంబున విరాజిల్లిరి.

---

## చతుర్థానువాకము

### గోపరిపాలనము

భారతీయులకు గోవుకంటెఁ బవిత్రమగు వస్తువేదియుఁ గానరాదు. వేదములు—యజ్ఞములు—పురాణములు—వ్రతములు—శుభకర్మలు— అశుభకర్మలు— వ్యవసాయము— ఐశ్వర్యము—భోజ్యము—భోగ్యము—ఇది యది యన నేల— సమస్తము గోవుతో సంబంధించియే యుండును.

జీవించినంతకాలము గోవుచేఁ దరించితి ననుకొనెడి

యార్యమతస్థుఁడు చచ్చినపిమ్మటఁగూడ గోదానము చేసినన కాని పరలోకమునందలి * "వైతరిణీనది" యను నరకముఁ దరింపలే నని తలంచుట గోమహిమాతిశయమునకు నిదర్శనము గాదా! గోదానవిశేషముచే నృగేంద్రద్యుమ్నాదు లతిశయ కీర్తి నొందిరి. గోవిషయక వివాదములచే విశ్వామిత్రుఁడు శాంతి ప్రధాన మగు ఋషిత్వ మొందుటయుఁ బరశురాముఁడు శాంతిని వీడి యుగ్రత్వము నొందుటయుఁ గలిగె. (1) "సత్యకాముఁడను జారిణీ పుత్రుండు (జాబాలి) శూద్రత్వమును వీడి బ్రాహ్మణ్యము నొందుట గోపరిపాలనముచేతనె తటస్థించెను.

కాన గోవు భారతీయులలో నెట్టి మార్పునైనఁ గలిగింపఁగలదు. గోసంబంధమగు నన్నివస్తువులు భారతీయులకుఁ బరమపవిత్రములు. గవ్యమేకాక గోమూత్రము గోమయముకూడ పవిత్రములుగా నెంచఁబడును.

పంచగవ్యప్రాశనము పవిత్రకార్య మని యార్యులు తలంతురు. (2) "లేఁగతోఁగూడిన యొక్కటియైన నెవనియింట నుండదో వానికి శుభము లెట్లగును? అజ్ఞాన మెట్లు పోవును?" అని స్మృతి గోసంరక్షణము ప్రతిగృహస్థునకును విధి యని చెప్పు

---

* మృతినొందిన వాఁడు వైతరణీ నదినిదాఁటు నిమిత్తము దినవార కర్మలో గోదానముఁ జేతురు. దానికి వైతరణీ గోదానమని పేరు.

(1) ఛాందోగ్యోపనిషత్తున నీగాథకలదు.

(2) శ్లో॥ యస్యైకాపి గృహే నాస్తి ధేను ర్వత్సానుచారిణీ । మంగళాని కుతస్తస్య కుతస్తస్య తమఃక్షయః॥ అత్రిస్మృతిః॥

చున్నది. నేఁటికాలమునఁ బాశ్చాత్యులు, ముహంమదీయులు గోవును హింసించుటచే వారి నార్యమతస్థు లనుమానదృష్టితో వీక్షించుటకుఁ గారణమై గోవునం దుండుగౌరవముచే "గోసంరక్షకసమితు" లుద్భవించుటకు హేతు వగుచున్నది. గోహత్యను జేయకున్న యెడలఁ దురుష్క భారతీయ వివాదము లంతరించి దేశ మితోధికాభివృద్ధి గలదై యుండును. గోమాత తనబిడ్డకుఁ బాల నీయక మనుష్యుల బ్రతుకునకై ప్రాణాధారక మగు పయస్సు నిచ్చుటచేతనె పరోపకారపారీణ యని తలఁపఁ బడును. అట్లే బ్రాహ్మణుండును స్వార్థమును వీడి పరార్థపరుం డగుటచేతనే గోవునకుఁ బిమ్మటఁ బవిత్రుఁడుగా నెంచఁబడును. అందువలననె సద్విజుఁడు ప్రతిదినము ప్రాహ్ణమధ్యాహ్నసాయాహ్నముల సంధ్యావందనమును ముగించునపుడు (1)నాలుగు సముద్రములపర్యంతము నుండు గోబ్రాహ్మణులకు శుభమగుఁ గాక" యని చెప్పును. గోసంరక్షణమును గురించి ప్రాచీన ఋషులు రాజులు విశేషశ్రద్ధాళులై యుండిరి.

(2) అత్రి కణ్వ జమదగ్నులు గోరోగోత్పత్తి హేతు వగు క్రిమిజాతిని నశింపఁజేయు సాధనములం గనిపెట్టి రనియు "అల్గాండు, కుసూరు, శలులా" అనుక్రిములవలన గోవులకు రోగము లుద్భవించుచున్న వనియు వేదమునం గలదు. వేద

(1) చతుస్సాగరపర్యంతం గోబ్రాహ్మణేభ్యశ్శుభంభవతు॥

(2) చూడుఁడు నాచే రచింపఁబడిన వ్యవసాయచరిత్ర.

ములో గోపూజాసంబంధము మగు పెక్కు సూక్తములుగలవు. గోవు తల్లి, వృషభము తండ్రి యని భారతమునఁ గలదు. వృషభమునుగుఱించియు వేదమున విశేషముగా నున్నది. ప్రతి వత్సరము మనదేశమున మకరసంక్రమణకాలమున నాఁబోతుల నలంకరించిచేయు నుత్సవములు పరిక్షిన్మహారాజు కాలమునుండియే చేయఁబడుచుండెను. వృషభసూక్తమని పేరు గలిగిన వృషభస్తవరూపక మగు నీక్రిందిఋగర్థము మనోహరముగ నుండును.

(1) ‘‘ఈవృషభము తన నాలుగుపాదముల చేతను అలక్ష్మిని ద్రొక్కివేయుచు భూమిని కర్షణవ్యాపారముచే భేదించుచుఁ గర్షణాదివ్యాపారములచేఁ గష్టపడిన వ్యవసాయకుని ఖేదమును బోఁగొట్టుచున్నది.’’ గోవును దన్నుట మహాదోష మని యథర్వవేదమునను శ్రీమద్రామాయణమునను నిట్లు చెప్పఁబడెను.

(2) ‘‘ఎవఁడు కాలితో గోవును దాఁకుచున్నాఁడో, సూర్యునికెదురుగ మలమూత్రములను విడుచుచున్నాఁడో వానిమూలమును నశింపఁజేయుచున్నాను.’’

---

(1) పద్భిః సేది మపక్రామ న్నిరాం జఙ్ఘాభి రుత్ఖిదన్ శ్రమే ణానడ్వాన్ కీలాలం కీనాశ శ్చాభిగచ్ఛతః॥ అథ 4 11-10.

(2) యశ్చ గాం పదాస్ఫురతి ప్రత్యఙ్ సూర్యంచ మేహతి తస్య వృశ్చామి తేమూలం. అథర్వ 13-1-59.

(1) ఆర్యుఁడగు శ్రీరాముఁ డరణ్యమున కేగుటకు నే నిష్టపడియుంటినేని, పాపాత్ములకు సేవకుఁడ నగుదునుగాక. సూర్యుని కెదురుగ మలమూత్రములను విడుతునుగాక, నిద్రించు గోవును కాలితోఁ దన్నుదునుగాక. " (ఇది శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుటకు నే నిష్టపడియుండలే దని భరతుఁడు కౌసల్యకడఁ జేసిన ప్రమాణములలోనిది.)

ఎంతయో గోవు గౌరవింపఁబడుచుండు పరిక్షిద్రాజ్యసమయముననే కురుజాంగలమునఁ గొన్నిప్రదేశములలో ధర్మవిరుద్ధములు జరుగుచున్నవనియు రాజశాసనవ్యతిరేకకార్యములు చేయఁబడుచున్న వనియుఁ బరిక్షిన్మహారాజు విని రాజపురుషులచేఁ బ్రతిక్రియలఁ జేయించిన, జరుగుచున్న యధర్మములకుఁ దోడు రాజపురుషుల యతిచారములు కొన్ని ప్రజోపద్రవకరములై యుప్పతిల్లుట లోకస్వభావ మని యెఱిఁగిన ధర్మప్రభువగుటచే స్వయముగనే పోయి తదధర్మముల నణఁపఁ దలఁచి యుచితపరికరంబుల ధరించి రథారూఢుండై పోవంబోవ నొక్కెడ భూ ధర్మ దేవతారూపంబుల నున్న గోవృషఁబులఁ గలిప్రవిష్టుండును రాజలక్షణలక్షితుండును నగు క్రూరుం డగు శూద్రుండు సమీపించి,

---

(1) ప్రేష్యం పాపీయసాం యాతు సూర్యంచ ప్రతిమేహతు పాదేనహంతు గాంసుప్తాం యస్యార్యోనుమతే గతః॥ రామా. అయో 75-22

శా. కైలాసాచల సన్నిభంబగు మహా
గంభీర గోరాజముం
గాలక్రోధుఁడు దండహస్తుఁడు నృపా
కారుండు క్రూరుండు జం
ఘాలుం డొక్కఁడు శూద్రుఁ డాసురగతిం
గారుణ్యనిర్ముక్తుఁడై
నేలం గూలఁగఁ దన్నెఁ బంచితిలఁగా
నిర్ఘాతపాదాహతిన్.

మఱియును

శా. ఆలోలాంగక సశ్రుతోయకణజా
లాక్షిన్ మహాంభారవన్
బాలారూఢ తృణావళీ కబళలో
భవ్యాప్తజిహ్వాగ్రనాం
దోళస్వాంత సజీవవత్స నుదయ
ద్దుఃఖాన్వితన్ ఘర్మకీ
లాలాపూర్ణశరీర నామొదవు ను
ల్లంఘించి తన్నె న్వడిన్.

ఇట్లా ధేనువృషభంబుల రెంటిని గంటకుండై తన్నుచున్న రాజలక్షణముద్రితుఁ డయిన శూద్రునిం దౌదవ్వులం జూచి సువర్ణపరికర స్యందనారూఢుం డగు నభిమన్యునందనుండు కోదండంబు సగుణంబు సేసి మేఘగంభీరరవంబులగు వచనంబుల నిట్లనియె.

శా. నిన్నుం గొమ్ములఁ జిమ్మెనో కదిసెనో
 నిర్భీతివై గోవులం
దన్నం గారణ మేమి మద్భుజసనా
 థ క్షోణి నేవేళలం,
దు ర్నేరంబులు సేయరా తెలుఁగవా
 ధూర్తత్వమున్ భూమిభృ
త్సన్నాహంబు నొనర్చె దెవ్వఁడవు నిన్
 శాసించెదన్ దుర్మతీ.

ఓరిదుష్టా! దండింపఁదగనివారల దండించిన నిన్ను దండింతు నని వృషభంబు నుద్దేశించి యిట్లనియె.

మ. కురుధాత్రీశ్వర బాహువప్రియుగళీ
 గుప్తక్షమామండలిం
బరికింపన్ భవదీయ నేత్రజనితాం
 భశ్శ్రేణిఁదక్కన్ జనుల్
దొరగంజేయ రధర్మసంజనిత జం
 తుశ్రేణిబాష్పంబులన్
గురుభక్తిన్ విదళింతుఁజూడు మితనిన్
 గోమూర్తిదోవోత్తమా !

అని భూదేవత యగు గోదేవితో నిట్లనియె.

క. సాధువులగు జంతువులకు
బాధలు గావించుఖలుల • భంజింపనిరా

జాధమునా యుస్స్వర్గ
శ్రీధనములు వీటి బోవు • సిద్ధము తల్లి.

క. దుష్టజన నిగ్రహంబును
శిష్టజనానుగ్రహంబుఁ • జేయఁగ నృపులన్
సృష్టి విధించెఁ బురాణ
ద్రష్టలు సెప్పుదురు పరమ•ధర్మము సాధ్వీ.

అని యిట్లు ధరణీధర్మదేవతల బుజ్జగించి మహారథుం డగు ధనంజయపౌత్రుండు క్రొక్కారు మెఱుంగు తెఱంగు ధిక్కరించు తేజంబుతో దిక్కులకు వెక్కసంబయిన కలిని రూపుమాప నుద్యోగించిన, వాఁడును రాజరూపంబు విడనాడి వాడినమొగంబుతోడ భయవిహ్వలుండై హస్తంబులు సాఁచి తదాంఘ్రిజపాద మూలల విన్యస్తమస్తకుండై, ప్రణామంబుసేసి చంపకు మో రాజతిలకా! శరణాగతు రక్షింపుము. తప్పు క్షమింపు మనినఁ బరీక్షిన్మహారా జిట్లనియె.

క. అర్జునకీర్తి సమేతుం
డర్జునపౌత్రుండు భయర•సావృతజనులన్
నిర్జితులఁ జంప నొల్లఁడు
దుర్జనభావంబు విడిచి•తొలఁగు దురాత్మా.

నీవు పాపబంధుండవు. మదీయబాహుపాలితం బయిన మహీమండలంబున నిలువవలవదు. రాజదేహంబున వర్తించు నిన్ను ననసత్య లోభ చౌర్య దౌర్జన్య దురాచార మాయాకలహ

కపట కలుషాది ధర్మేతర సమూహంబు లాశ్రయించు. సత్య ధర్మంబులకు నివాసంబగు నీదేశంబున నుండరా దని వాని దేశాంతరగతుం జేసి భూధర్మదేవతలం గాపాడె. ఇట్లు పరిక్షిత్తు సద్ధర్మముగా సకలజనులకు నానందకరముగా నలువదేండ్లు రాజ్యముం జేసెను.

---

## పంచమానువాకము

### మృగయావ్యసనము

వేట సప్తవ్యసనములలో నొకటి యని ధర్మశాస్త్రజ్ఞులు గణింతురు. సింహవ్యాఘ్రాది ప్రాణిహింసక జంతుసంతతిని వేటాడుట ప్రజాపరిపాలనమున కొకప్పుడు ధర్మమ యగును. (1) "దుర్బలకులజిఘాంసువు లైన ఝషంబులను నీడద్రుమపీడాకరంబు లైన నీడజంబులను, ననవద్యతృణహింసానృశంసంబు లగు మృగంబులను మృగయావినోదంబున వధియించి మహీధవుండు కిల్బిషంబును బొందఁడు" అని రాజునకు వేట ధర్మకార్యముగా నొకఁడు చెప్పెను. ప్రభువు (2) "భోగియై బలిసిన, వేటచే మేదశ్ఛేదకృశోదరుఁడగుఁగావున లాఘవముచే నశ్వాద్యుత్థానయోగ్య శరీరముకలవాఁ డగును. మఱియు

(1) శ్రీహర్షుని మతము. (2) కాళిదాసుని మతము.

జంతువుల భయ క్రోధా ద్యవస్థలం గాంచ వీలగును. ప్రాణ ముల గుఱిచూచి కొట్టుటలో లక్ష్యశుద్ధిని గావించుకొనవచ్చు ను. కాన రాజులకు వేఁట దుర్వ్యసనమనంజనదు." అని మఱి యొకమహామహుఁ డనెను. నిర్బాధకజంతుసంతతిఁగూడ వేఁట నెపమున వధింపఁబడుట యెట్టిధర్మమో!

మఱియు నేది హింస్రకజంతువో యేది కాదో యా యధారోపణముఁ జేయు వేఁటగాఁ డెట్లు నిర్ణయింపఁగలఁడు? పూరిమేసి యేరునీరు ద్రావెడి యేణగణంబుల వధించుటలో నెట్టిధర్మంబు కలదు? గడ్డిని దినుటయె మృగంబులకు దోసంబగు నెడల సదా యోషధీచ్ఛేదనంబుననె యుదరంబు నింపుకొనెడి మనుజసంతతికూడ మనుష్యేతరజాతికి నధర్మయె యగుఁగాదె? కావుననే యహింసాతత్త్వవేత్తలు వాతాంబు జీర్ణపర్ణాశను లగు చున్నా రను వాదముకూడ చేయఁబడుచున్నది. వాతాంబువు లలోఁగూడ సూక్ష్మక్రిమిసంతతి లేదా? దానిచే నెట్లు హింస సిద్ధించు నని * "ధర్మవ్యాధుండు" వచించె. ఎట్లయిన రాజు లకుఁ గృతయుగమునుండి నేఁటివఱకు వేఁట ప్రజాసంరక్షణ పరత్వముకంటె వినోదముకొఱకె ముఖ్యముగాఁ జేయఁబడు చున్నది. ఎట్టులైన నతివేల మగు వేఁట దుర్వ్యసన మనం జెల్లు. సకలప్రాణిసాధారణానందకరమైన వసంతమునను నీటికొఱకు క్షోభించెడి గ్రీష్మమునను డప్పిచే నోరెండ నీ రెచ్చట లభించు

* ధర్మవ్యాధునిచరితము మహాభారతమునఁ గలదు.

నా యని క్రోశములమేరనుండి వాపోవుచు వచ్చుమృగంబులం బొంచి వధించుటలో నెట్టిధర్మము, వినోదముఁ గలదో మృగయానిపుణు లగు ధర్మప్రభువులకె విశదముకావలయును. నేఁటి కాలమున నీమృగయావినోదమునకై కొందఱుప్రభువులు లక్షల రూప్యములను వెచ్చించి యరణ్యములయందు నీటిపట్టుఁవుల గొన్నియంత్రసాధనములఁగూడ నేర్పఱిపించుచుండిరఁట!

సాధుజంతువులగు గోవృషభంబుల పీడనుజూచి సహింపని పరిక్షిత్తు ఒకనాఁడు ధర్మ మనియే ధనుర్ధరుండై మున్నాశ్రితోపద్రవకర శ్వాపదశిక్షణమునకై మృగయావ్యవహారోచిత వేషభాషాదికములు గలుగు పరివారముతోఁ గూడి, శ్వగణవాగురికులచేఁ బ్రథమాస్థితమగు గహనముఁబ్రవేశించి భూరి భూదారంబుల నక్షీణైణంబుల హింస్రక సింహంబుల, మాయక గోమాయువుల, జిఘాంసువ్యాఘ్రంబులఁ దక్కుంగల మ్రుక్కడిమృగములఁ బెక్కుభంగులఁ జంపియు జంపించియు మృగప్రశయంబుఁ గావించి కసిదీఱమి నొక్కమృగంబు వెంట ధూర్జటి యజ్ఞమృగంబును వెంబడించినరీతిని వెంబడించి యేయ నలక్ష్యంబై కించిద్ఘ్రాతం బగుట నది పడక యదృశ్యం బగుచు నది యవమానకరం బని దాని న్వెదకి పట్టుకొన నెంచి మిట్టపల్లంబులు వెదకుచు దారితప్పి దప్పిక వొడముచు, దాని నెందుం గానక డోలాందోళితమానసుండై పిపాసచే నెక్కడేని మృగంబుగాని పానీయంబుగాని కాన్పించునా యని వ్యసన

పిపాసలు పురిఁగొన నతయుచుఁ బోయెను.

అట్లు పోవంబోవ మొనవులచన్నులను వత్సంబులు గుడుచునప్పు డుద్గతం బగు ఫేనంబు లాహారంబుగాఁ గొని విజనం బగు విపినస్థానంబున విజితేంద్రియుండై తపంబుసేయు వృద్ధుం డగు ,, శమీకుని '' సమీపించి , విప్రోత్తమా ! నాచే నేటువడిన మృగం బెయ్యెడ కరుదెంచెనా ?' అనుచు మౌనవ్రతంబున నుండుటయె కాక బహిరింద్రియంబులను సంయమించి చిత్తంబు నీశ్వరాయత్తంబు సేసియుండుటచేఁ బరిక్షిత్తు నీక్షింపక, వానిపలుకులు వినక స్థాణువువలెన శమీకుం డుండఁ బరిక్షిత్తు చూచి యీతఁడు తన్నవమానించె నని తలంచి ఋషి యని సమాధినిష్ఠాగరిష్ఠుఁ డని వృద్ధుని రాజు సత్పురుషు నవమానింపరా దని తలంపక సమీపంబునఁ జచ్చి దుర్గంధమిళితం బగు సర్పశవంబును వింటికొపున నెత్తి శమీకున కురం బెట్టి యవమానించె. వ్యసనికుచితానుచితపరిజ్ఞానము నున్నయగుఁగాదె ? అప్పుడైన నాశమీకుఁడు స్థాణువువలెనే యుండం జూచి పరిక్షిత్తు కించిద్విచారసంసక్తమానసుం డయ్యెను రాజసంబున సర్పంబుం దిగఁద్రోయకయె తనచక్కిం జని హస్తిపురిం బ్రవేశించి యథోచితంబుగ రాజ్యంబుసేయుచుండె.

---

## షష్ఠానువాకము

### పరిక్షిత్తు శాపప్రాప్తుం డగుట

శమీకునకు శృంగియను కుమారుఁడు గలఁడు. అతం డవంధ్యకోపి, తపస్వి, వాగ్మి, మేధావి, యువ. అతఁడు స్వాశ్రమంబునఁ గృశుండను మునిపుత్త్రునితో నాడునపుడు కృశుం డోడ శృంగి యాతని నెకసక్కెమాడె; అపుడు కృశుండు శృంగిం జూచి తండ్రియెఱుత నొకరాజు చచ్చినపాము నిడ నాఁడు దానివలె మిన్నకుండిన నీ కెట్టిగౌరవ ముండె నన శృంగి సక్రోధుండై „ ఏమేమీ ! నాతండ్రికంధరంబున నొక్కరాజకిల్బిషుండు మృతసర్పంబు నైచెనే ! చెప్పుచెప్పు " మని కృశునిచే సవిస్తరంబుగఁ బరిక్షిత్తుచే శమీకుం డవమానితుం డగుటఁ దెలిసికొని మాతండ్రి నవమానించిన యధమావనిపుఁ డేడు దినంబులలోఁ దిగ్మతేజస్వి యగు తక్షకుని విషంబున నవశ్యంబు మృతుం డయ్యెడు మని జలంబు లెత్తి శపించెను. పిమ్మటఁ దండ్రికడ కేగి యప్పటికిని వెలిని మఱచి లోన మనంబును బరమేశ్వరునందె సక్తంబుసేసిన తండ్రింగాంచి ఖేదమానసుండై తండ్రియంసంబున వ్రేలు మృతసర్పంబు నవలఁ బాఱజిమ్మె. కొంతదడవునకు శమీకుండు బహిరింద్రియంబులను మనంబునఁ బ్రవేశపెట్టి మెల్లన కాలుసేతులు కదలిచి కనులువిప్ప నాతనితో శృంగి పరిక్షిత్తు నుద్దేశించి యతనివర్తనంబును దా నాతని

కిచ్చిన శాపంబును విన్నవించిన శమీకుండు దుఃఖితుండై యిట్లనియె.

క. క్రోధము తపముం జెఱచును
క్రోధము యణిమాదులైన గుణములఁ బాపుఁ
గ్రోధము ధర్మక్రియలకు
బాధ యగుం గ్రోధిగాఁ దపస్వికిఁ జనునే?

క. క్షమ లేని తపసితపమును
బ్రమత్తు సంపదయు ధర్మబాహ్యప్రభుతా
ఖ్యము భిన్నకుంభములతో
యములట్టుల యధ్రువంబులగు నవియెల్లన్.

‘‘శృంగీ! క్షమ విడిచి తీవ్ర క్రోధంబు చేకొని సకల క్షమారక్షకుండైన పరీక్షిత్తుం బరీక్షింపక శాపం బిచ్చితివి. చెట్ట చేసితివి. రాజరక్షితులయి కాదె మహామును లధికతపంబులు సేయుచు వేదవిహితానుష్ఠానంబుల నడపుచు మహాశక్తిమంతులై యున్నవారు. అట్టిరాజుల కపకారంబుఁ దలంచునంతకంటెను మిక్కిలియగు పాతకం బొండెద్ది. మఱియు నరాజకంబైన రాజ్యంబున ననేకదోషంబు లుత్పన్నము లగును. ఉద్వృత్తులను రాజు శాసించి ధర్మంబును నిలుపును. కాన రాజును ధిక్కరింప రాదు. రాజుచే ధర్మము ప్రతిష్ఠింపఁబడును. రాజుచే యజ్ఞక్రియలు నిర్విఘ్నములగును. యజ్ఞములవలన దేవతలు నిలిచిరి. దేవతలవలన వాన కురియును. వానవలన సస్యములు పం

తును. సస్యములవలన మనుష్యాదులు జీవింతురు. కాన రాజే సమస్తజీవులకు నాధారము. దానంజేసి రాజునకు ద్రోహముం దలఁపరాదు. మఱియుఁ బరిక్షిత్తుండు రాజమాత్రుండా ? భరతకులపవిత్రుండు ప్రపితామహుఁడగు పాండుభూపతివలె మనలఁ గాపాడుచుండెను.

ఉ. క్షత్రియవంశ్యులై ధరణి
గావఁగఁ బుట్టినవారు బ్రాహ్మణ
క్షత్రియ వైశ్య శూద్రు లనఁ
గా గలజాతులవారలన్ స్వచా
రిత్రముఁ దప్పకుండఁ బ
రిక్షితు కాచినయట్లు రామ మాం
ధాత్రి రఘుక్షితీశులు ము
దంబున గాచిరె యేయుగంబునన్.

"ఆతండు వ్యసనాసక్తుండు గావున రాజస్వభావలిత్యంబు నొంది నన్నవమానించి యుండును. అట్టిమహారాజు వచ్చినపు డాతిథ్య మీయకపోవుట మనతప్పుకాదె ? విదేవిప్రక్రియ నాలోచించి శాపంబునకుఁ బ్రతిక్రియ సేయుట లగ్గు" అన శృంగి పశ్చాత్తప్తుం డయ్యు నిప్పటికె నాశాపోక్తులచేఁ దక్షకుం డుజ్జ్వలదహనాకృతి నొంది పరిక్షిద్వధోపాయంబున నుండు నిఁకేల యుడుగు. నావచనంబు మోఘంబుగా దనె. శమీకుండు చింతించి తనశిష్యుఁ డగు గౌరముఖుం డనువానిం బిలిచి నీ వరిగి

పరిక్షిత్తునకు యావద్వృత్తాంతముం జెప్పి తక్షకవిషాగ్నికిం దగిన మంత్రతంత్రౌషధ క్రియలం గావించుకొమ్మనియు జాగరూకతను మెలఁగు మనియుం జెప్పుచున వాఁ డేఁగి గుర్వానతిఁ బరిక్షిత్తునకు విన్నవించి క్రమ్మఱి గురుసన్నిధిం జేరెను.

---

## సప్తమానువాకము

### పరిక్షిత్ప్రయత్నములు

అకార్యకరణంబునకుఁ గించి త్పశ్చాత్తప్తుండగు పరిక్షిత్తు తనచే శమీకుఁ డవమానితుం డయ్యు సత్వగుణప్రధానుండు నతిరాజభక్తితత్పరుండును నై యవమానించిన తన్నుఁ బ్రాణాపన్నోద్యుక్తుం గాఁ బురికొల్పుచుఁ బంపిన సందేశంబునకమితాశ్చర్యానందంబుల నొందె. శృంగియొక్క కోపప్రసాదంబునకు మిగులఁ గుందె. పిదప, తక్షకుని బారినుండి తప్పించుకొను నుపాయంబుల మంత్రులతో నాలోచించి పురపరిసరమునందుండిన పుణ్యప్రవాహినియగు విష్ణుపదీప్రవంతిలో నేకస్తంభ నిర్మితంబగు ప్రాసాదంబును నిర్మింపఁజేసి తత్ప్రాసాదంబున నేకతము మంత్రులతోఁగూడి రాజకార్యముల నడపుచు జాంగలికులు నగదంకారులు మంత్రతంత్రౌషధక్రియానిపుణులు; యోగులు మునులు దక్క నన్యుల కప్రవేశం బగునటులు శా

సించి సీమాంతముల శత్రునివారణమునకుఁ దగు సైన్యములఁ గాపుంచి సనుమానితులఁ బరిశోధింపఁ గంటకశోధకులకు జాగ్రత్త సెప్పి, మనుష్యశక్తికిఁ దగినరీతిని బ్రాణ రాజ్యత్రాణములకై జాగరూకుఁడుగ నుండి, "జాతస్య మరణం ధ్రువ" మ్మను నానుడికూడ వేఱొక ప్రక్కను బురికొలువ నాధ్యాత్మిక చింతానిమగ్నుం డయ్యెను.

యోగీశ్వరసార్వభౌముండగు శ్రీశుకుండు తత్కాలాగతుం డగుటచే బరీక్షిత్తది తనభాగ్యవిశేషంబగాఁ దలఁచి యర్ఘ్యాదిసోపచారంబుల సబ్బాదరాయణి నర్చించి తనకుఁ గలిగిన వ్యసనాతిరేకము, శమీకున కొనర్చిన యపచారము, శృంగికోపప్రసాదము శమీకుని సాత్త్వికానుగ్రహము, తనజాగరూకతయుఁ, జెప్పి తనకు ముక్తి గలుగున ట్లుపదేశంబుఁ జేయుఁడని ప్రార్థింప సమ్మహర్షి యిట్లని వైరాగ్యోపదేశము నొసఁగెను.

---

## అష్టమానువాకము

### శ్రీశుకోపదేశము

క. గోవిందనామకీర్తన
గావించి భయంబుఁ దక్కి • ఖట్వాంగధరి
త్రీవిభుఁడు సూఱగొనియెను
గైవల్యము తొల్లి రెండు • గడియలలోనన్.

కావున నీ క్షేమదినంబులు వ్యవధి యున్నది. ఇంతలో నింద్రియదమనంబు సేసి హరి పాదాంబుజంబుల నాశ్రయించిన ముక్తి దొరకుట యరుదే? యని తనవాక్చాతుర్యంబుమీఱ సద్బోధంబు చేయుచు నెడనెడఁ బరీక్షిత్తు సేయు సంప్రశ్నంబుల కుత్తరంబులు సెప్పుచు సాంఖ్యతత్త్వము నిట్లు చెప్పెను.

—♦సాంఖ్యము.♦—

సాంఖ్యవిద్యావిధానమును వినుము. పురుషప్రకృతులనఁ జేతనజడములు. ఇవి యనాదులు, స్వయంభువులు, సర్వసృష్టియుఁ బ్రకృతినుండి జన్మించినదే కాని పురుషకృతము కాదు. దేహమునందుఁ బురుషుఁడు (ఆత్మ) నిమిత్తమాత్రుఁడై యుండి ముక్తిసమయమున నందుండి వేఱైపోవును. ప్రకృతి గ్రుడ్డివాని వంటిది. ఆత్మ కుంటివానివంటిది. స్వతంత్రముగా గ్రుడ్డివాఁడు గాని కుంటివాఁడుగాని నడువనేరఁడు. కాని గ్రుడ్డివానిభుజముపైఁ గుంటివాఁడు కూరుచుండి తప్పుత్రోవను బోకుండఁ గనుపెట్టి యెంతదూరమైనఁ బోవచ్చునుగదా! అట్లే తటస్థుండగు పురుషుండును జడమైన ప్రకృతియుఁ గలిసి యీప్రపంచమంతయు నిర్మించుచున్నారు. యజ్ఞయాగాదికర్మలవలన ముక్తి లేదు. పురుషుఁ డన నీశ్వరుఁడు కాఁడు. జీవుఁడే యగుఁ గాన పరోపకారాదులవలననె ముక్తి కలుగు నందురు. వీరు నిరీశ్వరవాదులు. ఏతన్మతప్రవక్త కపిలమహర్షి.

## బౌద్ధమతము.

జీవేశ్వరులకుఁగల సంబంధము లతీంద్రియములు. అవాఙ్మానసగోచరములు, అజ్ఞేయములు, కాన వానినిగుఱించి తెలిసికొనుట యనావశ్యకము. ప్రత్యక్షానుమానములే ప్రమాణములు; వేదాదిశబ్దములు ప్రమాణములుగావు. అని బౌద్ధులముఖ్యాభిప్రాయము. సౌగతులమతమున సృష్టినిగుఱించి నాలుగుముఖ్యసిద్ధాంతములుగలవు. అవి 'భావన' లనఁబడును. అవి యెవ్వియన,

(1) "సర్వం దుఃఖం దుఃఖమ్ (2) సర్వం క్షణికం క్షణికమ్. (3) సర్వం స్వలక్షణం స్వలక్షణమ్ (4) సర్వం శూన్యమ్ శూన్యమ్॥

అనఁ బరీక్షిత్తు విని వాని యర్థము వివరింప వేఁడుచుంటినన నిట్లు శుకయోగీంద్రుఁడు వివరించె.

(1) సర్వం దుఃఖమ్మన సంసారమంతయు దుఃఖమయమనియు నీసంసారమున సుఖములేదనియుఁ దాత్పర్యము.

(2) సర్వం క్షణికమ్మనఁ బ్రతిపదార్థము క్షణకాలము మాత్రమె యుండును. ఉత్తరక్షణమున నుండదు. ఆత్మయనునది యొకస్వతంత్రద్రవ్యము కాదు; విజ్ఞానము, వేదన, సంజ్ఞ, సంస్కారము, రూపము నను పంచస్కంధముల పరిణామము. ఇపు డాలోచించునాత్మ పైక్షణమున నుండదు. క్రొత్తది వచ్చును. ఇది విజ్ఞానమయము. పూర్వవిజ్ఞాన ముత్తరవిజ్ఞానము నవలంబించి తా నంతరించును. ఇట్లు విజ్ఞాన మెప్పుడును బ్రవహిం

చుచుండును. ఇది యొకనదివంటిది. ఎప్పటి కప్పుడు నవీనోద కము వచ్చుచుఁ బ్రాంతినీరు [illegible] యొక్కటి గానె యుండురీతి నాత్మ [illegible] వ్యావహారికము. ఇది [illegible] చే వీరికి క్షణికులను నన్వర్థనామము గలిగెను.

(3) సర్వం స్వలక్షణ మ్మనుటలో సృష్టిలో నయొకవస్తువుతో నింకొకవస్తువు [illegible] లేదు. ఈ [illegible] వస్తువువలె నున్న దనుట తప్పు. కావున నవస్తులక్షణమావస్తువుదే యగు, నన్యవస్తువునకుఁ జెల్లదు.

(4) సర్వం శూన్యమ్మన నేదియు లేదని యర్థము. సర్వ శూన్యవాదులలో (౧) యోగాచారులు (౨) మాధ్యమికులు (3) సౌత్రాంతికులు (౪) వైభాషికులు నను చతుర్విధవాదులు కలరు. (౧) యోగాచారులు బాహ్యశూన్యత్వము నంగీకరించి విజ్ఞానము సత్య మనిరి. (౨) మాధ్యమికులు సర్వము శూన్య మే యనిరి. దీనింబట్టియే బౌద్ధమతము సర్వశూన్యమత మని లోకంబునఁ బ్రిసిద్ధి కలిగె.

(3) సౌత్రాంతికులు, బాహ్యర్థములు కేవల మనుమే యములు; ప్రిత్యక్షములు కా వనిరి. (౪) వైభాషికులు బా హ్యర్థములే ప్రిత్యక్షములు, విజ్ఞానమే యనుమేయ మనిరి. ఇందువలననే బౌద్ధులు బాహ్యవాదు లను నెపముపెట్టి తదితర మతస్థులు వారిని ,, బాహ్యులు ’’ లనిరి.

బౌద్ధమతమునఁ గర్మమున కెక్కుడు ప్రాముఖ్యము గలదు. కర్మ మన యజ్ఞయాగాదికము గాదు. మనుజుఁ డొనరించు పనులన్నియుఁ గర్మము లనియే యర్థము. మనుజుఁడు తా నొనరించు సదసత్కర్మలఫలము ననుభవింపక తప్పదు. దానికిఁ బ్రాయశ్చిత్తము లేదు. తప్పించుకొన వీలులేదు. అందులకై పునర్జన్మముల నెత్తవలసి యుండును. కాన జన్మరాహిత్యముఁ గోరువారు కర్మసన్న్యాసముం బొందవలయును. ఈబౌద్ధమతమునకుఁ గలియుగమునఁ బ్రచార మెక్కువ కాఁగలదు. ఈమతప్రవర్త శాక్యుఁడు.

## పూర్వమీమాంస

ఇది వేదప్రధానమతము. సాంఖ్య, సౌగతమతముల నిట్లిది ఖండించుచున్నది.

(1) సుగతుఁడే (బౌద్ధమతప్రవర్త) ధర్మజ్ఞుఁ డందుమా; కపిలుఁడు (సాంఖ్యమతప్రవర్త) ధర్మజ్ఞుఁడు కాఁ డనుట కేమైన కథగలదా? వా రిద్దఱు ధర్మజ్ఞులే యందుమా? వారి కభిప్రాయభేద మేల కలుగవలెను?"

కావున సాంఖ్య సౌగత మతములు ముక్తి నొసంగఁ జాలవు.

---

(1) శ్లో. సుగతో యది ధర్మజ్ఞః కపిలో నేతి కా కథా
తావుభౌ యది ధర్మజ్ఞౌ మతభేదః కథం తయోః.

(1) వేద మంతయు ధర్మమునకు మూలము. దానిం దెలిసినవారు చెప్పు స్మృతులు వారి చర్యలును ధర్మమునకు మూలము. సాధువుల యాచారములును ధర్మ మన నొప్పు. ధర్మముఁ జెప్పువారు లేనపు డాత్మకుఁ దృప్తి నొసఁగు కర్మమును ధర్మమే యగును.

కాన వేదోదిత నిత్య నైమిత్తిక కర్మల నాచరింప ధర్మమను నొకదేవతావిశేష ముద్భవించి మరణానంతరము స్వర్గాదిసుఖముల నొసంగును. అని పూర్వమీమాంసాకర్తలు నుడువుదురు. ,, ఏతన్మతప్రవక్త జైమినిమహర్షి."

### యోగిసిద్ధాంతము.

ప్రాణాయామాది సాధనములవలన నంతర్బాహ్యేంద్రియములను స్వాధీనపఱచుకొని సమాధినిష్ఠాగరిష్ఠుండై ముక్తి నొందవలయు నందురు. తన్మతప్రవక్త ,, పతంజలిమహర్షి."

### న్యాయదర్శనము.

యథార్థజ్ఞానసంపాదనమునకై ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము మొదలగు వానిగుఱించి చెప్పుచు నెదుటి పక్షములవారి సిద్ధాంతములను ఖండించు యుక్తులే యిందు విపులముగాఁ గాన్పించును. ఈశ్వరతత్వ మిందు మృగ్యమైయున్నది. ఏతన్మతప్రవక్త " గౌతముండు."

(1) శ్లో. వేదోఖిలో ధర్మమూలమ్ స్మృతిశీలేచ తద్విదామ్
ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవచ. హారదత్తుఁడు.

## వైశేషికదర్శనము

ఇది న్యాయదర్శనమును సర్వవిధములఁబోలియున్నది. ఇందుఁ బరమాణువాదము ముఖ్యము. పరమాణువు లణుక ద్వ్యణుకాదికముగ మాఱి యీప్రపంచముగా సృష్టింపఁబడెను. జగత్తునందుండు ప్రతిపదార్థము నణుమయము యగు. అణుసంయోగమువలననే సుఖదుఃఖములు, ధనికనిర్ధనికత్వములు, రోగములు, తన్నివారికౌషధములు మొదలగునవి కలుగుచున్న వని యుఁ బ్రళయకాలమున నీపదార్థములన్నియు నశించి యీప్రపంచము పరమాణువులుగా మాఱుననియు, వీరిమతము. ఈమతమున నీశ్వరనామమె మృగ్య మగుట నీమతము నిరీశ్వరమత మనఁ జెల్లును. ఈమతప్రవక్త „ కణాదుఁడు." పై న్యాయ వైశేషికదర్శనములను, తర్కశాస్త్రముందురు.

## ఉత్తరమీమాంస.

(వేదాంతము)

ఇది మత్పితృపాదు లగు బాదరాయణులవారు ప్రవక్తగాఁ గలది. జీవ బ్రహ్మ సంబంధములగు నుపనిషద్వాక్యముల నేఱి బాదరాయణసూత్రము లనుపేర మద్గురుపుంగవుం డానరించెను. ఈసూత్రములకె బ్రహ్మసూత్రము లని పేరు. ఇందుఁ జేర్పఁబడిన యుపనిషద్వాక్యములను „ ఉపబృంహితవాక్యము " లందురు. ఇం దాత్మానాత్మ వివేకము జీవబ్రహ్మ సంబంధము విపులముగాఁ జెప్పఁబడెను. ఈమతముపై ద్వైతా

ద్వైత విశిష్టాద్వైతాభిప్రాయములు గలవు.

### ద్వైతము.

జీవుఁ డెప్పుడు నీశ్వరుఁడు కానేరఁడు. యాతనాదేహ ధారియై పరలోకమున సుఖదుఃఖము లనుభవించు ననియు జీవుఁ డుత్కృష్టపుణ్యకర్మలచే నీశ్వరసాన్నిధ్యము నొందు ననియు ద్వైతమతము చెప్పును.

### అద్వైతము.

ఈమతమున జీవుఁ డీశ్వరుఁ డగుటకు సత్కర్మల నాచరించుచుఁ దత్కర్మఫలత్యాగి కావలయు నని చెప్పఁబడును. శివ విష్ణ్వాది భేదము లనవసరము. ఏదేవుం బూజించినఁ బూజింపవచ్చు నని యద్వైతమతము చెప్పును.

### విశిష్టాద్వైతము.

ఇందు జీవుఁ డీశ్వరుఁడు కానేరఁడు గాని జీవుఁడు ముక్తిసమయమున నీశ్వరునకు సాటియగు స్వరూపము నవలంబించు నని చెప్పఁబడును. కొందఱీమతస్థులు లక్ష్మీసమేతుఁ డగు విష్ణువే పరతత్త్వ మందురు. వారిని వైష్ణవులనం జను. మఱి కొందఱు పార్వతీసమేతుఁడగు శివుఁడే పరతత్త్వ మందురు. వారిని శైవులనం జను.

ద్వైతాద్వైతవిశిష్టాద్వైతమతములకు నుపనిషత్తులు, బ్రహ్మసూత్రములు మాత్రమెకాక యుష్మత్పితామహుండగు నర్జునుండు కురుక్షేత్రసంగ్రామసమయంబున స్వ పర జన సం

హారకారణం బగు పరిపిదారణంబునకు విచారించుచు మోహో పహతచేతస్కుం డగునపుడు ముహూర్తమాత్రింబుననే తన్మోహమును మాన్చిన శ్రీకృష్ణభగవానుని యుపదేశవాక్యములను బరమప్రమాణములు. వానికి భగవద్గీత లని పేరు. ఏమతమైనను ముక్తినొందద ననువగును. కాని భక్తిమతమె త్వరితముగ మనుజు ముక్తి నొందించుటకు దగ్గఱదారిం జూపు నని శుకుండు చెప్పఁ బరీక్షిత్తు, భక్తిమతమున కెట్టిసాధకములు కలవు ? ఎట్లు దేవదేవుని భజింపవలయు నని యడుగు శుకయోగి యిట్లు సెప్పెను.

మనోవాక్కాయకర్మలచే సఖ్యము, శ్రవణము, దాసత్వము, వందనము, అర్చనము, సేవ, ఆత్మనివేదనము, సంకీర్తనము, చింతనము ననునీతొమ్మిదిమార్గములచే శ్రీహరిని నమ్మి సేవించినయెడల ముక్తి నొందఁగలవు.

అని హరిసేవావిధానంబు లుపదేశించి పరమేశ్వరుని విరాట్స్వరూప మభివర్ణించి పరీక్షిన్మనంబునఁ బరమేశ్వరభక్తి తత్వంబు పాదుకొనం జేసి యూతనితో శుకయోగి మఱియు నిట్లనియె.

ఉ. ఏను మృతుండనౌదు నని
యింతభయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబుగల
మానవకోట్లకుఁ జావు నిత్యమౌఁ :

గాన హరిం దలంపు మిఁకఁ
గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ ! పొందెదవు
మాధవలోకనివాససౌఖ్యముల్.

అని చెప్పి శుకయోగి యథేచ్ఛముగఁ జనఁ బరిక్షిత్తు దేహపతనపర్యంతము సేయఁగల యుచితకర్మలఁ జేయుచు,

ఆ. సుతుల హితుల విడిచి • చుట్టాల విడిచి యి
ల్లాలి విడిచి బహుబ•లాళి విడిచి
రాజు హృదయ మిడెమ • రాజీవనయనుపై
ధనము విడిచి జడుఁ•దనము విడిచి.

---

## నవమానువాకము

### తక్షకుని ప్రయత్నములు

తక్షకుఁడు శృంగిచేఁ బ్రేరితుండై పరిక్షిత్తినాముహుం డగునర్జునుండు తొల్లి, ఖాండవదహనంబునఁ దనకును దనయును యాయులకు నిక్కట్టు కలుఁగఁజేసి, యపకారంబు సేయుటయు కాక, అప్పుడ తనజ్ఞాతియగు నశ్వసేమతల్లిని వధించియుఁ గర్ణ యుద్ధంబున నశ్వసేను వధించియుఁ దనజాతికై మహాపకారకా ర్యంబులఁ జేసియుండుటచే నాతనిపౌత్రుఁ డగు పరిక్షిత్తునై న

వధించి పగ నీఁగుదు నని తలంచి, ప్రత్యక్షయుద్ధంబునఁ బరిక్షిత్తుఁ జెనక శక్యంబుగా దని స్వభావంబునను కుటిలవర్తనుం డగుటచేఁ గుటిలవర్తనముననే యాతనిం జంప నిశ్చయించి తనకుఁదోడుగఁ గొందఱ భుజంగులఁగొని మాఱువేసంబుల నవలంబించి హస్తిపురి కేతెంచుచుండెను.

### కశ్యపుని కథ.

తక్షకుఁడు విషప్రయోగంబుననే పరిక్షిత్తును వధించు నని కురుదేశమునం దంతటను జనులు చెప్పుకొని పరిక్షిత్తుపైఁ గలభక్తిచే విచారమగ్ను లగుచుండ "జాంగలికుండు" ను మహాతపస్వియు నగు కశ్యపుం డను విప్రుండు విని నిస్స్వుండు గాన పరీక్షిత్తునకు విషప్రయోగంబైనఁ దాను బ్రతికించి దేశోపకారమును జేసి రాజుచే నమితమగు బహుమతి పొందవచ్చునని తలంచి విషాపనోదకములగు మణిమంత్రౌషధాదులఁ గొని యొకజనపదంబునుండి హస్తిపురి కేతెంచుచుండెను. అట్లు వచ్చు కశ్యపుని దక్షకుఁడు హస్తిపురికి గవ్యూతిమాత్ర దూరంబున దారసించి విప్రోత్తమా! మీరేయూ రెచ్చటి కేఁగుచుంటి రే యేవిద్యల నభ్యసించితి రని ప్రస్తావనపూర్వకంబున నడుగ నాతం డిట్లనియె.

కశ్య—దేశమును సుభిక్షముచేసి సత్పరిపాలనముసేయు శ్రీమత్పరిక్షిన్మహారాజు నొకబేలయుగు విప్రుఁడు గినిసి, కురు దేశముపైఁ గన్నువైచి యెట్టులైన నీదేశమున కుపద్రవము

గల్పింపఁ దలఁచు తక్షశిలానగరాధీశుండగు తక్షకునిఁ బ్రోత్స
హింప భుజంగుండును రంధ్రాన్వేషియు నగు నాతక్షకుండు ప్రి
త్యక్షంబుగఁ బరిక్షిత్తుతో ననిసేయలేక విషప్రయోగరూపునఁ గు
టిలగతి నామహారాజుం జంపయత్నించుచుండె నని వింటిని.

తక్ష—అగుఁగాక మీ కందుఁ బ్రసక్తి యేమున్నది.

కశ్య—నేను జాంగలికుఁడను. ఎట్టివిషప్రయోగంబు
నైనఁ దుత్రిటిలోఁ బాపఁగలను. నాప్రభువునకె యట్టియుక్క
ట్టులు సంభవించిన నాప్రజ్ఞం గనఁబఱచి నే నాతని విషవిము
క్తుం జేతును.

త—తక్షకుం డాశీవిషాగ్రేసరుం డని యెఱుఁగుదువా?

క—అగుఁగాక నే నాతనికాతను. మఱియు నాతని వి
షంబులఁ దుత్రిటిలో నివారింపఁగలను. నారాజునకు దేశమునకు
సంభవించు నుపద్రవంబును బోఁగొట్టి సంరక్షింప సిద్ధముగ
నుంటిని.

త—(కశ్యపునిరాజభక్తికిని దేశభక్తికిని మెచ్చి) కశ్య
పర్షీ! నీదేశభక్తికి రాజభక్తికి మెచ్చితిని. నేన యాతక్షకుండ.
నీ వెంతవాఁడ వయ్యును నావిషాగ్ని నార్పలేవు. నిదర్శనముఁ
జూడు మని సన్నిహితంబును బెక్కులూడలతో జంతువులతోఁ
గూడినదియు నగు నొక్కన్యగ్రోధముపై దనవిషంబు నుపయో
గింప నది భగ్గున మండి భస్మశేషం బయ్యె. దానిఁ దక్షకుండు
కశ్యపునకుఁ జూపి దీని కెట్టిచికిత్సఁ జేయఁగల వనియెను.

క—చూడుము నాప్రజ్ఞ నని యాభస్మముఁ జక్కఁగఁ ప్రోగుఁ జేసి మంత్రోదకముం బ్రోక్షింప నది యంకురించి యంతన ద్విదళితంబై విటపియై యెప్పటివలెఁ బెద్దమ్రానై సకల జంతు సంతానములతోఁ గూడియుండె. ఆవృక్షంబున నంతకు ముందు మత్తాకులకై హాస్తిపురినుండి వచ్చి చెట్టు నధిరోహించిన శ్రోత్రియబాలుండును జచ్చి తిరుగ బ్రదికి విటపాంతర్హితుండై వీరలనుడువులు వినుచు సేదఁదేలుచుండెను.

త—(ఆశ్చర్యాతిశయంబు నొంది) విప్రోత్తమా! నీ మహిమ కత్యానందాశ్చర్యములం బొందితిని; పరీక్షిత్తిచ్చు ధనముకంటెఁ బెక్కు మడుంగులు ధనము నీ కిచ్చెదను. పరీక్షిత్ప్రాణసంరక్షణోద్యమమును మాత్రము మానుము.

క—నీవు సేయుపని నాదేశమునకు ముప్పుఁ గలిగించును. నాదేశ మిపుడు రాజన్వంతము. నీవు, పాండవులు పరలోకప్రాప్తి నొందినసందుఁ జూచి శకునిపౌత్రుని మోసగించి గాంధారదేశమును ధ్వంసముఁ జేసి తక్షశిలారాజ్యమును స్థాపించితివి. అట్లే మాకురుదేశముఁగూడ ధ్వంసముఁ జేయఁదలఁచితివా? నీవు పాలించినయెడల రాజన్వంతం బగు కురుదేశము జిహ్మగుండ వగు నీచే రాజవంతమె యగును గాని రాజన్వంతము కానేరదు.

త—నీరాజభక్తికి మెచ్చితిని, నీజాతివాఁడు—తపస్వి—వృద్ధుఁడు—అనపరాధియు నగు శమీకు నవమానించినరాజు నిన్ను రే పవమానింపఁ డనుట కేమి నిదర్శనము? నేను మీ

జాతియందుఁ జేరికకలవాఁడనై శృంగియుఁ దేశముచేతనె పరి
క్షిత్తుఁ జంప నేతెంచితిని. గాంధారరాజ్యము నాక్రమించినటు
లు మీకురురాజ్యము నాక్రమింపను.

క— దేశమున కుపద్రవమువచ్చినపుడు జాతి మతవిభక్తత
లుండరాదు. కుటిలగమనుఁడ వగు నిన్నుఁ జేరి రేపించిన మా
శృంగియు నాకు శత్రుండ. ఏమైనం గానిమ్ము నీవు మాదేశము
నాక్రమింప వనుటకు నమ్మక మేమి? నీమాటకే నొడంబడను.

త—(తనలో) ఈతనికిఁ బట్టుదల మితిమీఱి యున్నది.
పరిక్షిత్తును నేను చంపినను, అతఁడు చేసిన లోకోపకారకార్య
ములచేఁ బ్రజల కాతనిపై భక్తి మిక్కుటమై యున్నది. అం
దువలన నాగులు దేశ మాక్రమింప దేశస్థు లంగీకరింపక తిరుగఁ
బడి నాతక్షశిలారాజ్యమును ధ్వంసముఁ జేసి నన్ను రాజ్యభ్రష్టు
నిగఁ జేయంగలుగుదురు. అందు కీబీదబాఁపని వాక్యములె తా
ర్కాణములు. ఎటులైన మిత్రుఁడగు శృంగిపని నెఱవేర్ప వచ్చి
న నేను మోఘకార్యుండ నని నాగు లనుకొనకుండఁ దగిన యు
పాయము కావింపవలయును. ఇట్లు తప్పక సేయుదును.

(ప్రకాశముగా) కశ్యపా! నీవాక్యముల కానందించితిని.
నీ వొకపని నే నొకపని చేకొని చేయుట యుక్తము. నీవు చెప్పిన
చొప్పున నీదేశమువంకం దేఱిచూడను. రాజప్రాణములనుమా
త్రము నాకు వదలుము. నీదారిద్ర్యవిచ్ఛిత్తి యగునంతకంటె
మితిమీఱిన ద్రవ్యము నీ కొసంగెదను. పరిక్షిత్తుకుమారుఁడే

రా జగును. నేను మీదేశమున కుపద్రవముం గావింపను. నమ్ముము. దీనికి నీ వంగీకరింపుము. నావారియెదుటఁ జేసినప్రతిన నెఱవేర్పనిమ్ము. దీనికి నీ వాటంకపఱచిన యెవరిశక్తి వారు చూచుకొనవలసియుండును. నాసైన్యముతో మీదేశముపై దండయాత్ర సలిపెదను. భవిష్యత్తు దైవాధీనమ యగు. నేను నొకరాజమాత్రుండ, ప్రతిజ్ఞానిర్వాహణము నాకువిధి యని తలంపుము.

క—(తనలో) వీఁడు కుటిలగమనుఁడు. దేశముపై దండయాత్ర వడసిన దేశోపప్లవ మగును. ఆడినమాట తప్పకుండఁగ నీతఁడు పరిక్షిత్తునుమాత్రము వధించినఁ గొంత మేలె యగు. అనపరాధి నవమానించినందుల కాతఁడు ప్రతిఫల మనుభవింపఁదగు. అయిన నాతనికుమారుఁడు రాజు కాఁగలఁడు కదా! నా కధికధనముకూడ లభింప నున్న దని తలంచుచుఁ దక్షకునితో (ప్రకాశముగా) తక్షకా! నీవు నీద్విజిహ్వాతఁ జూపిన నామంత్రతంత్రములచే నీరాజ్యమును నిన్నును నశింపఁజేతును, కాన మాట నిలుపుకొమ్ము. పరిక్షిత్తు నీ వెటులు సేసిన నే నంగీకరింతును. అనపరాధి యగు తపస్వి నవమానించినందుల కాఫలము పరిక్షి త్తనుభవించుఁగాక. తత్కుటుంబమునకాతి కుపద్రవము రానీయకుము. నీవును మద్గోత్రజుండ వగుట నీప్రతినను నిర్వహింపఁ జేయుటయు నాకు విధియే. నాకెంత ధన మిచ్చెదవు?

త—నీచెప్పినచొప్పునఁ జేయుదును. కురురాజ్యమునకుఁ గాని పరీక్షిద్వంశజులకుఁగాని యెట్టియుపద్రవమును రానీయను. నీకిదె కోటినిష్కములు నిచ్చుచున్నాను. అని తనభృత్యులచేఁ గొనిరాఁబడు ధనంబులోఁ గోటినిష్కంబుల నెంచి వేసడంబు లపై వేయించి పరిరక్షకులతోఁ గశ్యపునింటికిఁ జేర్ప నాజ్ఞాపించెను. కశ్యపుఁడుం దనజీవితంబున నంతటి ధనరాశిం జూడనివాఁ డగుట నత్యానందంబుం బొంది స్వజనపదంబునకు వెడలి పోయెను.

భేదోపాయముచే నట్లు కశ్యపుని లోఁబఱచుకొని తక్షకుఁడు, అనుయాయులతో హాస్తిపురిం జేరి రాజప్రాసాదముఁ జేరునుపాయంబులఁ గానక రాజు మంత్రితంత్రవిదులగు వనాటబ్రాహ్మణులకు బైరాగులకుమాత్రము ప్రవేశము నిచ్చుచున్నాఁడని విని తనయనుయాయు లగు నాగకుమారులకు మునిశిష్యుల వేసములు వేయించి మంత్రోదకములు, మంత్రించిన ఫలములు ఓషధులు వారు తమయాశ్రమమునుండి తెచ్చినట్టు లభినయింపఁజేసి పంపెను. అట్లు పంపఁబడినపండ్లలోఁ గొన్ని విషప్రయుక్తం బగునటులు విషక్రిమిదష్టంబు లైనవియు, మఱి కొన్ని మూర్ఛావిసంతన చంపువిషముం బ్రవేశపెట్టినవియుఁ గలవు. ఇట్లు వారల నంపి తాను తిరస్కరణీవిద్యచేఁ బైనుండెను. ఆనాగులు దౌవారికులచే ఋష్యాశ్రమములనుండి విషాపనోదకమంత్రోదక ఫలాదులు దెచ్చితి మని రాజునకుఁ గబు

రంపి ప్రవేశమున కనుజ్ఞ నొంది ప్రవేశించి (1) "దీర్ఘమాయు రస్తు" అని కపటాశీర్వచనంబుం జేసి యివి మున్యాశ్రమానీతం బులు మాగురువులు మీ కంపి రని యనామతరు లగు మునుల పేరులు సెప్ప, కాలకర్మవశంబున నాతండు వానిని స్వీకరించి వారి నిర్గమనంబున కనుజ్ఞ నిచ్చి శుకోపదేశంబున నిట్లు పరమే శ్వరుని ధ్యానించుచుండెను.

—♦ పరమేశ్వరునుతి, పరీక్షిన్మరణము ♦—

ఉ. ఏవిభు వందనార్చనము
లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభు లీల లద్భుతము
లెప్పుడు సంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శు
భాయతవృత్తిఁ జెలంగునండ్రు నే
నావిభు నాశ్రయించెద
నఘౌఘనివర్తను భద్రకీర్తనున్.

ఉ. ఏపరమేశు పాదయుగ
మెప్పుడుఁ గోరి భజించి నేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయ
లోకములందును జడ్డుఁ బాసి యే

(1) దీర్ఘం + ఆయుః (లేక) దీర్ఘ + మాయుః, అనిపదవిభాగము. (మాయుః = పైత్యరోగము)

తాపము లేక బ్రహ్మగతిఁ
　　దారు గతశ్రములై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద
　　నఘౌఘనివర్తను భద్రికీర్తనున్.

చ. తపములఁ జేసియైన మఱి
　　దానము లెన్నియుఁ జేసియైన నే
జపములఁ జేసియైన ఫల
　　సంచయ మెవ్వనిఁ జేర్చకున్న హే
యపదములై దురంతవిప
　　దంచితరీతిగ నొప్పుచుండు న
య్యపరిమితుఁ భజించెద
　　నఘౌఘనివర్తను భద్రికీర్తనున్.

మ. అణువో, కాక కదా మహావిభవుఁడో
　　యచ్ఛిన్నుఁడో, ఛిన్నుఁడో,
గుణియో, నిర్గుణుఁడో, యటంచు విబుధుల్
　　గుంఠీభవత్తత్త్వమా
ర్గణులై యేవిభు పాదపద్మభజనో
　　త్కర్షంబులం దత్వపే
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరముఁ
　　సర్వాత్ము సేవించెదన్.

ఉ. ఎవ్వనిచేఁ జనించు జగ
మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బర
మేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ
డెవ్వఁడు సర్వముఁ దాన యైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు
నీశ్వరునే శరణంబు వేఁడెదన్.

అని పరీక్షిత్తు పరమేశ్వరుఁ బ్రార్థించుచుఁ గుహానామునికుమారులు సన్నిధినుంచిపోయిన ఫలంబులం దత్కాలసన్నిహితులగు మంత్రులకుఁ గొన్నియిచ్చి యందుంజూపున కందంబుగ నున్న ఫలం బొండు తీసి మూర్కొనుడు నందుండు పరిమళమిళితమైనవిషము శ్వాసనాళములలోనికిఁ జొచ్చి రక్తప్రసారమునాఁపుచుండె. అంతలో రాజు మూర్ఛ నొందుచు నందుండు క్రిమిసంఘాతపుఁగాటుచే ననువులను విడిచెను. సన్నిధి నున్న మంత్రులు స్వహస్త స్థితఫలంబు లట్టివ యగు నని వానిం బారవైచుచు విషవైద్యులఁ బిలుచుతొందరలో నుండఁ దక్షకుఁ డాతనినై పుణ్యముచే నా ప్రాసాదంబున కగ్నిఁ దరికొల్ప నదియొకక్షణమునన రాజశవంబుతో భస్మీపటలం బయ్యె. తత్ప్రాసాదస్థ పరివారం బెటులనో ప్రాణంబులతో నీవలం బడిరి. భయభ్రాంతులై వారు చూచుచుండఁగనే తక్షకుం

డును మాయామాణవక వేషధారు లగు నాగులు నల్లనిదీర్ఘ దేహంబులతో నంతలోన యదృశ్యు లైరి. హఠాత్కృత మగు నీదారుణకర్మమునకుఁ బ్రతిసేయనేరక రాజకుటుంబరక్షణమును రాజ్యరక్షణమును నమాత్యులు జాగరూకులై చేయుచుఁ బంచశరద్వయస్కుఁడు బాలుండునగు జనమేజయుపైఁ గర్తవ్యముంచి పరీక్షిత్తునకుఁ బారలౌకికక్రియలు పురోహితుఁడు సేయునటులఁ జేయించిరి. పితృమేధానంతరమునఁ బౌరపురోహిత మంత్రిదండనాథులుకూడి జనమేజయునిఁ గురురాజ్యమునకుఁ బట్టాభిషిక్తుం జేసిరి.

ఇది

శ్రీమత్కౌండిన్యగోత్ర పవిత్ర పెండ్యాల వేంకయాఖ్యపుత్త్ర,
మహాభారతచరిత్ర వ్యవసాయచరిత్రాది విమర్శగ్రంథప్రణేతృ
వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి విరచితంబగు
పరీక్షిచ్చరితంబు సర్వంబును
స మా ప్త ము.

# లఘుటిప్పణి

అ

అంసలుఁడు=బలిసినవాఁడు

అగదంకారుఁడు=వైద్యుఁడు

అటమటము=వ్యర్థము

అతివేలము=హద్దుమీఱినది

అనుయాయులు=కూడవచ్చువారు

అనువాకము=కొన్నిపనసలుగలవేద భాగము

అభగ్నబాణములు=దృఢమైనబాణములు

అలక్ష్యము=కనఁబడనిది

అసంఖ్యము=వ్యర్థముకానిది

అశ్వసాది=గుఱ్ఱపురౌతు

అసదు=తక్కువ

అహంభావము=గర్వము

ఆ

ఆందోళిక=అందలము

ఆకర్ణనము=వినుట

ఆజ్యము=నేయి

ఆశీవిషము=పాము

ఆసంది=నాలుగువైపులను సమముగ నుండు మంచమువంటి యొకయానము

ఇ

ఇల్లడ=పదిలమని చెప్పి యొప్పగించుట

ఇతోధికము=ఇంతకంటె హెచ్చు

ఈ

ఈఁగు=తొలఁగించు

ఉ

ఉత్తరలోమము=పైనిరోమములు కలది

ఉత్తానీకృతము=వెల్లికిలచేయఁబడినది

ఉద్ఘాటితము=విప్పిపొడవఁబడినది

ఉద్వృత్తులు=గర్వముకలవారు

ఊ

ఊనషోడశము=పదునాఱింటికిఁ దక్కువ

ఊషరము=చవిటినేల

ఏణము=లేడి

ఒ

ఒలగొండెము=మనసును నొప్పించెడి మాట

ఔ

ఔదుంబరము=మేడిచెట్టుసంబంధమైనది

క

కంధరము=మెడ

కదళీవంధ్య=అరటిచెట్టువలె నొకసారిప్రసవించినస్త్రీ

కరగ్రాహి=కప్పముపుచ్చుకొనువాఁడు

కరీరము=మొలక

కలాపము = నెమలిపురి, చంద్రుడు
కలాపభృత్తు = నెమలి, శివుడు, కృష్ణుడు
కల్పము = బ్రహ్మదినము; ప్రళయము; బ్రహ్మయొక్క జీవితమున నీక్రింది యేడు ప్రళయములు కలుగును. (1) పార్థివకల్పము (2) కూర్మకల్పము (3) బ్రహ్మకల్పము (4) వరాహకల్పము (5) శ్వేతవరాహకల్పము (6) ప్రళయకల్పము (7) సావిత్రీకల్పము అనునవి. (ఇపుడు శ్వేతవరాహకల్పకాలము) షట్సంగములలో నొకటి.
కాకవంధ్య = కాకి రెండు గ్రుడ్లను బెట్టినరీతిని, ఇద్దరు బిడ్డలనే కనిన స్త్రీ
కాకపక్షము = పిల్లజుట్టు
కాతరులు = భయస్వభావులు
కార్తస్వరము = బంగారము
కార్తాంతికుడు = జ్యోతిషికుడు
కుహన = కపటచర్య
కృష్ణీకృతము = నలుపుచేయబడినది
క్షిప్తము = చిమ్మబడినది

గ

గవ్యూతి = రెండుక్రోశములదూరము
గోమాయువు = నక్క

చ

చంద్రశాల = మేడపైనుండినగది
చక్షుష్మంతుడు = కన్నులుగల వాడు
చామీకరము = బంగారము

జ

జన్యము = యుద్ధము
జాంగలికుడు = విషవైద్యుడు
జామిత్రశుద్ధి = లగ్నమున కేడవ యింట గ్రహములు లేకుండుట
జిఘాంసువు = చంపనిచ్ఛకలది; శత్రువు
జితోస్మి = (జితః + అస్మి) జయింపబడినవాడనైతిని
జ్ఞానంభావము = జ్ఞానముకలదనుకొనుట

ఝ

ఝరి = సెలయేరు
ఝషము = చేప

త

తన్వి = పలుచనిశరీరముకలది
తాత = తండ్రి; పితామహుడు; బ్రహ్మ
తిగ్మతేజస్వి = తీక్ష్ణమైనప్రభావము కలవాడు
తొట్టి = మొదలుకొని
తోక్కము = లేతమొల్క

ద

దక్షిణ = వైదికకార్యమున పురోహితాదుల కిచ్చు ద్రవ్యము
దస్యుత్వము = దొంగతనము

దేవానాంప్రియులు=మూర్ఖులు (అలుక్సమాసముచే నిట్టియర్థము కలుగును)

ధ

ధర్మము=ధనుస్సు; న్యాయము
ధూర్జటి=శివుఁడు

న

నరనారీకము=పురుషులయొక్క స్త్రీలయొక్క సమూహము
నవోఢ=క్రొత్త పెండ్లికూతురు
నారాయణబలి=సన్యాసికిఁ జేయు శ్రాద్ధము
నారాశంసి=నరులను గుఱించి చెప్పు వేదవాక్యము కలది
నిశ్శత్రుశేషుఁడు=శత్రుశేషము లేనివాఁడు
నిషంగము=అమ్ముల పొది
నిష్పితౄణుఁడు=పితృఋణము తీర్చినవాఁడు
నిసుఁగు=శిశువు
నిస్స్వుఁడు=దరిద్రుఁడు
నీడము=గూఁడు
నీడజము=పక్షి
నృశంసము=హింసించునది
నైకవిధములు=అనేకవిధములు
న్యూంఖ=పదునాఱు ఓకారముల నుచ్చరించిన పిమ్మట శబ్దము నుచ్చరించుట. అందు 1,7,13 ఓకారములను ప్లుతములనుగాను తక్కినవాని ననుదాత్తములఁగాను ఉచ్చరింపవలెను. ఉదా. ఓ3ఓ ఓఓఓఓ ఓ3ఓఓఓఓఓ. ఓ3ఓఓఓ ఓఓ పరిక్షిత్ (చూడుఁడు, పాణిన్యష్టాధ్యాయియొక్క 3-2-1యొక్క కాశికాభాష్యవ్యాఖ్య)

ప

పంచకరహితము=తిథివారనక్షత్రలగ్నముల సంఖ్యను కలిపి తొమ్మిదిచే భాగింపఁగా 1,2,4,6,8 సంఖ్యలు మిగులకుండుట
పంచగవ్యములు=గోవుయొక్క, మూత్రము, పేడ, పాలు, పెరుఁగు, నెయ్యి.
పక్కిడాల్వేలుపుపొక్కిలిపసిబిడ్డఁడు=బ్రహ్మ
పరిణద్ధము=బలిసినది
పరేతరాట్సుతుఁడు=ధర్మరాజు
పలపలనిమూఁక=పలుచనిమూఁక
పాత్రేసమ్మితులు=ఏపనిని జేయక భోజనపాత్రలు వేయునపుడు వినుటకు సిద్ధపడువారు? (కొన్ని సమానములిట్లు నిందార్థములం జెప్పను. చూడుఁడు పాణిన్యష్టాధ్యాయిలోని పాత్రేసమ్మితాదిగణము) [ము
పారమేష్ఠ్యరాజ్యము=మోక్షరాజ్య
పితృమేధము=తలిదండ్రులకుఁ జేయు నంత్యకర్మ

పురుషార్థత్రయము=మూఁడగు ధర్మార్థకామములు
పురోడాశము=యజ్ఞములోఁ జేయు నరిపిండి రొట్టియ
ప్రతప్తము=కాఁచఁబడినది
ప్రథమాసీతము=ముందుగాఁ బ్రవేశపెట్టఁబడినది
ప్రపాఠకము=కొన్నియనువాకములు గల వేదభాగము
ప్రవర్గ్యము=యజ్ఞములోని యొక కర్మ
ప్రస్థానము=ప్రయాణము
ప్రాహ్ణము=పగటితొలిజాము

ఫ

ఫలవదర్థావబోధము=ఫలములతోఁ గూడిన యర్థముం దెలిసికొనుట (వేదశాస్త్రములం జదివి యజ్ఞాదులం జేయుట)
ఫేనము=నురుఁగు

భ

భవితవ్యము=కాఁదగినది
భసితము=బూడిద
భావశబలత=భావములకూడిక
భూదారము=అడవిపంది
భూరి=విస్తారము
భేషజము=మందు

మ

మధుపర్కము=పెరుఁగు, బెల్లము, నేయి కలిపినది (లేక) పూర్వకాలమున పవిత్రకార్యములలో వఁడ బడిన మేకయొక్క, ఎద్దుయొక్క మాంసము
మరుత్తరాట్=మరుత్తను నొకమహారాజు
మాయావి=మోసగాఁడు
మిథస్సంభాషణము=రహస్యసంభాషణము; అన్యోన్యసంభాషణము
మేదశ్ఛేదము=క్రొవ్వుచే నణఁపఁబడినది

య

యమళులు=కవలవారు
యవలు=ధాన్యవిశేషము
యుగము=బండికాఁడి; కాలభేదముఁ దెల్పు కృతాదియుగము; జత
యువ=పడుచువాఁడు; ఒక సంవత్సరము

ర

రథ్యా=రథములు పోవుమార్గము; రథసమూహము; గుఱ్ఱము
రాజకిల్బిషుఁడు=పాపపురాజు
రాజన్వంతము=మంచిరాజు గలదేశము
రాజవంతము=రాజుమాత్రము కలదేశము
రాజసము=రజోగుణము
రాతి=మిత్రుఁడు
రుక్మపట్టము=బంగారపుపట్టా

ల

లాజహోమము = వరిపేలాలతోఁ జేయఁబడు హోమము

వ

వనస్పతి = చెట్టు; పూవక కాఁచెడి చెట్టు

వాగురికుఁడు = వలవేఁటగాఁడు

వాగ్వ్యభిచారి = మాట తప్పినవాఁడు

వార్ధ్రశవసుఁడు = అర్జునుఁడు

విహ్వాలుఁడు = భయాదులచే నవయవముల స్వాధీనము తప్పినవాఁడు

విశల్యకరణి = బాధను తొలఁగించు నౌషధి

వేశ్మజాలము = ఇండ్లవరుస

వైరాజ్యము = పైనింకొక రాజు లేకుండుట

వ్యసని = కామక్రోధాదులవలనఁ గలిగిన వేఁట, ద్యూతము మొదలగు నభ్యాసములు కలవాఁడు; ఆపద నొందినవాఁడు

వ్యాయతము = దృఢమైనది; పొడుగైనది.

శ

శరధి = అమ్ములపొది; సముద్రము

శామని = ధర్మరాజు

శిఖరిదశన = మొనలుదేఱిన దంతములు కలది.

శిబిక = పల్లకి

శ్యామ = పడుచుది; పదునాఱేండ్లవయస్సు గలస్త్రీ; ఆకుపచ్చనిరంగు కలది

శ్వాగణి = వేఁటకుక్కలగుంపు కలవాఁడు

స

సంయమించి = పరపీడాదినివృత్తి నిజేసి; నియమించి

సప్తపది = ఏడడుగులు కన్యచే త్రొక్కించెడి వివాహములోని యొకకర్మ; ఏడడుగులసమూహము

సన్నిహితము = సమీపించినది

సమితి = సభావిశేషము; సమూహము; యుద్ధము

సమ్రాట్టు = చక్రవర్తి

సుప్రతీకము = భగదత్తుఁడను రాజుయొక్క యేనుఁగు, కుబేరుని యేనుఁగు

సూక్తము = వేదములోని యొకభాగము

స్థాణువు = మోడు; శివుఁడు

స్థాయీభావము = రసమాధుర్యము

స్రక్కు = పూలదండ

స్రవంతి = నది

స్వారాజ్యము = స్వర్గరాజ్యము

హ

హరితము = పచ్చనిది ఆకుపచ్చనిది

హింస్రకము = హింసించునది